ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

అందరికీ స్వాగతం... సుస్వాగతం


బుధవారం | 12-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 57 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 7.17 తదుపరి సప్తమి; నక్షత్రం: మఖ రా. 2.12 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ.12.55-2.41; దుర్ముహూర్తం: ఉ.11.49-12.41; అమృతఘడియలు: రా.11.32-1.19; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం





ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల సాకారానికి శుభారంభం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్డీయే శాసనసభాపక్ష నేత

శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ప్రమాణ స్వీకార మహోత్సవం

తేదీ & సమయం

జూన్ 12, 2024 (బుధవారం), ఉదయం గం. 11:27 ని.లకు

స్థలం

కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద, గన్నవరం, కృష్ణా జిల్లా

ముఖ్య అతిథులు

భారత ప్రధాని **శ్రీ నరేంద్ర మోదీ గారు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ **శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ గారు**

భారత హోమ్ శాఖామాత్యులు **శ్రీ అమిత్ షా గారు**

విశిష్ట అతిథులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు **శ్రీమతి పురందేశ్వరి గారు**

జనసేన అధినేత **శ్రీ పవన్ కళ్యాణ్ గారు**

అందరికీ స్వాగతం... సుస్వాగతం

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

పారిస్ ఒలింపిక్స్‌కు ఇషా సింగ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల భారత షూటింగ్ జట్టును జాతీయ షూటింగ్ సమాఖ్య ప్రకటించింది. మంగళవారం విడుదల చేసిన ఈ జాబితాలో హైదరాబాద్ యువ షూటర్ ఇషాసింగ్‌కు స్థానం లభించింది. సెలెక్షన్ ట్రయల్స్‌లో ఇషా సత్తా చాటడంతో 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో బెర్త్ దక్కించుకుంది. పిస్టల్, రైఫిల్ విభాగంలో తలపడే షూటర్ల జాబితాను వెల్లడించగా, షాట్‌గన్ షూటర్ల పేర్లను ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ అనంతరం ప్రకటించనుంది.

ఇదే జట్టు: సందీప్ సింగ్, అర్జున్ బబుటా, శరబ్‌జోత్ సింగ్, అర్జున్ సింగ్ చీమా, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, స్వప్నిల్ కుసలె, అనీష్, విజయ్‌వీర్ సిద్ధు...ఇక మహిళల్లో ఎలవెనిల్ వలరివాన్, రమిత, సిఫ్ట్ కౌర్ సమ్రా, అంజుమ్ మౌద్గిల్, మను భాకర్, రిథమ్ సంగ్వాన్, ఇషా సింగ్

భారత్‌లో జూ. హాకీ వరల్డ్‌కప్

లోజాన్ (స్విట్జర్లాండ్): పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. ఈ మెగా ఈవెంట్ వచ్చేఏడాది భారత్ వేదికగా డిసెంబరులో జరగనుందని అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఐహెచ్ఎఫ్) మంగళవారం ప్రకటించింది. కాగా ఈసారి అత్యధికంగా 24 జట్లు పోటీపడనున్నట్టు ఐహెచ్ఎఫ్ తెలిపింది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
భారత్	2	2	0	0	4	1.455
అమెరికా	2	2	0	0	4	0.626
పాకిస్థాన్	3	1	2	0	2	0.191
కెనడా	3	1	2	0	2	-0.493
ఐర్లాండ్	2	0	2	0	0	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

భారత్ VS మినీ భారత్





గెలిస్తే సూపర్-8కు..

యూఎస్‌తో రోహిత్ సేన పోరు నేడు

జోష్‌లో ఇరు జట్లు

న్యూయార్క్: అది పేరుకే అమెరికా జట్టు.. అందులో సగం మంది భారత మూలాలున్న ఆటగాళ్లే. బ్లూ జెర్సీ వేసుకోవాలనే కల.. కలగానే మిగలడంతో దేశం వదిలి వెళ్లిన భారత ఆటగాళ్లు ఇప్పుడు అమెరికా జట్టు తరపున తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అందుకే భారత్ వర్సెస్ మినీ భారత్‌గా మారిన ఈ మ్యాచ్‌పై అందరికీ ఆసక్తి నెలకొంది. అలాగే గ్రూప్ 'ఎ'లో రోహిత్ సేనకు సమవుజ్జీగా ఉన్నది కూడా యూఎస్ జట్టేననే విషయం మరువరాదు. ఇక పాకిస్థాన్‌పై స్వల్ప లక్ష్యాన్ని భారత్ కాపాడుకుని విజయం సాధించగా.. అటు అదే పాక్ జట్టుతో మ్యాచ్‌ను యూఎస్ సూపర్ ఓవర్ వరకు తీసుకెళ్లి మరీ గెలిచింది. దీంతో ఇరు జట్లు కూడా ప్రస్తుతం రెండేసి విజయాలతో నాలుగు పాయింట్లతో ఉన్నాయి. ఎవరు గెలిచినా సూపర్-8కి వెళ్లే అవకాశం ఉంటుంది. పసికూనే కదా అని తేలిగ్గా తీసుకుంటే.. ఫలితం మరోలా ఉంటుంది కాబట్టి టీమిండియా జాగ్రత్తగా ఆడాల్సిందే. ఈ టీమ్‌లో ఆరోన్ జోన్స్, గౌస్ భారీ హిట్టింగ్‌తో అదరగొడుతుండగా, కోరే అండర్సన్ అనుభవం ఉపయోగపడగలదు. సూర్యకుమార్‌తో కలిసి దేశవాళీల్లో ముంబైకి ఆడిన యూఎస్ పేసర్ నేత్రావల్కర్‌పై అందరి దృష్టి నెలకొంది.

పిచ్, వాతావరణం

నసౌ కౌంటీ పిచ్ పేసర్లకు స్వర్గధామంగా మారింది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ బ్యాటర్లకు కష్టకాలమే. 120 స్కోరును ఛేదించడం కూడా అసాధ్యంగా మారుతోంది. టాస్ గెలిచిన జట్టు ఎప్పటిలాగే ఫీల్డింగ్‌కే మొగ్గుచూపవచ్చు. వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉండనుంది. వర్షం నుంచి ముప్పు లేదు.

శాంసన్‌ను ఆడిస్తారా?

ఇప్పటిదాకా జరిగిన రెండు మ్యాచ్‌ల్లో భారత బ్యాటర్లు ఆకట్టుకోలేకపోయారు. కీపర్ పంత్ మాత్రమే స్వేచ్ఛగా ఆడుతున్నాడు. ఓపెనర్‌గా వస్తున్న విరాట్‌తో పాటు టీ20ల్లో నెంబర్‌వన్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ పేలవ షాట్లతో నిరాశపరిచారు. రోహిత్ కూడా త్వరగానే నిష్క్రమిస్తున్నాడు. అపార అనుభవం కలిగిన వీరు పిచ్‌ను అర్థం చేసుకుంటూ క్రీజులో కుదురుకోవాలి. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించి.. జట్టులో చోటు దక్కించుకున్న శివమ్ దూబే ఆత్మవిశ్వాసంతో కనిపించడం లేదు. స్పిన్నర్లను కూడా సరిగ్గా ఎదుర్కోలేకపోతున్నాడు. దీంతో ఈ మ్యాచ్‌లో శాంసన్‌ను ఆడిస్తారా? లేక దూబేకు మరో అవకాశం ఇస్తారా? అనేది చూడాల్సిందే. స్పిన్నర్లు అక్షర్, జడేజా ఇప్పటిదాకా ప్రభావం చూపలేదు. పేస్ త్రయం బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్‌తో పాటు అదనపు బౌలర్‌గా హార్దిక్ కొనసాగనున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్, పంత్, సూర్యకుమార్, దూబే/శాంసన్, హార్దిక్, జడేజా, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్.
యూఎస్ఏ: స్టీవెన్ టేలర్, మోనంక్ (కెప్టెన్), గౌస్, జోన్స్, నితీశ్ కుమార్, అండర్సన్, హర్మీత్, జస్దీప్, కెంజిగె, నేత్రావల్కర్, అలీ ఖాన్.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

శ్రీలంక × నేపాల్ (ఉ.5. గం.)
ఆస్ట్రేలియా × నమీబియా (ఉ.6. గం.)
భారత్ × అమెరికా (రాత్రి 8. గం.)

సిక్కులకు అక్మల్ క్షమాపణ



కరాచీ: పాకిస్థాన్‌తో మ్యాచ్ సందర్భంగా ఆ దేశ మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. తీరా అది వివాదాస్పదం కావడంతో క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. ఆ మ్యాచ్‌లో చివరి ఓవర్‌ను అర్ష్‌దీప్ వేయగా.. పాక్ విజయానికి 18 పరుగులు అవసరమయ్యాయి. అయితే స్థానిక టీవీ డిబేట్‌లో పాల్గొన్న కమ్రాన్ అక్మల్ మాట్లాడుతూ.. 'అర్ష్‌దీప్ ఓవర్ కాబట్టి మ్యాచ్‌లో ఏమైనా జరగొచ్చు. ఎందుకంటే రాత్రి 12 గంటలైంది కదా' అంటూ సర్దార్జీలపై ఉండే జోక్‌లనుద్దేశిస్తూ ఎద్దేవా చేశాడు. అటు ఈ కామెంట్స్‌ను మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రంగా తప్పుపట్టాడు. 'అనుచితంగా మాట్లాడే ముందు సిక్కుల చరిత్ర తెలుసుకో. ఆక్రమణదారులు మీ తల్లులను, సోదరీమణులను ఎత్తుకెళ్లినప్పుడు వారిని కాపాడింది సిక్కులే. అప్పుడు సమయం రాత్రి 12 గంటలే అయ్యింది. నిన్ను చూస్తే సిగ్గుగా ఉంది' అంటూ సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించాడు. ఈనేపథ్యంలో కమ్రాన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నాడు. 'నా కామెంట్స్‌పై విచారం వ్యక్తం చేస్తూ హర్భజన్‌తో పాటు సిక్కు సమాజానికి క్షమాపణలు చెబుతున్నాను. నేనలా మాట్లాడాల్సిందికాదు' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.

బోణీ కొట్టిన పాక్

- రిజ్వాన్ అర్ధ శతకం
- 7 వికెట్లతో కెనడా చిత్తు
- జాన్సన్ పోరాటం వృథా



న్యూయార్క్: గత రెండు మ్యాచ్‌ల్లో ఓటములతో డీలాపడ్డ పాకిస్థాన్.. టీ20 వరల్డ్‌కప్‌లో ఎట్టకేలకు బోణీ చేసింది. గ్రూప్-ఎలో మంగళవారం పసికూన కెనడాతో జరిగిన మ్యాచ్‌లో పాక్ 7 వికెట్ల తేడాతో గెలిచింది. కెనడా నిర్దేశించిన 107 పరుగుల లక్ష్యాన్ని పాక్ 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రిజ్వాన్ (53 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్), కెప్టెన్ బాబర్ ఆజమ్ (33) రెండో వికెట్‌కు 62 బంతుల్లో 63 పరుగుల భాగస్వామ్యంతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్ ఛేదనలో ఓపెనర్లు రిజ్వాన్, సైమ్ ఆయుబ్ (6) ఆరంభం నుంచి ఆచితూచి ఆడడంతో పవర్‌ప్లే పేలవంగా సాగింది. ఐదో ఓవర్‌లో ఆయుబ్‌ను డిలాన్ క్యాచవుట్ చేసి దెబ్బ కొట్టాడు. కాగా, ఆరో ఓవర్‌లో రిజ్వాన్ తొలి బౌండ్రీ సాధించడంతో.. పవర్‌ప్లేలో పాక్ 28/1 స్కోరు చేసింది. ఎక్కువగా స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించిన బాబర్.. 10వ ఓవర్‌లో జునైద్ బౌలింగ్‌లో సిక్స్‌తో మ్యాచ్‌లో ఊపుతెచ్చే ప్రయత్నం చేశాడు. అయితే, విజయానికి 32 బంతుల్లో 24 పరుగులు కావాల్సి ఉండగా.. బాబర్‌ను డిలాన్ పెవిలియన్ చేర్చాడు. ఫఖర్ జమాన్ (4)ను గోర్డన్ వెనక్కి పంపాడు. కానీ, తుదికంటా క్రీజులో నిలిచిన రిజ్వాన్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. పాక్ మరో 15 బంతులు మిగిలుండగానే నెగ్గింది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 106/7 స్కోరు చేసింది. ఓపెనర్ ఆరన్ జాన్సన్ (44 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52) అర్ధ శతకంతో పోరాడినా.. మిగతా వారి నుంచి అతడికి కనీస సహకారం కరువైంది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఆమెర్, రౌఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో విజయంతో సూపర్-8 అవకాశాలను పాక్ సజీవంగా నిలబెట్టుకొంది.

సంక్షిప్త స్కోర్లు

కెనడా: 20 ఓవర్లలో 106/7 (జాన్సన్ 52; ఆమెర్ 2/13, రౌఫ్ 2/26).
పాకిస్థాన్: 17.3 ఓవర్లలో 107/3 (రిజ్వాన్ 53 నాటౌట్, బాబర్ 33; డిలాన్ 2/18).

కతార్ చేతిలో భారత్ ఓటమి

ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ నుంచి అవుట్

దోహా: ఫిఫా వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ నుంచి భారత ఫుట్‌బాల్ జట్టు నిష్క్రమించింది. మంగళవారం ఇక్కడ జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత్ 1-2 గోల్స్ తేడాతో కతార్ చేతిలో పరాజయం పాలైంది. తద్వారా తదుపరి రౌండ్ చేరడంలో విఫలమైన భారత్.. క్వాలిఫయర్స్ నుంచి నిరాశగా వెనుదిరిగింది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను లాలియాన్‌జువాల ఛాంగ్తే (37వ) కొట్టగా.. కతార్ జట్టులో యూసుఫ్ యెమన్ (73వ), అహ్మద్ అల్ రవి (85వ) చెరో గోల్ సాధించారు.

సాత్విక్ జోడీ చేజారిన నెం. 1

న్యూఢిల్లీ: భారత డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి వరల్డ్ నెంబర్ వన్ ర్యాంక్‌ను కోల్పోయింది. సింగపూర్, ఆస్ట్రేలియా ఓపెన్‌లలో నాకౌట్‌కు చేరలేకపోవడం ఈ జోడీ ర్యాంకింగ్స్‌ను దెబ్బతీసింది. బీడబ్ల్యూఎఫ్ మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో సాత్విక్ ద్వయం మూడో స్థానానికి దిగజారింది. లియాంగ్-వాంగ్ (చైనా), ఆస్ట్రప్-అండర్స్ (డెన్మార్క్) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. సింగిల్స్‌లో ప్రణయ్ (10), లక్ష్యసేన్ (14) తమ ర్యాంకుల్ని నిలబెట్టుకున్నారు. ఇక కిడాంబి శ్రీకాంత్ 4 స్థానాలు దిగజారి 32వ ర్యాంక్‌కు చేరగా, ప్రియాన్షు రజావత్ 34, కిరణ్ జార్జ్ 35వ స్థానంలో ఉన్నారు. సింధు 10వ ర్యాంక్‌లోనే ఉంది. డబుల్స్‌లో తనీషా-అశ్విని ఒక స్థానం మెరుగై 19వ ర్యాంక్, గాయత్రి-ట్రీసా జాలీ ద్వయం ఒక స్థానం ఎగబాకి 24వ స్థానానికి చేరింది.



బాధ్యతలు స్వీకరించిన క్రీడామంత్రి మన్సుఖ్

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా మన్సుఖ్ మాండవ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 52 ఏళ్ల మాండవ్య గుజరాత్‌లోని పోర్‌బందర్ స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆయన గత ప్రభుత్వంలో ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా క్రీడా శాఖ సహాయ మంత్రిగా రక్షా ఖడ్సే కూడా బాధ్యతలు చేపట్టారు.

బిజినెస్

హైదరాబాద్‌లో ఓపెన్‌టెక్స్ కొత్త సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సమాచార సాంకేతిక పరిజ్ఞానంలోని ఓపెన్‌టెక్స్ మంగళవారం హైదరాబాద్‌లో కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఫినిక్స్ టెక్ జోన్‌లో నాలుగు అంతస్తుల్లో దీన్ని ఏర్పాటు చేశారు. తమ ఇంజనీరింగ్ కార్యకలాపాలకు ఇది హబ్‌గా ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ కేంద్రంలోని ఇంజనీర్లు అనేక ఓపెన్‌టెక్స్ బిజినెస్ క్లౌడ్స్‌కు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్లోబల్ ఏఐ ఇన్నోవేషన్స్‌లో ఈ సెంటర్ కీలక పాత్ర పోషించనుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ ముహి మజీబ్ అన్నారు. ఓపెన్‌టెక్స్ ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల్లో సెంటర్లను నిర్వహిస్తోంది.

స్టార్టప్‌లకు అనుకూల నగరం హైదరాబాద్

హైదరాబాద్: ఆసియాలో స్టార్టప్‌లకు అనుకూల వాతావరణం ఉన్న ఉత్తమ నగరాల జాబితాలో హైదరాబాద్ స్థానం దక్కించుకుంది. అమెరికాకు చెందిన స్టార్టప్ జెనోమ్ సంస్థ "2024 గ్లోబల్ స్టార్టప్ ఎకోసిస్టమ్ రిపోర్ట్" పేరిట విడుదల చేసిన నివేదికలో హైదరాబాద్‌కు ఈ ప్రత్యేక గుర్తింపు లభించింది. ఆ జాబితాలో హైదరాబాద్ 19వ స్థానంలో నిలిచింది. పనితీరు,నిధుల కల్పన,ప్రతిభ,అనుభవం, మార్కెట్ పరిశోధన,పరిజ్ఞానం కొలమానాలుగా ఈ సర్వే నిర్వహించారు. 2014లో 200 స్టార్టప్‌ల స్థాయి నుంచి నేడు 7,500 స్టార్టప్‌లు గల నగరంగా హైదరాబాద్ నిలవడం గర్వకారణమని టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస రావు అన్నారు.

ఏపీ, తెలంగాణల్లో హ్యుండయ్ డిజిటల్ ఫ్లోట్ కార్యక్రమం



హైదరాబాద్: కొరియా కార్ల తయారీ దిగ్గజం హ్యుండయ్ మోటార్ ఇండియా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిజిటల్ ఫ్లోట్ కార్యక్రమం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల కస్టమర్ల ముంగిటిలోనే తమ ఉత్పత్తుల అనుభూతిని కలిగించడం ఈ కార్యక్రమం లక్ష్యం. 4 డిజిటల్ ఫ్లోట్లను ప్రవేశపెట్టడం ద్వారా రెండు రాష్ట్రాల్లోని 75కి పైగా గ్రామీణ ప్రాంతాలను కవర్ చేయాలని కంపెనీ భావిస్తోంది. ఇందులో భాగంగా గ్రాండ్ ఐ10 నియోస్, ఎక్స్‌టర్, వెన్యూలను నేరుగా వినియోగదారుల ముంగిటికే తరలించి వాటి అనుభూతి కస్టమర్‌కు కలిగేలా చేస్తారు. కంపెనీ ఆర్ఎస్‌హెచ్ రామ్‌కుమార్, ఆర్‌పిఎస్‌హెచ్ స్వప్నిల్ చౌదరి, ఇతర అధికారులు ఇందుకు సంబంధించి డిజిటల్ వ్యాన్లను ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలకు

45 నిమిషాల్లో రుణం



10 సెకన్లలోనే రుణ దరఖాస్తుపై నిర్ణయం

ఎస్ఎంఈ డిజిటల్ లోన్స్ పేరుతో ప్రత్యేక పథకం

ఎస్‌బీఐ వెల్లడి

ముంబై: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీల (ఎంఎస్ఎంఈ) రుణ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్ణయించింది. వచ్చే ఐదేళ్లు బ్యాంకు రుణాల వృద్ధి, లాభాలకు ఈ సంస్థలే కీలకమని భావిస్తున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా అన్నారు. అంతేకాకుండా ఈ సంస్థల రుణ అవసరాలను వేగంగా మదింపు చేసి, రుణాలు మంజూరు చేసేందుకు 'ఎస్ఎంఈ డిజిటల్ బిజినెస్ లోన్స్' పేరుతో ప్రత్యేక పథకం ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా 10 సెకన్లలో ఎంఎస్ఎంఈల రుణ అర్హతను మదింపు చేసి, 45 నిమిషాల్లోనే రుణాలు మంజూరు చేయనున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది.

ఇవే ఆధారం: జీఎస్‌టీ రిటర్న్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఆదాయ పన్ను (ఐటీ) శాఖకు సమర్పించే ఐటీఆర్‌లలోని వివరాల ఆధారంగా ఎస్‌బీఐ ఈ పథకం కింద ఎంఎస్ఎంఈల రుణ అర్హతను మదింపు చేస్తుంది. దీంతో ఎంఎస్ఎంఈల రుణ మార్కెట్లో తమ స్థానం మరింత పటిష్ఠమవుతుందని భావిస్తోంది. ప్రస్తుతం దాదాపు అన్ని బ్యాంకులు ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న ఎంఎస్ఎంఈల రుణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. కొద్దిపాటి రిస్క్ ఉన్నా ఈ సంస్థలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు జంకడం లేదు. గత ఆర్థిక సంవత్సరం ఎస్‌బీఐ ఈ సంస్థలకు రూ.4.33 లక్షల లక్షల కోట్ల రుణాలు ఇచ్చింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 20 శాతం ఎక్కువ. ఈ ఆర్థిక సంవత్సరం ఈ రుణ పోర్టుఫోలియోను మరింత పెంచుకోవాలని ఎస్‌బీఐ భావిస్తోంది.

రూ.25,000 కోట్ల సమీకరణకు సన్నాహాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణ పత్రాల జారీ ద్వారా 300 కోట్ల డాలర్లు (సుమారు రూ.25,000 కోట్లు) సమీకరించాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. డాలర్లు లేదా ఇంకో విదేశీ కరెన్సీ రూపంలో ఈ రుణ పత్రాల నిధుల సమీకరించేందుకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదం తెలిపింది. మార్కెట్ పరిస్థితిని బట్టి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతల్లో ఈ నిధులు సమీకరిస్తారు. ఏ అవసరం కోసం ఈ రుణ పత్రాలు జారీ చేస్తోందీ ఎస్‌బీఐ వెల్లడించలేదు. ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) కూడా రూ.10,000 కోట్లు సమీకరించనుంది. ఇందులో రూ.6,000 కోట్లు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా, మిగతా రూ.4,000 కోట్లు రుణ పత్రాల జారీ ద్వారా సమీకరించనుంది.

బీపీసీఎల్ ప్రైవేటీకరణకు ఫుల్‌స్టాప్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రైవేటీకరణను మోదీ సర్కార్ ప్రస్తుతానికి పక్కన పెట్టింది. వరుసగా రెండోసారి కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన హర్‌దీప్ సింగ్ పురి ఈ విషయం వెల్లడించారు. అధిక ఆదాయం, మంచి లాభాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థలు వేటినీ ప్రైవేటీకరించే యోచన లేదన్నారు. ఎన్‌డీఏ 2.0 హయాంలో బీపీసీఎల్ ఈక్విటీలో ప్రభుత్వానికి ఉన్న 52.9 శాతం వాటాను అమ్మకానికి పెట్టిన విషయం తెలిసిందే. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుతో మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత వస్తుందనే భయంతోనే మోదీ సర్కార్ ఈ విషయంలో వెనక్కి తగ్గినట్టు భావిస్తున్నారు. కాగా కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని కేజీ-డీడబ్ల్యూఎన్-98/2 బ్లాక్ నుంచి త్వరలో రోజువారీ చమురు ఉత్పత్తి 45,000 బ్యారళ్లకు చేరుతుందని పురి చెప్పారు. ఈ ప్రాంతంలో త్వరలో గ్యాస్ ఉత్పత్తి కూడా ప్రారంభం కానుందన్నారు. దిగుమతుల భారం తగ్గించేందుకు, దేశీయంగా చమురు, గ్యాస్ ఉత్పత్తి పెంచేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. చెన్నైలో ఐఓసీ కొత్తగా నిర్మిస్తున్న రిఫైనరీకి చేరువలో బీపీసీఎల్ కూడా త్వరలో కొత్త రిఫైనరీ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు.

రాబోయే మూడేళ్లూ భారత్ దూకుడే : ప్రపంచ బ్యాంక్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా రాబోయే మూడు సంవత్సరాలూ భారత్ 6.7 శాతం నిలకడ వృద్ధితో ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. అయితే ప్రపంచ వృద్ధి 2024 సంవత్సరంలో 2.6 శాతంగా ఉండి 2025-26లో 2.7 శాతం అవుతుందని తాజా నివేదికలో పేర్కొంది. కొవిడ్-19కి ముందు దశాబ్ది కాలంలో నమోదైన 3.1 శాతం సగటు వృద్ధి కన్నా ఇది తక్కువే. కాగా ఈ ఏడాది ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో ప్రైవేట్ వినియోగంలో వృద్ధి పెరగనున్నట్టు పేర్కొంది.

పత్రాల కోసం క్లెయిమ్‌ను తిరస్కరించొద్దు..

- సాధారణ బీమా కంపెనీలకు మాస్టర్ సర్క్యులర్ జారీ చేసిన ఐఆర్‌డీఏఐ



న్యూఢిల్లీ: సాధారణ బీమా కంపెనీలు పత్రాల కోసం బీమా క్లెయిమ్‌ను తిరస్కరించరాదని భారత బీమా అభివృద్ధి, నియంత్రణ ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) స్పష్టం చేసింది. సాధారణ బీమా సేవల సంస్కరణలో భాగంగా విడుదల చేసిన మాస్టర్ సర్క్యులర్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. "పత్రాల కోసం పాలసీదారులకు సంబంధించిన ఎటువంటి దావానూ తిరస్కరించడానికి వీల్లేదు. అవసరమైన పత్రాలను పాలసీ అండర్ రైటింగ్ సమయంలోనే కోరాలి. అలాగే, పాలసీదారు నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ సంబంధిత, అవసరమైన పత్రాలను మాత్రమే కోరాలి. అదీ, క్యాష్‌లెస్ వసతి అందుబాటులో లేకపోతేనే" అని సర్క్యులర్‌లో పేర్కొంది. మరిన్ని విషయాలు..

- పాలసీదారు ఏ సమయంలోనైనా బీమా కంపెనీకి సమాచారం అందించి పాలసీని రద్దు చేసుకోవచ్చు. బీమా కంపెనీ మాత్రం పాలసీదారు మోసానికి పాల్పడినట్లు నిరూపించాకే పాలసీని రద్దు చేసే వీలుంటుంది. పాలసీ రద్దు సందర్భంలో, పాలసీదారుకు ప్రీమియాన్ని దామాషా పద్ధతిలో రిఫండ్ చేయాల్సి ఉంటుంది.
- క్లెయిమ్ సెటిల్‌మెంట్స్‌కు సంబంధించి సర్వేయర్ నియామకం, వారి రిపోర్టుల సమర్పణ సహా మిగతా అంశాలకు సంబంధించి ఐఆర్‌డీఏఐ కఠిన కాలక్రమాన్ని నిర్దేశించింది. సకాలంలో సర్వేయర్ నుంచి నివేదికల పొందడం బీమా సంస్థ విధి అని నియంత్రణ మండలి స్పష్టం చేసింది.
- వాహన బీమా విషయంలో పే యాజ్ యూ డ్రైవ్/ పే యాజ్ యూ గో ఆప్షన్లను కస్టమర్లకు మొదటి ఎంపికగా అందించాలి.
- గృహ యజమానులకు అగ్ని ప్రమాద బీమా పాలసీలో వరదలు, తుపాను, భూకంపాలు, కొండచరియలు విరిగి పడటం, గుట్టలు కూలడం, తీవ్రవాద నష్టాలు వంటి యాడ్ ఆన్ కవరేజీలను ఎంపిక చేసుకునే ఆప్షన్ కూడా కల్పించాలి. అలాగే, అగ్ని ప్రమాదంతో పాటు అనుబంధ ప్రమాదాల సమగ్ర పాలసీ నుంచి ఏదో ఒక కవరేజీ నుంచి వైదొలిగే వెసులుబాటునూ కల్పించాలి.
- బీమా కంపెనీలు పాలసీదారుకు బీమా పథకానికి సంబంధించిన కీలక సమాచారాన్ని సరళంగా, స్పష్టంగా, సంక్షిప్తంగా వివరించే కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ (సీఐఎస్) అందించాల్సి ఉంటుంది.

మ్యాట్రిక్స్ ఫార్మాలో కోటక్ ఆల్టర్నేట్ రూ.1,445 కోట్ల పెట్టుబడి

ముంబై: నిమ్మగడ్డ ప్రసాద్ నేతృత్వంలోని మ్యాట్రిక్స్ ఫార్మా.. దేశీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలను ఆకర్షిస్తోంది. కోటక్ మహీంద్రా గ్రూప్‌లోని ఆల్టర్‌నేటివ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ సంస్థ కోటక్ ఆల్టర్నేట్ అసెట్ మేనేజర్స్ లిమిటెడ్ (కేఏఏఎంఎల్) మ్యాట్రిక్స్ ఫార్మాలో రూ.1,445 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈక్విటీ, రుణాల రూపంలో ఈ పెట్టుబడి పెట్టినట్టు కేఏఏఎంఎల్ తెలిపింది. మ్యాట్రిక్స్ ఫార్మా ఈ నిధులను అమెరికా కేంద్రంగా పని చేసే వయాట్రిస్ కంపెనీకి చెందిన యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) వ్యాపార కొనుగోలుకు వినియోగిస్తుంది. ఈ కొనుగోలుతో యాంటీరిట్రోవైరల్ (ఏఆర్‌వీ) ఏపీఐల వ్యాపారంలో మ్యాట్రిక్స్ ఫార్మా దేశంలో రెండో అతిపెద్ద కంపెనీగా ఎదగనుంది.

కేఏఏఎంఎల్ ఈ నిధులను కోటక్ స్ట్రాటజిక్ సిట్యుయేషన్స్ ఫండ్-2 ద్వారా సమకూర్చింది. మైలాన్ ఎన్‌వీ- ఫైజర్ కంపెనీకి చెందిన అప్‌జాన్ యూనిట్ల విలీనంతో 2020లో వయాట్రిస్ ఇంక్ కంపెనీ ఏర్పాటైంది. కీలకేతర వ్యాపారాల నుంచి తప్పుకోవాలన్న నిర్ణయంలో భాగంగా వయాట్రిస్ గత ఏడాది అక్టోబరులో భారత్‌లోని తన ఏపీఐ, ఉమెన్స్ హెల్త్‌కేర్ వ్యాపారాలను 120 కోట్ల డాలర్లకు విక్రయించింది. ఇందులో ఏపీఐ వ్యాపారాన్ని నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన మ్యాట్రిక్స్ ల్యాబ్స్ అనుబంధ సంస్థ ఐక్వెస్ట్ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఉమెన్స్ హెల్త్‌కేర్ బిజినెస్‌ను స్పెయిన్‌కు చెందిన ఇన్సుడ్ ఫార్మా చేజిక్కించుకుంది.

ఆద్యంతం ఒడుదుడుకులే..

స్వల్ప నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ ఒక దశలో 370 పాయింట్ల వరకు ఎగిసింది. కానీ, చివరివరకు లాభాలను నిలబెట్టుకోలేకపోయింది. ఆఖరి గంటలో ఇన్వెస్టర్లు పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడటంతో సెన్సెక్స్ 33.49 పాయింట్ల నష్టంతో 76,456.59 వద్దకు జారుకుంది. నిఫ్టీ మాత్రం 5.65 పాయింట్ల లాభంతో 23,264.85 వద్ద స్థిరపడింది.

ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓకు సెబీ ఓకే

విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు సెబీ ఆమోదం తెలిపింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా కంపెనీ రూ.5,500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన రూ.1,750 కోట్ల విలువైన 9.519 కోట్ల షేర్లను విక్రయించే అవకాశం ఉంది. అంటే, ఐపీఓ ద్వారా సంస్థ మొత్తం రూ.7,250 కోట్ల వరకు సమీకరించనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,840 ▲	65,850 ▲	95,000 ▼
ముంబై	71,445 ▲	65,444 ▲	87,708 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ

హైదరాబాద్	525	విజయవాడ	530
వరంగల్	527	గోదావరి	525
చిత్తూరు	593	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	130	విజయవాడ	136
వరంగల్	130	గుంటూరు	138
కరీంనగర్	130	ఒంగోలు	138
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	150
కర్నూలు	130	నెల్లూరు	150
విశాఖపట్నం	130	అనంతపురం	136
గోదావరి	136		

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

పరీక్ష పవిత్రత దెబ్బతింది!

'నీట్'పై మీ సమాధానం చెప్పండి

కేంద్రం, ఎన్టీఏకు సుప్రీం నోటీసులు.. తక్షణమే జవాబివ్వాలని ఆదేశం

తదుపరి విచారణ జూలై 8కి.. నీట్ కౌన్సెలింగ్‌పై స్టేకు నిరాకరణ

పరీక్ష, ఫలితాలను అనుమానిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు

వాటిపై ఇంకా స్పందించని ఎన్టీఏ

9

హైదరాబాద్‌లో భారీ వర్షం

పలు ప్రాంతాల్లో 4 సెం.మీ.కు పైగా నమోదు

నిర్మల్, నిజామాబాద్, యాదాద్రి జిల్లాల్లో వాన

10 నేడు పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

బుధవారం | 12-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 57 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

కేసీఆర్‌కు నోటీసులు

'కరెంటు కొనుగోళ్ల' రికార్డులు చూస్తే మీరే నిర్ణయాలు తీసుకున్నట్టు తెలుస్తోంది

లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలి

జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ ఆదేశం

జూలై 30 వరకు గడువు కోరిన మాజీ సీఎం

ఈ నెల 15లోపు వివరణ ఇవ్వాలన్న కమిషన్

కేసీఆర్‌తో పాటు 25 మందికి నోటీసులు

ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి విద్యుత్కేంద్రాల నిర్మాణంపై విచారణ

అర్వింద్ కుమార్ లేఖ కీలకం

కమిషన్‌కు మరిన్ని వివరాలు ఇవ్వనున్న రఘు, కోదండ, వేణుగోపాల్, తిమ్మారెడ్డి


జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రాల నిర్మాణ అంశాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. 'రికార్డులను పరిశీలిస్తుంటే ఆ నిర్ణయాలన్నీ మీరే తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఆయా అంశాల్లో మీ పాత్రపై లిఖితపూర్వకంగా వివరాలు అందించాలి' అని ఆదేశించింది. కాగా, తనకు జూలై 30వ తేదీ వరకు గడువు ఇవ్వాలని కేసీఆర్ విజ్ఞప్తి చేయగా.. కమిషన్‌కు అందుబాటులో ఉన్న పరిమిత

మిగతా 11వ పేజీలో...

'కాళేశ్వరం'పై అబద్ధాలు చెబితే క్రిమినల్ కేసులు

బ్యారేజీల వైఫల్యానికి కారణాలేంటో చెప్పాలి.. విచారణలో చెప్పిందే అఫిడవిట్‌లో ఉండాలి 11

అధికార్లకు జస్టిస్ పీసీ ఘోష్ హెచ్చరిక

25లోగా అఫిడవిట్ల దాఖలుకు నిర్దేశం

గొర్రెల పంపిణీ స్కామ్.. మౌనమే నిందితుల జవాబు!

ఏసీబీ ప్రశ్నలకు నోరు మెదపని రాంచందర్, కల్యాణ్ 12

రాజకీయ లింకులు రాబట్టేలా ప్రశ్నలు

టీఎస్ఎల్‌డీఏ సీఈవో రాంచందర్‌పై సస్పెన్షన్ వేటు

12

ఫోన్ ట్యాపింగ్ కేసులో చార్జ్‌షీట్.. భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు.. నేడు తీర్పు


ఏపీ శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును ప్రతిపాదించిన పవన్

అమరావతే ఏపీ రాజధాని

ఆర్థిక రాజధానిగా విశాఖ.. పవన్ స్ఫూర్తి భేష్

7 ఇక కూల్చివేతలు, నరికివేతలు ఉండవు

కక్ష తీర్చుకోవాలంటే సమస్యలే.. అలాగని క్షమిస్తే అలవాటవుతుంది.. చట్టపరంగా శిక్షించాలి: బాబు

హైదరాబాద్-విజయవాడ హైవేపై స్థిరాస్తి బూమ్

ఏపీలో చంద్రబాబు సర్కార్ రావడంతో ప్రభావం

హైదరాబాద్ మార్కెట్‌లో స్తబ్ధత.. ఐనా ఆశావహమే

10 స్థిరాస్తి కన్సల్టెన్సీ సంస్థ అన్‌రాక్ అంచనా

నేడే బాబు ప్రమాణం

చంద్రబాబును ఏపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న కూటమి ఎమ్మెల్యేలు

ఉదయం 11.27 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణం

మంత్రివర్గం కూడా!.. గన్నవరం సమీపంలో వేదిక

విజయవాడ చేరుకున్న షా, నడ్డా.. నేడు ప్రధాని రాక

దేశ, విదేశీ ప్రముఖులకు ఆహ్వానాలు

రేపు డీఎస్సీ, పింఛను పెంపు ఫైళ్లపై తొలి సంతకాలు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకూ ఆమోదం!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏపీలో 'కూటమి' కొలువు తీరేందుకు సర్వం సిద్ధమైంది. నవ్యాంధ్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఆయన కొత్త మంత్రివర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గన్నవరం విమానాశ్రయానికి సమీపంలో ఎంపిక చేసిన మైదానంలో భారీ జన సందోహం నడుమ ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, కొందరు కేంద్ర మంత్రులు, దేశ విదేశాలకు చెందిన ప్రత్యేక ఆహ్వానితులు, కొత్తగా ఎంపికైన శాసనసభ్యులు, ఇతర

మిగతా 7వ పేజీలో...

ఒడిసా సీఎంగా మోహన్ చరణ్ మాఝీ

9

గిరిజన నేతకు అవకాశమిచ్చిన బీజేపీ

భువనేశ్వర్‌లో నేడు ప్రమాణ స్వీకారం

4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాఝీ

డిప్యూటీలుగా కేవీ సింగ్‌దేవ్, ప్రవతీ

నిజమైన సేవకుడు అహంకారంతో ఉండడు

నేనే చేశానని చెప్పుకోడు

9

ప్రజా జీవితంలో మర్యాద పాటిస్తాడు

రాజకీయాల్లో విరోధి పక్షాలు ఉండవు

మణిపూర్ సమస్యను గుర్తించండి

ఆరెస్సెస్ అధినేత భాగవత్ వ్యాఖ్యలు

ఏడాదికి 2 సార్లు ప్రవేశాలు..!

9

ఉన్నత విద్యా సంస్థల్లో రెగ్యులర్ కోర్సుల విద్యార్థులకు చక్కటి చాన్స్

వర్సిటీలు, కాలేజీలకు అనుమతి

ఈ ఏడాది నుంచే అమలు: యూజీసీ

మూలవేతనంలో 50% పింఛను!

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్డీయే సర్కారు భారీ ఆఫర్

కమిటీ సిఫారసులపై దృష్టి

అమలుకు గడువు పెట్టని కమిటీ

బడికి వేళాయె!

11 నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు సిద్ధం

600 కోట్లతో స్కూళ్లలో మరమ్మతులు

అమ్మ ఆదర్శ కమిటీలతో పనులు పూర్తి

2024-25 అకడమిక్ క్యాలెండర్ రిలీజ్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త కూర్పు

నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. కొత్త మంత్రివర్గం 71 మందిలో ముప్పైమందికి కేబినెట్ హోదా లభించింది. ఐదుగురు స్వతంత్ర, ముప్పై ఆరుగురు సహాయ మంత్రులు ఉన్నారు. మిత్రపక్షాల కరుణాకటాక్షాల ఆధారంగా దేశాన్ని ఏలాల్సిన స్థితిలో ఉన్నప్పటికీ, నరేంద్రమోదీ ఈ మంత్రివర్గ కూర్పులో తనదే పైచేయి అనిపించుకున్నారని, ఊతమిస్తున్నవారి ఒత్తిళ్ళకు పెద్దగా లొంగలేదని కొందరి విశ్లేషణ. కొందరు పాతవారు పోయి, శాఖల్లోనూ మార్పు చేర్పులు ఉన్నా, అధికంగా గత మంత్రులే ఉన్నందున మార్పు ప్రభావవంతంగా అగుపించడం లేదు. సొంతబలం లేకున్నా కూడా, గతకాలపు కొనసాగింపుగానే కనిపించాలన్న ప్రత్యేక ప్రయత్నం ఈ మంత్రివర్గం కూర్పులో అత్యధికులకు కనిపిస్తున్నది.

ఆర్థికం, హోం, రక్షణ, విదేశీవ్యవహారాలు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, రైల్వేల వంటి కీలకమైన శాఖల్లో ఏ మార్పూలేదు. ఈ మారు కూడా మంత్రుల్లో ముస్లింలు లేరు. ఏడుగురు ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, ఏడుగురు మహిళలకు మోదీ టీంలో చోటుదక్కింది. యూపీ నేర్పిన గుణపాఠం వల్ల కాబోలు, ఓబీసీల ప్రాతినిధ్యం కూడా గట్టిగానే ఉంది. పంజాబ్‌లో బలంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీతోనూ, కేరళలో ఎల్‌డీఎఫ్‌తోనూ యుద్ధం కొనసాగించాలి కనుక, తమిళనాడులో ఎదురుదెబ్బ తిన్నా విస్తరణయత్నాలు ఆగకూడదు కనుక ఆ రాష్ట్రాలనుంచి ఓడినవారికి కూడా ప్రాతినిధ్యం లభించింది. ఖలిస్తానీ ఉగ్రవాదుల చేతిలో హతమైన కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనుమడు రవ్‌నీత్‌సింగ్ బిట్టూ ద్వారా పంజాబ్‌లో ఎదగాలన్నది బీజేపీ ప్రయత్నం. ఒక్కసీటూ గెలవకపోయినా ఆప్, కాంగ్రెస్ తరువాత ఓట్లవాటాలో మూడోస్థానంలో ఉన్నందున బీజేపీ ఆశని కాదనలేం. కేరళలో ఒక్కసీటు గెలిచి ఖాతా తెరిచిన సంతోషంలో ఆ రాష్ట్రానికి రెండు పదవులు ఇచ్చినా, నటుడు సురేష్ గోపి అలగడం, రాజీపడటం తప్పలేదు. కేరళలో ఈ ఎన్నికల్లో బీజేపీ ఓట్లవాటా 17శాతం తాకి, 11 అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి బలాన్ని ప్రదర్శించిన నేపథ్యంలో, జార్జి కురియన్ ఎంపిక క్రైస్తవులకు సానుకూల సంకేతం పంపేందుకు ఉపకరిస్తుంది. తమిళనాట వీరోచిత పోరాటం చేసిన ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు అన్నామలై కాక, గతకాలపు నేత లోగనాథన్ మురుగన్‌ను మంత్రిగా తీసుకోవడం వెనుక దళిత ఉపకుల రాజకీయం ఉన్నదని అంటారు. ఇప్పుడు అంతగా ఆదరించనప్పటికీ, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రాల ప్రజల మనసులను గెలుచుకోవడానికి ఈ పందేరం ఉపకరిస్తుంది.

కొత్త మంత్రివర్గాన్ని యువతరం, అనుభవజ్ఞులతో ఎంతో చక్కగా గుదిగుచ్చామని ప్రధానమంత్రి చెప్పుకున్నారు. ఐదుగురు తెలుగువారికి కేంద్రంలో చోటు దక్కడం అటుంచితే, మిత్రపక్షాలకు మొత్తంగా పదకొండు, ఐదుపార్టీలకు ఒక్కటి చొప్పున పదవులు దక్కాయి. బిహార్‌లో ముగ్గురు మిత్రులకు నాలుగు పదవులు ఇచ్చినా, మహారాష్ట్రలో ఎన్సీపీని చీల్చి, అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్యేలను తెచ్చిన అజిత్‌పవార్‌తో ఇక అవసరం తీరిపోయిందని బీజేపీ భావిస్తున్నట్టుగా చర్చ జరుగుతోంది. ఎన్సీపీ మినహా అన్ని మిత్రపక్షాలకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. ఇక, ఈ ఏడాది ఎన్నికలు ఉన్నందున మహారాష్ట్ర, హర్యానాలకు తగిన ప్రాతినిధ్యమే దక్కింది. ఖట్టర్‌ను తీసుకోవడం, మూడు పదవులు ఇవ్వడంలో హర్యానాను జారవిడుచుకోకూడదన్న ప్రయత్నం బలంగా కనిపిస్తున్నది. మహారాష్ట్ర కంటే, ఢిల్లీ పొరుగున ఉన్న హర్యానాలో ఓడిపోతే ఆ ప్రభావం నైతికంగా కేంద్రప్రభుత్వం మీద పనిచేస్తుంది.

గత ప్రభుత్వంలోని కీలకమైన మంత్రులను అదేశాఖలో కొనసాగించడం, నడ్డావంటివారిని కొత్తగా తేవడం వంటివి గమనించినప్పుడు మంత్రివర్గ కూర్పులో బీజేపీ ముద్ర విశేషంగా కనిపిస్తుంది. మిత్రపక్షాల అవసరం ఎంత ఉన్నప్పటికీ, వారిని కొంతమేరకే సంతృప్తిపరచి తనదే పైచేయి అనిపించుకుంది. కేబినెట్ మంత్రుల్లో పాతికమంది బీజేపీవారే అయినప్పటికీ, మిత్రపక్షాల ప్రాతినిధ్యం ఈ దేశ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. దేశంలోని వేర్వేరు ప్రాంతాలనుంచి వచ్చినవారు మంత్రివర్గం పనితీరు మరింత మెరుగుపడేందుకు ఉపకరిస్తారు. భవిష్యత్తులో మంత్రివర్గాన్ని విస్తరించుకొనే వెసులుబాటు ఇంకా మిగిలివున్నందున, రాజకీయంగానో, సామాజిక కారణాలరీత్యానో స్వపక్షంనుంచో, మిత్రపక్షాలనుంచో మరికొందరికి చోటుకల్పించే అవకాశాలైతే లేకపోలేదు. అప్పుడు మరిన్ని వింతలూ విశేషాలు చూడవచ్చు.

నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు.

రాష్ట్రాన్ని గ్లోబల్ ఎకానమీలో నిలిపిన నిపుణుడు


విశ్వసనీయత, అంకితభావంతో పాటు దార్శనికత కలిగిన నాయకులు ప్రజా జీవన ప్రమాణాలలో పరివర్తన తీసుకురాగలుగుతారు కానీ వర్తమాన భారతవనిలో ఈ తరహా నాయకులు అరుదు. స్థానికాంశాలలో మాత్రమే నిమగ్నమై ఉండే రాష్ట్ర స్థాయి నాయకులే తప్ప దూరదృష్టితో, అంతర్జాతీయ దృక్పథంతో, విదేశాల సౌజన్యంతో తమ రాష్ట్రాల అభివృద్ధి గూర్చి ఆలోచించేవారు బహు అరుదు.

నెహ్రూ హయాం నుండి ఇప్పటి వరకు విదేశాంగ విధానం అనేది పూర్తిగా కేంద్ర అంశం, అందులో రాష్ట్రాల ప్రమేయం ఉండదు. విదేశీ పర్యటనలు, ప్రముఖులతో సమావేశాలు, పెట్టుబడులు వగైరా అన్నీ విదేశాంగ మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుంది. కానీ దీనికి మినహాయింపుగా స్వాతంత్ర్య భారతంలో ప్రప్రథమంగా నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలతో, ప్రతినిధి బృందాలతో, పెట్టుబడులు తెస్తూ కొత్త ఒరవడిని నెలకొల్పారు.

1990లో శస్త్రచికిత్స కోసం 59 రోజులపాటు అమెరికాకు వెళ్ళిన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ప్రపంచ బ్యాంకు నుంచి వరదల పునరవాస చర్యల కొరకు రూ.2800కోట్ల రుణాన్ని తీసుకురావడం గురించి, న్యూయార్క్ నుండి ఫాక్స్ ద్వారా జీవోలు జారీ చేయడాన్ని గురించి అప్పట్లో గొప్పగా చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ తర్వాత, కొన్నాళ్ళకు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు దేశ విదేశాంగ విధాన తీరులో సమూల మార్పును తీసుకోవచ్చారు. అప్పటి వరకు రాష్ట్రాలతో సంబంధం లేకుండా నడిచిన విదేశాంగ విధానంలో రాష్ట్రాలకు కూడా పాత్ర ఉండాలంటూ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన వాదనకు జాతి ప్రయోజనాల దృష్ట్యా అందరి నుంచి ఆమోదం లభించింది. ఇప్పుడు 25ఏళ్ళ తర్వాత ఆయన తనయుడు లోకేశ్ కూడా బలమైన రాష్ట్రాలు లేకుండా భారత వికాసం ఎలా అంటూ అడుగుతుండడం ముదావహం.

గల్ఫ్ లేఖ

చంద్రబాబు దార్శనికత గూర్చి ఇక్కడ ప్రస్తావించాలి. ఇప్పుడు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు నిత్య జీవితంలో ఒక భాగమే, కానీ రెండు దశాబ్దాల క్రితం అనేక వర్ధమాన దేశాలలో సైతం ఈ-కామర్స్ గురించి పెద్దగా తెలియని కాలంలో చంద్రబాబు నాయుడు దుబాయిలో ఈ-కామర్స్ కేంద్రంగా పురుడు పోసుకుంటున్న ఇంటర్నెట్ సిటీని పర్యటిస్తానని ప్రత్యేకంగా ఆసక్తి చూపారు. అప్పట్లో దీనిపై ఇటు భారతీయ దౌత్యవేత్తలతో పాటు, అప్పటి దుబాయి యువరాజు, ప్రస్తుత రాజు అయిన షేక్ మోహమ్మద్ రాషేద్ అల్ మోఖ్తుం ఆశ్చర్యపోయారు. భవిష్యత్తు పట్ల ఇంత దార్శనికత కలిగిన ఈ భారతీయ నాయకుడు ఎవరా అని అరబ్బులు ఆసక్తిగా గమనించారు. అప్పటికి ఇంకా బాలుడిగా ఉన్న నారా లోకేశ్‌తో కలిసి ఆయన దుబాయిలోని ఇంటర్నెట్ సిటీని పర్యటించి



దాని తీరుతెన్నులను పరిశీలించి సైబరాబాద్‌లోని హైటెక్ టవర్ల నిర్మాణంలో దానికి అనుగుణంగా కొన్ని సూచనలు చేసారు.

పెరుగుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విమానయాన రాకపోకలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని గ్రహించిన చంద్రబాబు నాయుడు శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీకారం చుట్టడమే గాక అందులో విమానాలను నడపడానికి ఎయిర్‌లైన్స్ చుట్టు తిరిగారు. సంప్రదాయకంగా ఇరుదేశాల మధ్య జనవరిలో జరిగే ద్వైపాక్షిక విమానాల రాకపోకల ఒప్పందాలకు భిన్నంగా చంద్రబాబు నాయుడు ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు హైదరాబాద్‌లో ప్రత్యేక అనుమతి ఇప్పించారు. దాంతో 2001 జూలై 2న ప్రప్రథమ ఏమిరేట్స్ విమానం హైదరాబాద్‌లో దిగింది. అందులో దుబాయి నుంచి వచ్చిన ఏమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అత్యున్నత అధికారి ఘయిత్ అల్ ఘయిత్ ఈ విమానం హైదరాబాద్‌కు రావడానికి కేవలం చంద్రబాబు నాయుడు కారణమని ప్రశంసించారు. ఈ విమానం ద్వారా దుబాయి మీదుగా అమెరికా, ఐరోపాలతో సహా ప్రపంచానికి హైదరాబాద్‌కు విమాన సౌకర్యం విరివిగా అందుబాటులో వచ్చింది.

ఆ తర్వాత వ్యూహాత్మకంగా హైదరాబాద్‌లో అమెరికన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలను ఆకర్షించిన చంద్రబాబు నగరంలో అమెరికా కాన్సులేటు నెలకొల్పడానికి నిర్విరామంగా చేసిన ప్రయత్నాలు చూసి సాక్షాత్తూ అమెరికా విదేశాంగ శాఖ సైతం నివ్వెరపోయింది. స్వాతంత్ర భారత చరిత్రలో అమెరికా ప్రప్రథమంగా నెలకొల్పిన కాన్సులేటు ఇదేనని అని చాలమందికి తెలియదు.

దశాబ్దకాలంగా కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమైన విదేశాంగ శాఖలోని 'లుక్ ఈస్ట్' విధానాన్ని చంద్రబాబు తన చేతల ద్వారా దేశానికి చూపించారు. చైనా, సింగపూర్, దక్షిణా కొరియాలతో వ్యూహాత్మక ఆర్థిక ప్రయోజనాలు సాధించారు.

2014లో జపాన్‌లో ఎన్నికలలో నిమగ్నమై ఉన్న ప్రధాని షింజో అబే, విశ్వఖ్యాత ఎలక్ట్రానిక్స్ సంస్థ పానసోనిక్ యాజమాన్యంతో సమావేశమవడానికి సందర్శిస్తానని చంద్రబాబు విజ్ఞప్తి చేయడంతో దౌత్యవేత్తలు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసారు. కానీ అవతలి వైపు నుండి వచ్చిన సానుకూలతతో వారిద్దరితో చంద్రబాబు నాయుడు మాట్లాడిన తీరు జపాన్‌లోని భారత రాయబారి దీపా వాద్వాతో పాటు జపానీ పారిశ్రామికవేత్తలను అబ్బురపర్చింది. మైక్రోసాఫ్ట్ మొదలు కియా మోటర్స్ వరకు అనేక బహుళజాతి బ్రాండ్లను రాష్ట్రానికి తెచ్చిన తీరు దౌత్యవేత్తలకు సైతం మార్గదర్శకంగా నిలించింది.

అదే విధంగా, సాధారణంగా రాష్ట్రాల స్థాయి నాయకులను కలవని యూఏఈ అధ్యక్షుడు, అబుధాబి రాజు షేఖ్ మోహమ్మద్ బిన్ జాయద్ కూడ 2018లో చంద్రబాబుతో సమావేశమై తాను నవ్యాంధ్ర ప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతానని చెప్పినా ఆ తర్వాత ప్రభుత్వ మార్పిడితో అడుగు ముందుకు పడలేదు.

ఆర్థిక ప్రయోజనాలే కాకుండ సగటు ప్రవాసీయుల సమస్యలపై కూడా ఆయన స్పందించారు. గల్ఫ్‌లో మృతదేహాల పెండింగ్ గూర్చి ఈ ప్రతినిధి 1995లో వ్రాసిన ఒక వ్యాసంపై అప్పుడే అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు స్పందించిన తీరు సౌత్ బ్లాక్‌లో కదలిక తీసుకువచ్చింది. ఈ రకమైన దార్శనికత, అంకితభావం కలిగిన చంద్రబాబు నాయుడి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్ళీ అభివృద్ధిబాటపై పయనిస్తుందని ఆశించవచ్చు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ మార్పు ప్రజలు ఆశించిందేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ఒక అమ్మాయి తన తల్లిదండ్రుల వద్ద ఉన్నంత కాలం స్వేచ్ఛగా, పెద్దగా బరువు బాధ్యతలు లేకుండా ఉంటుంది. అయితే వివాహం చేసుకుని మరో ఇంట్లో అడుగు పెట్టాక అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఉండవలసి వస్తుంది. అన్నింటినీ ఆకళింపు చేసుకుని తన బాధ్యతలేమిటో అర్థం చేసుకోవల్సి ఉంటుంది. మన వెంకయ్యనాయుడు కూడా ఇప్పటి వరకూ పార్లమెంట్ సభ్యుడుగా, కేంద్రమంత్రిగా అనేక పదవులు నిర్వహించారు. ఉభయ సభల్లోనూ, ఇతర సమావేశాల్లోనూ అనర్గళంగా మాట్లాడారు. కాని ఇప్పుడు ఆయన ఉపరాష్ట్రపతి. అది ఒక రాజ్యాంగ హోదా. రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. కనుక ఆయన కూడా పుట్టింటి నుంచి మెట్టినింటికి వచ్చినట్లు కొత్త పరిస్థితులకు అనుగుణంగా మారవలసి ఉంటుంది. అది ఆయనకు తెలుసు' అని 2017 ఆగస్టు మొదటి వారంలో ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడును పార్టీ ఎంపీల సమావేశంలో అభినందిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నప్పుడు హాజరైనవారందరూ నవ్వుల వర్షం కురిపించారు. 'మోదీ ఎంత సహజమైన ఉదాహరణనిచ్చారు!' అని ఒకరిద్దరు వ్యాఖ్యానించారు.

2001 నుంచి 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 2014 నుంచి ఇప్పటి వరకూ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నరేంద్రమోదీ కూడా ఇప్పుడు ఒక కొత్త వాతావరణంలోకి అడుగుపెట్టారు. ఇప్పటి వరకూ ఆయన సారథ్యంలో బీజేపీ ఎన్నిసార్లు పోటీ చేసినా అన్నిసార్లు అత్యధిక మెజారిటీ సాధించింది. 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నా, 10 సంవత్సరాలు దేశ ప్రధానమంత్రిగా ఉన్నా ఎప్పుడూ ఇతర పార్టీల బలంపై ఆధారపడవలసిన అవసరం ఆయనకు రాలేదు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏకు పూర్తి మెజారిటీ వచ్చినా, ఆయన స్వంత పార్టీ బీజేపీకి పూర్తి సంఖ్యాబలం రాలేదు. ఎన్నికలకు ముందే ఒక కూటమిగా ఏర్పడిన ఎన్డీఏకు సారథిగా కూడా మోదీయే ఉన్నందువల్ల ఆయన నాయకత్వానికి వచ్చిన ఢోకా ఏమీ లేదు కాని ఒక రకంగా గత 23 సంవత్సరాల ఆయన అనుభవంతో పోలిస్తే ఇప్పుడు ఆయన నిర్వహించేది కొత్త సంసారమే అని చెప్పక తప్పదు. ఎందుకంటే గతంలో మోదీ ఎప్పుడూ సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించలేదు.

అయితే 1999–2004 మధ్య అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలో బీజేపీ ఏర్పర్చిన సంకీర్ణ ప్రభుత్వానికీ, ఇప్పుడు మోదీ నాయకత్వంలో ఏర్పాటు చేసిన సంకీర్ణ ప్రభుత్వానికీ కొన్ని పోలికలు ఉన్నాయి. నిజానికి అప్పుడు ఎన్డీఏ ఇప్పటి ఎన్డీఏ కంటే ఆరు సీట్లు ఎక్కువ సాధించింది. కాంగ్రెస్ ప్రధానుల తర్వాత అయిదేళ్లు పాలించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా గుర్తింపు పొందిన వాజపేయి సారథ్యంలో నాడు ఎన్డీఏకు 299 సీట్లు రాగా ఇప్పుడు మోదీ సారథ్యంలోని ఎన్డీఏకు 293 సీట్లు లభించాయి. నాడు కూడా కాంగ్రెస్ కేవలం 112 సీట్లతో చాలా బలహీనంగా ఉండేది. 1999లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల సంఖ్యాబలం 134 మాత్రమే. ఇప్పుడు 232 సీట్లు సాధించిన ఇండియా కూటమి కంటే ఈ బలం ఎంతో తక్కువ. బీజేపీకి రెండుసార్లు మెజారిటీ సాధించి పెట్టి పదేళ్ల ప్రభుత్వాన్ని తిరుగులేకుండా నిర్వహించిన మోదీ ఇప్పటికే చరిత్రలో నిలిచిపోయారు. అయితే ఒక సంకీర్ణ ప్రభుత్వానికి సారథిగా అయిదేళ్లు పాలనను నిర్వహించిన పీవీ, వాజపేయి, పదేళ్ల పాటు యూపీఏ ప్రభుత్వాన్ని నిర్వహించిన మన్మోహన్ సింగ్ కూడా చరిత్రలో నిలిచిపోయిన నాయకులే. జాతీయ స్థాయిలో మెజారిటీ సంఖ్యాబలంతో ప్రభుత్వాన్ని పదేళ్లు నిర్వహించిన వ్యక్తే సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించవలసి వచ్చిన ఉదంతాలు భారతదేశంలో లేవు. అయినప్పటికీ మోదీ ఈ బాధ్యతను అవలీలగా నిర్వహిస్తారన్న విషయంలో అనుమానాలు అక్కరలేదు. అందుకు అనేక కారణాలున్నాయి.

ఒకటి, ఎన్డీఏలో బీజేపీ ఇప్పుడు 240 సీట్లు సాధించిన బలమైన పక్షం. కేవలం 32 సీట్లు అదనంగా ఉంటే చాలు ఆయన మెజారిటీకీ ఢోకా ఉండదు. పైపెచ్చు వాజపేయి లాగా ఆయనకు ఎన్డీఏలో బలమైన మద్దతు ఉన్నది. అప్పుడు 29 సీట్లతో మెజారిటీ మిత్రపక్షంగా తెలుగుదేశం, ఆ తర్వాత 20 సీట్లతో జేడీ (యు), డీఎంకే వంటి ఇతర పార్టీలు మద్దతునిచ్చినందువల్ల వాజపేయి అయిదేళ్ల తనదైన శైలిలో పాలనను నిర్వహించారు. ఇప్పుడు కూడా తెలుగుదేశం, జనతాదళ్ (యు)తో పాటు ఇతర పార్టీలు మోదీకి ఎన్నికల ముందే మద్దతు ప్రకటించి, బీజేపీతో పాటు మెజారిటీ సీట్లు గెలుచుకున్నాయి. అంతేకాక, ఇండియా కూటమికి 232 సీట్లు లభించినప్పటికీ అది పలు పార్టీల సముదాయం. అది ఏ కోశానా ఈ అయిదేళ్లలో మోదీ ప్రభుత్వానికి ఢోకా కల్పించే అవకాశాలు లేవు. ఒకసారి 145, రెండోసారి 206 సీట్లు సాధించిన కాంగ్రెసే పదేళ్ల పరిపాలన నిర్వహించగలిగినప్పుడు 240 సీట్లు సాధించిన మోదీ ఎందుకు సమర్థంగా పరిపాలన నిర్వహించలేరు?

అతి కష్టమ్మీద వంద సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ మరో 30, 40 సీట్లను అదనంగా సాధించి ఉంటే పరిస్థితులు వేరుగా ఉండేవి. కాని ప్రజలు భిన్నంగా తీర్పునిచ్చారు. ప్రతిపక్షాలను బలంగా ఏకం చేయగలిగిన జయప్రకాశ్ నారాయణ్, సూర్జిత్ వంటి నేతలు లేనందువల్ల అది కలిసికట్టుగా పోటీ చేయలేకపోయింది. నాయకత్వ లోపం స్పష్టంగా కనిపించినప్పటికీ కాంగ్రెస్, ఇతర పక్షాలు సామాజిక సమీకరణలు తమకు అనుకూలంగా మారేందుకు గట్టిగానే కృషి చేశాయని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన వందకు పైగా ఎంపీల్లో 37 మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు కావడం గమనార్హం. వీరిలో అత్యధికులు 50 శాతం పైగా ఓట్లను సాధించారు. ఆశ్చర్యకరమేమంటే 5 జనరల్ సీట్లలో ఈ వర్గాలు గెలిచాయి. క్రమంగా కాంగ్రెస్ తన మూలాల్లోకి ప్రవేశిస్తున్నదనడానికి ఇది ఉదాహరణ. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో కేవలం అయిదు సీట్లు సాధించిన సమాజ్‌వాదీ పార్టీ ఈ సారి 37 సీట్లు సాధించడానికి ప్రధాన కారణం పెద్ద సంఖ్యలో దళితులు కూడా బీఎస్పీని వదిలి ఎస్పీ వైపు మొగ్గుచూపడం. యూపీలో ఇండియా కూటమికి యాదవ, ముస్లిం ఓట్లు సంఘటితం కావడం మాత్రమే కాక దళితులు కూడా అధిక సంఖ్యలో మద్దతునీయడం బీజేపీ విస్మరించదగిన పరిణామం కాదు. బీజేపీ గతంలో 224 సీట్లలో 50 శాతం పైగా ఓట్లను సాధిస్తే ఈ సారి కేవలం 156 సీట్లలోనే 50 శాతం పైగా ఓట్లు సాధించడం కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన విషయమే.



బిహార్‌లో నితీశ్, చిరాగ్ పశ్వాన్, జితన్ రాంమాంఝీ వంటి సామాజిక శక్తులు లేకపోతే ఇవాళ ఆ రాష్ట్రంలో ఎన్డీఏ మెజారిటీ సీట్లు సాధించగలిగేది కాదనేది స్పష్టం. బహుశా ఈ విషయం గమనించినందువల్లే మోదీ యూపీ, బిహార్‌కు కేంద్ర కేబినెట్‌లో అత్యధిక మంత్రి పదవులు కల్పించి ఉండవచ్చు.

అయితే కాంగ్రెస్ విజయంతో ఆ పార్టీ నేతలు ఉబ్బితబ్బిబ్బు కానక్కర్లేదు. 2019లో కంటే అది కేవలం రెండున్నరశాతం ఓట్లను అధికంగా సాధిస్తే, బీజేపీ ఒక శాతం కంటే తక్కువ ఓట్లను కోల్పోయింది. సామాజిక న్యాయ ఎజెండాతో ఎన్నికల్లో ప్రవేశించిన ఇండియా కూటమి ఈ ఎజెండాను అన్ని చోట్లా ప్రజల్లోకి తీసుకువెళ్లలేకపోయినందువల్ల అనుకున్న ఫలితాలను సాధించలేకపోయింది. తెలంగాణలాంటి చోట్ల బీజేపీ ఉధృతిని అరికట్టలేకపోయింది. దాదాపు 40 శాతం మేరకు దళితులు, ఆదివాసీలు ఉన్న ఒడిషాలో బిజూజనతాదళ్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆదరిస్తున్న విషయం తెలిసినప్పటికీ కాంగ్రెస్ ప్రేక్షక పాత్ర పోషించింది. 35 శాతం దళితులు, ఆదివాసీలు ఉన్న మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతున్నా, ఆపగలిగే నేతలు ఆ పార్టీలో లేరు. ఛింద్వారా వంటి కాంగ్రెస్ కంచుకోటలో కూడా బీజేపీ విజయం సాధించింది.

సామాజిక పరిస్థితులు పూర్తిగా పరిపక్వం కాకుండా సమాజంలో ఏ మార్పూ సంభవం కాదని. మార్పుకు దోహదం చేసే శక్తులు ఇంకా బలహీనంగా ఉన్నాయని ఈ ఎన్నికలు నిరూపించాయి. అందువల్లే బహుశా భారత ప్రజలు మోదీని పూర్తిగా తిరస్కరించాలని అనుకోలేదని రుజువయింది. మోదీ ఆకర్షణ, ఆయన భావజాలం, ఆయన హావభావాలు, విన్యాసాలు ఆయన పట్ల ప్రజల్లో పూర్తిగా వికర్షణ కల్పించలేకపోయాయి. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆయనకు కూడా ఒక సందేశాన్ని ఇచ్చాయనడంలో అతిశయోక్తి లేదు. ఈ ప్రజాస్వామిక పోరు పూర్తిగా మోదీ పేరుపైనే జరిగినందువల్ల ఎన్నికల ఫలితాలు కూడా ప్రజలు మోదీని దృష్టిలో ఉంచుకున్నవే అని చెప్పక తప్పదు. ఆ విషయం గ్రహించినందువల్లే మోదీ ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచీ పూర్తిగా మారిపోయినట్లు వ్యవహరిస్తున్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయడానికి బదులు నేరుగా ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి తన నివాసంలోనూ, సెంట్రల్ హాలులోను చంద్రబాబు పక్కన కూర్చుని చెణుకులు విసురుతూ, నవ్వుతూ వ్యవహరించిన తీరు, మిత్రపక్షాల పట్ల ప్రదర్శించిన స్నేహశీలత విస్మరించదగిన దృశ్యాలు కావు. ఎన్డీయే భారతీయ ఆత్మ అని ప్రకటించిన మోదీ, జాతీయ ప్రయోజనాలతో ప్రాంతీయ ఆకాంక్షలు ముఖ్యమని చెప్పిన చంద్రబాబు అభివృద్ధి ఎజెండాలు పరస్పరం భిన్నమైనవి కావు. వారిద్దరి ఎజెండా ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఎజెండాకు భిన్నంగా ఏమీ లేదు. అందుకు ప్రత్యామ్నాయ ఎజెండా ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ప్రజల తీర్పుకు అనుగుణంగా వ్యవహరించడం మంచిదని గ్రహించినందువల్లనేమో ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత చాలా సహజంగా కనిపిస్తోంది.

ఎన్డీయే భారతీయ ఆత్మ అని ప్రకటించిన మోదీ, జాతీయ ప్రయోజనాలతో ప్రాంతీయ ఆకాంక్షలు ముఖ్యమని చెప్పిన చంద్రబాబు అభివృద్ధి ఎజెండాలు పరస్పరం భిన్నమైనవి కావు. వారిద్దరి ఎజెండా ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ఎజెండాకు భిన్నంగా ఏమీ లేదు. అందుకు ప్రత్యామ్నాయ ఎజెండా ఎక్కడా విజయవంతమైన దాఖలాలు లేవు. ప్రజల తీర్పుకు అనుగుణంగా వ్యవహరించడం మంచిదని గ్రహించినందువల్లనేమో ఎన్డీఏ నేతల మధ్య సఖ్యత చాలా సహజంగా కనిపిస్తోంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

బీజేపీ ఎలా ఓడిపోయింది?

తీర్పు 2024 – 2



■ యోగేంద్ర యాదవ్

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పాలక పక్షం భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పుగా అర్థం చేసుకోవడం సబబేనా? సబబేనని మాలో ఒకరు (యోగేంద్ర యాదవ్) గట్టిగా వాదించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన సంఖ్యా బలం ఎన్డీఏకు సమకూరింది. అయితే బీజేపీ తన మెజారిటీని కోల్పోవడమే కాదు, ప్రజామోదాన్ని పొందడంలో కూడా విఫలమయింది. ప్రత్యర్థి పక్షం ఏదీ తన దరి దాపుల్లోకి రాని రీతిలో ఏకైక పెద్ద పక్షంగా బీజేపీ ఆవిర్భవించింది. అయితే 400కి పైగా సీట్లను గెలవాలని, 50 శాతానికి పైగా ఓట్లను కైవసం చేసుకోవాలని స్వయంగా నిర్దేశించుకున్న లక్ష్యాల వెలుగులో బీజేపీ సంఖ్యా బలాన్ని పరిశీలించవలసి వున్నది. అంతకంటే ముఖ్యంగా ఎన్నికల ఫలితాలను వాటి రాజకీయ సందర్భంలో చూడవలసి ఉంది. ఈ సార్వత్రిక ఎన్నికలలో ధన బలం, మీడియా మద్దతు, ప్రభుత్వ యంత్రాంగం, మరీ ముఖ్యంగా ఎన్నికల సంఘం మొదలైనవన్నీ ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ఉన్నాయన్న కఠోర వాస్తవం నేపథ్యంలో బీజేపీ జయాపజయాలను అంచనా వేయవలసి ఉంది.

ఈ అవగాహనకు ఒక సంభావ్య వ్యతిరేక వాదన బీజేపీ ఓట్ల వాటా కథ. పాలక పక్షం ఓట్ల వాటా 37.4 శాతం నుంచి 36.6 శాతానికి మాత్రమే పడిపోయింది. నిజానికి ఇది ఉపేక్షణీయమైనది. ఒడిషాలో బీజేపీ ఆశ్చర్యకరంగా జయపతాక నెగురవేసింది. కేరళలో పలు అవరోధాలను అధిగమించి తన ఉనికిని నెలకొల్పుకున్నది. ఆంధ్ర, పంజాబ్‌లలో తన ఉనికిని మెరుగుపరచుకున్నది. మొత్తం మీద దేశవ్యాప్తంగా తన ఉనికిని సుస్థిరపరచుకోవడంలో బీజేపీ పూర్తిగా సఫలమయింది అన్ని రాష్ట్రాలలోను రెండంకెల శాతంలో ఓట్ల వాటాను సాధించుకున్నది. ఈ వాస్తవాల ప్రాతిపదికన సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ విజయం సాధంచిందని ఆ పార్టీ మద్దతుదారులు వాదిస్తున్నారు. స్వతంత్ర పరిశీలకులు వారితో ఏకీభవించడం లేదు.

రాష్ట్ర స్థాయి ఓట్ల వాటాలను నిశితంగా పరిశీలిస్తే పాలక పక్షాలు కొన్ని ప్రాంతాలలో ఓడిపోయి, మిగతా ప్రాంతాలలో లబ్ధి పొందిన కథ కాదని అర్థమవుతుంది. నిజానికి బీజేపీ పాలక పక్షంగా లేని ప్రతి చోటా ఓటర్లు అక్కడి పాలకపక్షానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ సార్వత్రిక ఎన్నికలలో రెండు విభిన్న బీజేపీలు పోటీ చేశాయి. ఒకటి పాలకపక్ష బీజేపీ, రెండు ప్రతిపక్ష బీజేపీ. పాలకపక్ష బీజేపీ ఈ ఎన్నికలలో తీవ్రంగా నష్టపోగా సవాల్‌దార్ బీజేపీ గణనీయంగా లబ్ధి పొందింది. పాలకపక్షాలు, రాజకీయ ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా వేసిన ఓటుతో కొన్ని రాష్ట్రాలలో బీజేపీ బాగా లబ్ధి పొందింది. అయితే బీజేపీకి దక్కిన ఈ లబ్ధి జాతీయ స్థాయిలో ప్రజా తీర్పు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉందన్న వాస్తవాన్ని పాక్షికంగా కప్పిపుచ్చింది దీని వల్ల బీజేపీ దీర్ఘకాలిక లబ్ధి పొందే అవకాశం లేదు.

దేశ వ్యాప్తంగా మూడింట రెండు వంతుల నియోజకవర్గాలలో (కచ్చితంగా చెప్పాలంటే 356 సీట్లు) బీజేపీ ప్రాబల్య రాజకీయ పక్షంగా ఉన్నది. రాష్ట్ర పాలక పక్షంగా లేని చోట్ల కూడా అది ఆధిపత్య పార్టీగా ఉన్నది. బీజేపీ ప్రాబల్య నియోజకవర్గాలు పశ్చిమాన మహారాష్ట్ర, గుజరాత్ నుంచి తూర్పున బిహార్, జార్ఖండ్ దాకా విస్తరించి వున్నాయి. బీజేపీ ప్రస్తుతం పాలకపక్షంగా లేని కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లు కూడా ఈ పరిధిలోకి వస్తాయి. ఈ రాష్ట్రాలలో తీవ్ర నష్టాలను చవిచూసింది. దాని రాజకీయ గుత్తాధిపత్యానికి తీవ్ర విఘాతమేర్పడింది. గత సార్వత్రిక ఎన్నికలలో గెలుచుకున్న 271 నియోజకవర్గాలలో 75ను ఈ సారి కోల్పోయింది అయితే మిగతా రాష్ట్రాలు, ప్రాంతాలలో (187 సీట్లు) బీజేపీ పాలక పక్షాల, రాజకీయ ఆధిపత్య వర్గాల వ్యతిరేక శక్తిగా ఎన్నికల గోదాలోకి దిగింది. అధికారంలో ఉన్న లేదా ప్రాబల్య రాజకీయ పక్షాలను సవాల్ చేసింది. ఒడిషాలో బిజూ జనతాదళ్, ఆంధ్రలో వైసీపీ, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని బీజేపీ సవాల్ చేసింది. ఇలా ఆయా రాష్ట్రాలలోని పాలక పక్షాలను సవాల్ చేయడం ద్వారా బీజేపీ లబ్ధి పొందింది. ఈ 187 సీట్లలో గతంలో గెలుచుకున్న వాటి కంటే ఈ సారి 12 సీట్లను అదనంగా కైవసం చేసుకున్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే బీజేపీకి 6 శాతం ఓట్లు పెరిగాయి. ఈ మొగ్గ జాతీయ స్థాయిలో ఓట్ల వాటా తగ్గుదలను 1 శాతం మేరకు నివారించింది.

బీజేపీ ఓట్ల వాటా పైకి కనిపించిన దాని కంటే అధ్వాన్నంగా ఉన్నది. 2019లోను, 2024లోను పోటీ చేసిన నియోజకవర్గాలు 399 ఉన్నాయి. వీటిలో 274 నియోజకవర్గాలలో ఓట్ల శాతం బాగా పడిపోయింది. మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్, జార్ఖండ్, హర్యానా, హిమాచల్, పంజాబ్, జమ్మూ-కశ్మీర్‌లలో బీజేపీ పోటీ చేసిన అన్ని నియోజకవర్గాలలోను ఆ పార్టీ ఓట్ల వాటా తగ్గిపోయింది. యూపీలో రెండు స్థానాలలో మినహా మిగతా నియోజకవర్గాలు అన్నిటిలోను బీజేపీ ఓట్ల వాటా గణనీయంగా తగ్గింది 20 శాతానికి పైగా ఓట్లతో గెలిచిన స్థానాల సంఖ్య 151 నుంచి 77కి తగ్గిపోయింది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముఖాముఖీ పోటీ జరిగిన 215 స్థానాలలో బీజేపీకి పడిన ఓట్ల పెరుగుదలను చూద్దాం. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ నియోజకవర్గాలలో 90 శాతానికి పైగా కైవసం చేసుకున్నది. ఈ సారి బీజేపీ 153 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. 62 స్థానాలను కాంగ్రెస్‌కు కోల్పోయింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఈ నియోజకవర్గాలలో బీజేపీ వ్యతిరేక ఓట్లు 5.5 శాతం పెరిగాయి. ఇది బీజేపీకి తీవ్ర పరాజయమని చెప్పక తప్పదు.

భారతీయ జనతా పార్టీ ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో, పాలకపక్షంగా ఉన్న రాష్ట్రాలలో తీవ్ర నష్టాలను చవిచూసింది. పాలకపక్షాలుగా ఉన్న ప్రత్యర్థి పార్టీలను సవాల్ చేసిన రాష్ట్రాలలో గణనీయమైన లబ్ధి పొందింది. వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో, కాంగ్రెస్‌కు పట్టిన గతి తనకు పట్టకుండా ఉండేందుకు దోహదం చేసే మార్గాలను బీజేపీ కనుగొనవలసి ఉన్నది. పైగా నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి క్షీణించిపోతున్న తరుణమిది. తిరుగులేని భవిష్యత్తును నిర్మించుకునే విషయంలో బీజేపీకి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు అంతగా నమ్మకాన్ని, భరోసాను ఇవ్వలేవు.



బీజేపీ పాలకపక్షంగా ఉన్న రాష్ట్రాలలో ఆ పార్టీ పోటీ చేసిన స్థానాలలో దానికి వ్యతిరేకంగా పడిన ఓట్ల శాతం గణనీయమైన స్థాయిలో ఉన్నది. ఈ నెగెటివ్ ఓటు రాజస్థాన్‌లో 12 శాతం, హర్యానాలో 12 శాతం, హిమాచల్‌లో 13 శాతం మేరకు ఉన్నది. ఇదే రాష్ట్రాలలో బీజేపీ గత అసెంబ్లీ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుపొందింది. అయితే ప్రస్తుత ఎన్నికలలో రాజస్థాన్, హర్యానాలలోని కొన్ని ప్రాంతాలలో బీజేపీ పట్ల తీవ్ర వ్యతిరేకత పెరిగిపోవడంతో ఆ పార్టీ గణనీయమైన సంఖ్యలో సీట్లను కోల్పోయింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ తీవ్రంగా నష్టపోయింది ఈ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా పడిన ఓట్ల శాతం (6.8శాతం), దాని ఇరుగు పొరుగు రాష్ట్రాలలో నమోదైన బీజేపీ వ్యతిరేక ఓటుతో ఇంచుమించు సమరీతిలో ఉండడం గమనార్హం. బీజేపీ వ్యతిరేక ఓటు బిహార్‌లో 6.9 శాతం మేరకు, జార్ఖండ్‌లో అది 7 శాతం మేరకు ఉన్నది.

బీజేపీ ఓట్ల వాటాలో స్వల్పస్థాయి తగ్గుదల కర్ణాటక, అస్సాం, ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకున్నది. ఈ అన్ని రాష్ట్రాలలో (కర్ణాటక మినహా) పాలకపక్షం తన సీట్లను చాలావరకు కాపాడుకోగలిగింది. కర్ణాటకలో బీజేపీ వ్యతిరేక ఓటు కొన్ని ప్రాంతాలలో మాత్రమే కేంద్రీకృతమైనప్పటికీ బీజేపీ చాలా సీట్లను కోల్పోయింది. పాలకపక్ష బీజేపీ నష్టపోని రాష్ట్రాలు గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మాత్రమే. ఈ రాష్ట్రాలలో ప్రతిపక్షం బలహీనంగా ఉండటంతో బీజేపీ లబ్ధి పొందింది. బీజేపీ ఓట్లను కొల్లగొట్టడంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమయింది.

బీజేపీ ప్రతిపక్ష పాత్ర నిర్వహించిన రాష్ట్రాలలో పాలకపక్షాల పట్ల వ్యతిరేకత జాతీయ పాలకపక్షానికి సానుకూలంగా పరిణమించింది. తెలంగాణలో బీఆర్ఎస్ పరోక్ష మద్దతు కారణంగా బీజేపీ తన ఓట్ల వాటాను 15.7 శాతం మేరకు అదనంగా పెంచుకున్నది. ఒడిషాలో 7 శాతం అదనపు ఓట్ల పెరుగుదలతో అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంతో పాటు ఆ రాష్ట్రంలో అధికార పీఠాన్ని కూడా కైవసం చేసుకుంది. కేరళలో 3 శాతం అదనపు ఓట్ల పెరుగుదలతో ఆ రాష్ట్రంలో తన మొదటి లోక్‌సభా స్థానాన్ని బీజేపీ గెలుచుకున్నది. తమిళనాడు, పంజాబ్‌లలో ఒక కీలక భాగస్వామ్య పక్షాన్ని కోల్పోయిన కారణంగా ఆ మాజీ మిత్రపక్షానికి అనుకూలంగా ఉండే సామాజికవర్గాల మద్దతును బీజేపీ కోల్పోయింది. ఆ రాష్ట్రాలలో గతంలో కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేసిన కారణంగా బీజేపీ తన ఓట్ల వాటాను మొత్తంగా పెంచుకున్నప్పటికీ విడివిడి నియోజకవర్గాలలో దాని ఓట్ల వాటా స్వల్పంగా తగ్గిపోయింది. ఈ ధోరణికి పశ్చిమ బెంగాల్ ఒక మినహాయింపుగా కనిపిస్తున్నది. ఈ రాష్ట్రంలో పాలక తృణమల్ కాంగ్రెస్‌ను బీజేపీ గట్టిగా ఎదుర్కొన్నది. అయితే ఓట్ల వాటాలో 1.3 శాతాన్ని కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన పరాజయం నుంచి బీజేపీ ఇప్పటికీ కోలుకోలేదని ఆ ఓట్ల వాటా తగ్గుదల స్పష్టం చేసింది.

భారతీయ జనతా పార్టీ ప్రజామోదాన్ని పొందిందా అన్నది ఈ సార్వత్రిక ఎన్నికల అసలు ప్రశ్నగా చెప్పి తీరాలి. 400కు పైగా సీట్లను, 50 శాతానికి పైగా ఓట్లను గెలుచుకోవాలన్న లక్ష్యాన్ని బీజేపీ తనకుతాను నిర్దేశించుకున్నది. ఆ రికార్డు స్థాయి సీట్లు, ఓట్లు సాధిస్తాననే ఆత్మవిశ్వాసాన్ని ఆ పార్టీ పదేపదే వ్యక్తం చేసింది. ఎన్నికల షెడ్యూలును ప్రకటించక ముందే బీజేపీనే మళ్లీ విజేత అని సర్వత్రా భావించడం జరిగింది. ఆ పార్టీ శ్రేణులకైతే ఈ విషయంలో ఇసుమంత సందేహం కూడా లేదు. బీజేపీ ప్రత్యర్థి పక్షాల సంఖ్యా బలం గురించి ఎవరూ పట్టించుకోలేదు. బీజేపీ మిత్రపక్షాల సంఖ్యా బలంపై కూడా ఎవరూ శ్రద్ధ చూపలేదు మోదీ, ఆయన పార్టీ కేంద్రంగా జరిగిన అధికార క్రీడలో ఆ అంశాలన్నీ యాదృచ్ఛికమైనవేనని భావించడం జరిగింది. బీజేపీ భవిష్యత్తుకు సంబంధించిన నిజమైన ప్రశ్న: పాలకపక్ష బీజేపీని ప్రతిపక్ష బీజేపీ ఎలా రక్షించగలుగుతుంది? బీజేపీ ఎదుగుదలకు ఆస్కారమున్న రాష్ట్రాలు ఇప్పుడు ఎన్నో లేవు. వివిధ రాష్ట్రాలలో పాలకపక్షాలను సవాల్ చేసిన రాజకీయ శక్తిగా బీజేపీకి సమకూరిన సానుకూలతలు సుదీర్ఘకాలం పాటు కొనసాగవు. ఇది స్పష్టం. వెన్వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో, కాంగ్రెస్‌కు పట్టిన గతి తనకు పట్టకుండా ఉండేందుకు దోహదం చేసే మార్గాలను పాలకపక్ష బీజేపీ కనుగొనవలసి ఉన్నది. పైగా నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి క్షీణించిపోతున్న తరుణమిది. తిరుగులేని భవిష్యత్తును నిర్మించుకునే విషయంలో బీజేపీకి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు అంతగా నమ్మకాన్ని, భరోసాను ఇవ్వలేవు.

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందిస్తున్న ఐదు వ్యాసాల పరంపరలో ఇది రెండవది)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా | ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపుల కేసు.. నిందితుడి అరెస్ట్


మహ్మద్ వసీం

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్(వీవోఐపీ) ద్వారా ఫోన్‌లు చేసి అసభ్య పదజాలంతో మాట్లాడుతూ.. చంపేస్తానని బెదిరింపులకు పాల్పడిన సైబర్ నేరగాడిని సిటీ సైబర్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట ఫైల్‌బాగ్‌కు చెందిన మహ్మద్ వసీం సౌదీ అరేబియా జెడ్డాలో డ్రైవర్. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో రాజాసింగ్‌కు వీవోఐపీ అప్లికేషన్ ద్వారా ఫోన్‌లు చేసి అసభ్య పదాలతో తిట్టాడు. ఎన్నికల లెక్కింపురోజు నీతో పాటు నీ కుటుంబాన్ని చంపేస్తానంటూ బెదిరించాడు. అంతటితో ఆగకుండా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగిఆదిత్యానాథ్‌ను చంపేందుకు ప్లాన్ చేస్తున్నామని హెచ్చరించాడు. దాంతో రాజాసింగ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన సైబర్‌క్రైమ్ బృందం టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించి నిందితుడు సౌదీ అరేబియా నుంచి వీవోఐపీ ద్వారా కాల్స్ చేస్తున్నట్లు గుర్తించారు. లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. నిందితుడు మహ్మద్ వసీం మంగళవారం సౌదీ నుంచి హైదరాబాద్‌కు విమానంలో చేరుకున్నాడు. అతడిపై లుక్ అవుట్ నోటీస్ ఉండడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు పట్టుకున్నారు. వెంటనే సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ సైదులు బృందం నిందితుడిని అరెస్టు చేసి కటకటాల్లోకి పంపించారు. అతడి నుంచి బెదిరింపులకు వినియోగించిన సిమ్‌కార్డులతో పాటు.. ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.


పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

జూన్ ఫీజు చెల్లించాలని సందేశాలు..

కొన్ని స్కూళ్లు తరగతుల వారీగా ఫీజులను పెంచాయి. జూన్‌లోనే కొంత చెల్లించాలని తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు వాట్సాప్ మెసేజ్‌లు పంపడంపై పలువురు మండిపడుతున్నారు. నానల్‌నగర్‌లోని ఓ స్కూల్‌లో గతేడాది 5వ తరగతికి నెలకు రూ.1,625 ఉండగా.. ప్రస్తుతం రూ.1,825కి పెంచారు. పదోతరగతికి నెలకు రూ.2,250 ఉండగా.. ఇప్పుడు రూ. 2,600 వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. కాగా, అన్ని తరగతులకు స్పెషల్ ఫీజు కింద రూ.1500 తీసుకుంటామని తల్లిదండ్రులకు సమాచారం పంపించడం ఆసక్తికరంగా మారింది.


మరుగుదొడ్డిని శుభ్రం చేస్తున్న మహిళ

బడికి వేళాయె..!

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- తరగతి గదులను శుభ్రం చేయించిన ఉపాధ్యాయులు
- పుస్తకాలతో బడిబాట పట్టేందుకు సిద్ధమైన విద్యార్థులు

49 రోజుల సుదీర్ఘ వేసవి సెలవులు పూర్తయ్యాయి. బుధవారం నుంచి విద్యార్థులు బడిబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.


నాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

నేడు మంత్రి పొన్నం చేతుల మీదుగా పుస్తకాల పంపిణీ

హైదరాబాద్ జిల్లాలోని మోడల్ ఆలియా స్కూల్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి తెలిపారు.

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 2,541 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అలాగే, 2,747 ప్రభుత్వ గురుకులాలు, ఇతర వెల్ఫేర్ స్కూళ్లు, 242 ఎయిడెడ్, 4,875 ప్రైవేట్ (స్టేట్ సిలబస్), 361 సీబీఎస్‌ఈ, 35 ఐసీఎస్‌ఈ, 220 ప్లే స్కూళ్లు నడుస్తున్నాయి. కాగా, 2023-24 గణాంకాల ప్రకారం మూడు జిల్లాల్లోని ఆయా స్కూళ్లలో సుమారు 28.45 లక్షల మంది విద్యార్థులు చదువుకున్నారు. ఇందులో సర్కారు బడులకు చెందిన విద్యార్థులు దాదాపు 3,48,697 మంది.

టీచర్ల కొరత

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా టీచర్ల సమస్య వేధిస్తోంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పోల్చితే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో సరిపడా ఉపాధ్యాయులు లేక పదోతరగతిలో ఏటా ఉత్తీర్ణత శాతం తగ్గిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. సబ్జెక్ట్ టీచర్ల

మిగతా 6వ పేజీలో..

గ్రేటర్‌లో విద్యాశాఖ వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	ఉపాధ్యాయులు
హైదరాబాద్	691	1,14,607	6,200
రంగారెడ్డి	1345	1,50,146	7,450
మేడ్చల్	505	1,05,604	5,620

ఐదు వేలిస్తే బస్సు ఫిట్!?

- ఇష్టారీతిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ
- అయినా, ఆసక్తి చూపని పాఠశాలల యాజమాన్యాలు
- డ్రైవర్లు, సహాయక సిబ్బంది నియామకంలోనూ నిబంధనలు బేఖాతర్!

ప్రమాదాలు జరుగుతున్నా.. పిల్లల ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా.. కొన్ని విద్యాసంస్థల యజమాన్యాలు, ఆర్టీఏ విభాగం ఇష్టానికి వ్యవహరిస్తున్నాయి. దీంతో కాలం చెల్లిన.. ఫిటెనెస్ లేని విద్యాసంస్థల బస్సులు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. సరైన పత్రాలున్నాయా..? వాహనం కండిషన్ బాగుందా..? లేదా..? అన్నది పట్టించుకోకుండా కొందరు అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వెహికిల్ కండిషన్ కంటే.. ఎంత ముట్టచెబుతున్నారనే దానికే కొందరు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

హైదరాబాద్ సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని పలు ఆర్టీఏ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ పేరిట దందా జోరుగా సాగుతోంది. ఒక్కో వాహనానికి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకునేందుకూ ఆసక్తి చూపడం లేదు. డ్రైవర్లు, సహాయక సిబ్బంది నియామకం విషయంలోనూ నిబంధనలు పాటించడం లేదు. ఈ క్రమంలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి.

దళారులకు బాధ్యతలు..

రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం.. గ్రేటర్ పరిధిలోకి వచ్చే హైదరాబాద్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 12,631 విద్యాసంస్థల బస్సులున్నాయి. ఇందులో ఇప్పటి వరకు చెల్లుబాటయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లున్న వాహనాలు 9,758

మిగతా 6వ పేజీలో..

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీ తప్పనిసరి
- ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్

6

రిజిస్ట్రేషన్ల శాఖపై ఇంటెలిజెన్స్ నజర్

- వివరాలను సేకరిస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై ఇంటెలిజెన్స్ విభాగం ఫోకస్ పెట్టిందా? అంటే అవుననే అంటున్నారు ఆ శాఖ ఉద్యోగులు. సోమవారం కొందరు ఇంటెలిజెన్స్ సిబ్బంది రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ కార్యాలయానికి రావడంతో అధికారవర్గాల్లో కాస్తంత కంగారు కనిపించింది. ఇక్కడకు వచ్చిన ఇంటెలిజెన్స్ సిబ్బంది రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు కొందరు అందుబాటులో ఉన్నప్పటికీ వారిని కలవలేదు. కేవలం కొందరు ఉద్యోగులతో మాట్లాడడం ఉద్యోగవర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. కీలక పోస్టింగ్స్‌లో ఉన్న అధికారుల పేర్లు, వారికి దిగువ కేడర్‌లో పనిచేసే జిల్లా అధికారులు, సిబ్బంది వివరాలను వారు సేకరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ బదిలీలు, పోస్టింగ్‌లపై ఇంటెలిజెన్స్ సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది.

సెల్‌ఫోన్ చోరీ కేసు..

- నిందితుడికి 8 నెలల జైలు, జరిమానా

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో మహిళా ప్రయాణికురాలి సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లిన నిందితుడికి సికింద్రాబాద్ రైల్వే కోర్టు 8 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించింది. నాంపల్లి జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో 2024 జనవరి 27న రైలు కోసం ఎదురుచూస్తున్న ఓ ప్రయాణికురాలి సెల్‌ఫోన్‌ను ఐడీపీ బొల్లారానికి చెందిన మహ్మద్ సోహెల్(21) లాక్కొని పారిపోయాడు. వెంటనే బాధితురాలు జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు. నిందితుడిని జీఆర్‌పీ కోర్టు కానిస్టేబుల్ ముఖేష్ మంగళవారం సికింద్రాబాద్ రైల్వేకోర్టులో హాజరుపరిచారు. రైల్వేకోర్టు పీపీ రాజారాణి తన వాదనలు వినిపించారు. అనంతరం రైల్వేకోర్టు న్యాయమూర్తి మహ్మద్ గౌస్‌పాషా నిందితుడికి 8 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు.

యూట్యూబ్ చానళ్ల పేరుతో ప్రచారం
రూ. 10.86 కోట్లు కొల్లగొట్టిన కేటుగాడు
- భార్య, భర్త, కొడుకుతో పాటు అడ్వొకేట్ అరెస్టు

5

కారు నడిపిన బాలుడి తల్లిదండ్రులపై కేసు నమోదు

6

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

- సర్దార్‌మహల్‌లో అత్యధికంగా 4.8 సెం.మీ

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చార్మినార్ సర్దార్‌మహల్‌లో అత్యధికంగా 4.8 సెం.మీ, ముషీరాబాద్ బౌద్ధనగర్‌లో 4.7 సెం.మీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులను వరద నీరు ముంచేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ముషీరాబాద్, ఉప్పల్, అంబర్‌పేట, హయత్‌నగర్, ఎల్‌బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. ప్రధానరహదారులపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోవడంతో ఎల్‌బీనగర్, ఉప్పల్ క్రికెట్ స్టేడియం, చిక్కడపల్లి, గాజులరామారం ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ సమస్యలు తలెత్తాయి. ఈసీఐఎల్, ఏఎస్‌రావునగర్, చిలకలగూడ, లింగంపల్లి, కేపీహెచ్‌బీ, నాగోల్ ఎక్స్‌రోడ్, మలక్‌పేట, ఐఎస్‌సదన్ ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వరదనీరు చేరడంతో జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ బృందాలు వరదనీటిని తొలగించాయి. అంబర్‌పేట రాంనగర్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి, బండ్లగూడ నాగోల్ ప్రాంతాల్లో నాలుగు చెట్లు నేలకూలాయి. ఎల్‌బీనగర్, బోడుప్పల్, ఇందిరానగర్, దమ్మాయిగూడ, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. మ్యాన్‌హోళ్లు పొంగడంతో పలు ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై ఏరులై పారింది. రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

- టెలీకాన్ఫరెన్స్‌లో మేయర్



హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వర్షంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో వర్షం కురిసిన నేపథ్యంలో వెంటనే ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రోడ్లపై వరదనీరు నిలిచి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, మాన్‌సూన్ అత్యవసర బృందాలు నిర్ణీత ప్రాంతాల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, వాటర్‌బోర్డు, ఫైర్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని జోనల్, డిప్యూటీ మునిసిపల్ కమిషనర్లకు సూచించారు.

వరదనీటి నిర్వహణలో విఫలం



- నీరు నిలిచేది 125 చోట్ల.. ట్రాఫిక్ జామ్ 38 ప్రాంతాల్లో..!
- ఖైరతాబాద్ జోన్‌లోని 35 ప్రాంతాల్లో నిలుస్తోన్న వరదనీరు
- వర్షాల నేపథ్యంలో నగరవాసులకు ఇబ్బందులు
- చినుకు పడితే గంటల తరబడి నిరీక్షణే

వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ ప్రకటించిందే ఆలస్యం.. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరుతోన్న జీహెచ్‌ఎంసీ... క్షేత్రస్థాయిలో పరిస్థితులు మెరుగుపర్చడంపై అంతగా దృష్టి సారించడం లేదు. వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అధికారిక లెక్కల ప్రకారం నగరంలో భారీగా వరద నీరు నిలిచే ప్రాంతాలు 125 ఉండగా.. అనధికారికంగా ఆ సంఖ్య రెట్టింపు ఉంటుంది. అధికారికంగా గుర్తించిన వాటిలో 40 చోట్ల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు బల్దియా వర్గాలు చెబుతున్నాయి. 53 ప్రాంతాల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. వర్షం పడితే ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోన్న మరో 38 ప్రాంతాలను ఇటీవల ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. వరదనీరు నిలిచే ప్రాంతాల్లో వరద సాఫీగా వెళ్లేలా గతంలో కోట్లాది రూపాయలు వెచ్చించి పనులు చేశారు. అయినా, మెజార్టీ ఏరియాల్లో సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదు. ఆక్రమణలు, సరైన వరద ప్రవాహ వ్యవస్థ లేక కొత్త ఏరియాల్లోనూ వరదనీరు నిలుస్తోంది. మోటార్ పంపులు, యంత్రాలతో సహా మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీంలు ఏర్పాటు చేస్తున్నా.. నగరవాసులకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు.

ఖైరతాబాద్‌లో అత్యధికం..

చినుకు పడితే రోడ్లపై సిటీజనులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. ఏఎస్‌రావునగర్ నుంచి

మిగతా 6వ పేజీలో..

మ్యాన్‌హోళ్లను తెరిస్తే క్రిమినల్ కేసులు

5

ఈ పీఎస్ వెరీ హాట్

- సెటిల్‌మెంట్లకు కేరాఫ్ మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్
- గంజాయి స్మగ్లర్లు, రౌడీషీటర్లకు అండగా ఖాకీలు
- ఒకే రోజు ఐదుగురు కానిస్టేబుళ్లపై సీపీ వేటు
- గతంలో ఓ ఎస్ఐ, ఆరుగురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్


మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్

మంగళ్‌హాట్/హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. సిటీ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఒకేరోజు ఐదుగురు కానిస్టేబుళ్లపై వేటువేయడం పోలీసువర్గాల్లో చర్చనీయాంశమైంది. గంజాయి స్మగ్లర్లు, రౌడీషీటర్లు, నేరస్థులకు కొమ్ముకాస్తున్నట్లు విచారణలో తేలడంతో ముగ్గురు కానిస్టేబుళ్లు మహేందర్ యాదవ్, తిలక్‌రాజ్, శ్రావణ్‌ను సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లు నరేందర్, శ్రీనివాస్‌ను ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళ్‌హాట్ స్టేషన్‌లో గతంలో ఓ ఇన్‌స్పెక్టర్, అడిషనల్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై సహా ఆరుగురు కానిస్టేబుళ్లు సస్పెండ్ కాగా, తాజాగా మరో ఐదుగురిపై వేటుపడింది.

వేటు పడినా... రూటు మారలేదు..

అక్రమార్కులతో చెట్టాపట్టాలేసుకొని తిరిగే వారిపై వేటు వేస్తున్నా వారు రూటు మార్చుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గంజాయి సరఫరాదారులు, క్రికెట్ బెట్టింగ్, సట్టా నిర్వాహకులు, బెల్ట్‌షాప్ నిర్వాహకులు ధూల్‌పేట్‌లో రోజూ కోట్ల రూపాయల దందా సాగిస్తున్నారు. హవాలా డబ్బును తరలించడంలో కొందరు పోలీస్ అధికారుల అండదండలు ఉన్నట్లు ఆ శాఖలోనే చర్చ సాగుతోంది. గతంలో మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో మామూళ్లు వసూలు చేసిన ఓ కానిస్టేబుల్ జూబ్లీహిల్స్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అతడిని ఇతర విభాగంలో పనిచేస్తున్నట్లు చూపించి మంగళ్‌హాట్‌కు పంపించి అతడి ద్వారానే మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు అక్రమాలు నిజమేనని తేల్చారు. గతంలో గంజాయి స్మగ్లర్ల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేసిన మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రణవీర్ రెడ్డిని, గంజాయి సరఫరాదారులతో బర్త్‌డే పార్టీలు చేసుకున్న డీఐ మహేందర్‌రెడ్డిని గత నెలలో సస్పెండ్ చేశారు.

పోలీస్ శాఖకూ సైబర్ ముప్పు

- సైబర్ సెక్యూరిటీకి సవాల్ విసిరిన నేరగాళ్లు
- 'హాక్ ఐ' యాప్ హ్యాక్
- సెక్యూరిటీ లోపాలపై దృష్టిపెట్టిన ఐటీ సెల్
- కొన్నిరోజులుగా పనిచేయని మూడు కమిషనరేట్ల వెబ్‌సైట్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీలో లోపాలు.. పోలీస్ డిపార్టుమెంట్‌కు సవాల్‌గా మారాయి. దేశంలోనే మొదటిసారిగా, ఎవరూ అందుబాటులోకి తేని విధంగా సైబర్ సెక్యూరిటీబ్యూరోను అందుబాటులోకి తెచ్చినట్లు పోలీస్ ఉన్నతాధికారులు గతేడాది గొప్పగా చెప్పారు. ఎలాంటి సైబర్ ముప్పునైనా ముందే గుర్తించి సమర్థవంతంగా ఎదుర్కొనేంత అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. ఇటీవల 'హాక్ ఐ' యాప్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినా ముందే పసిగట్టలేకపోయారు. పోలీస్ డిపార్టుమెంట్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజోపయోగం కోసం అందుబాటులోకి తెచ్చిన అప్లికేషన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి, లక్షలాది మంది డేటా చోరీ చేయడంతో కంగుతున్నారు. ఉరుకులు పరుగులతో రంగంలోకి దిగిన పోలీస్ ఉన్నతాధికారులు బృందాలుగా ఏర్పడి టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన హ్యాకర్‌ను అరెస్టు చేశారు. అప్పటికే డేటాను చోరీ చేసిన సైబర్ నేరగాడు ఆ డేటాను ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టినట్లు పోలీసులు గుర్తించారు.

ఐటీ సెల్ దిద్దుబాటు చర్యలు..

హాక్ ఐ యాప్ హ్యాక్‌కు గురైనప్పటి నుంచి ఐటీ సెల్ ఉన్నతాధికారులు సైబర్ సెక్యూరిటీ లోపాలపై దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. దాంతో పోలీస్ శాఖలో వినియోగిస్తున్న అప్లికేషన్స్‌తో పాటు.. వివిధ కమిషనరేట్ల వెబ్‌సైట్లలో ఉన్న సెక్యూరిటీ లోపాలను సరిచేస్తున్నట్లు తెలిసింది. దాంతో కొన్నిరోజులుగా హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల వెబ్‌సైట్లు పనిచేయడం లేదు. వాటితో పాటు పోలీస్ శాఖ అధ్వర్యంలో వినియోగంలో ఉన్న అప్లికేషన్స్, ఇతర సైట్లలో లోపాలను ఐటీ అధికారులు సరిచేస్తున్నట్లు సమాచారం.



నిస్సీలియన్‌ను అభినందిస్తున్న కిమ్స్ ఆస్పత్రులు ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

విద్యార్థినికి 'కిమ్స్' అభినందనలు

హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్ర జ్యోతి): యూకేలో ఉన్నత ఉద్యోగం సాధించిన ఓ విద్యార్థి కిమ్స్ ఆస్పత్రుల ఎండీ డాక్టర్ భాస్కర్‌రావును మంగళవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్‌లో కలిశారు. బొల్లినేని మెడిస్కిల్స్ పారా మెడికల్‌డిగ్రీ కాలేజీలో చదివిన విద్యార్థి నన్నం నిస్సీలియన్‌కు ఉన్నత ఉద్యోగం లభించడంతో ఆయన ఆమెను అభినందించారు. తెనాలికి చెందిన ఆమెకు యూకేలోని నేషనల్ హెల్త్ సర్వీసుకు చెందిన అత్యున్నత ఆస్పత్రిలో ఉద్యోగానికి ఎంపికైంది. ఆమెకు ఈ సంస్థలో రూ.37లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం లభించింది.

ఆపరేషన్ కగార్‌లో భాగమే..

మూలవాసీ బచావో మంచ్ నాయకుల అరెస్టు

● వారిని విడుదల చేయాలి ● ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

పంజాగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఛత్తీ‌సగఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్‌లో భాగంగానే మూలవాసీ బచావో మంచ్ నాయకులను పోలీసులు ఎత్తుకెళ్లారని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆరోపించింది. వారిని వెంటనే విడుదల చేయాలని, నిజ నిర్ధారణ కమిటీ వేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, వేదిక నాయకులు, తెలంగాణ పీపుల్స్ జేఏసీ కో కన్వీనర్ కన్నెగంటి రవి, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య, నారాయణ రావు తదితరులు మాట్లాడారు. గత నెల 19న భీమా సోడి మూలవాసి బచావో మంచ్ అధ్యక్షుడు రఘు మిడియాతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీసగఢ్ పోలీసులు, కేంద్ర భద్రతా బలగాల చట్ట వ్యతిరేక నిర్బంధకాండ గురించి మీడియాతో మాట్లాడారని అన్నారు. ఇలా బీజేపీ ప్రభుత్వ అణచివేత చర్యలను సమాజం దృష్టికి తీసుకెళ్లారనే కక్షతో భీమాసోడి, మిగతా ఇద్దరిని పోలీసులు ఎత్తుకెళ్లారని ఆరోపించారు. పోలీసుల అదుపులో ఉన్న జోగా మడకం, ఆదివాసీ బచావో మంచ్ ఉపాధ్యక్షురాలు సునీత పొట్టంలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విజన్ ఉన్న నేత చంద్రబాబు

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



నార్సింగ్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విజన్ ఉన్న చంద్రబాబు నాయుడు అని, ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో ఆయన చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దూరదృష్టి ఉన్న నేత చంద్రబాబు ఏపీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయన శిష్యులమని చెప్పుకునేందుకు తాము గర్వంగా ఫీల్ అవుతున్నామన్నారు. ఐటీ రంగం దేశంలో పేరు గడించిందటే చంద్రబాబు చలవే అన్నారు. ఇటు విద్యారంగంలో, ఐటీ రంగంలో ఆయన ఒక ఉపాధ్యాయుడని, మేధావి లాంటి ఆయన సీఎంగా ప్రమాణస్వీకారం చేయడం మా అందరికీ గర్వకారణం అని ఆనందం వ్యక్తం చేశారు.

నేడు సికింద్రాబాద్-కొల్లం రైలు రద్దు

సికింద్రాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల కారణంగా ఈనెల 12వ తేదీన సికింద్రాబాద్ నుంచి బయల్దేరాల్సిన సికింద్రాబాద్-కొల్లం (నంబర్: 07193) రైలు, ఈనెల 14వ తేదీన కొల్లం నుంచి బయల్దేరాల్సిన కొల్లం-సికింద్రాబాద్ (నెంబర్: 07194) రైలును రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్యరైల్వే అధికారులు తెలిపారు.

● **మూడు రైళ్ల దారిమళ్లింపు :** నాగపూర్ డివిజన్‌లో ట్రాఫిక్ బ్లాక్ పనుల కారణంగా ఈనెల 18న సికింద్రాబాద్ నుంచి బయలుదేరే సికింద్రాబాద్-దర్భంగ(17007, 17008), యశ్వంత్‌పూర్-కోర్బా (12251) రైళ్లను బలార్షా, నాగపూర్, గోండియాల మీదుగా నడపనున్నారు.

మ్యాన్‌హోళ్లను తెరిస్తే క్రిమినల్ కేసులు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: వాటర్‌బోర్డు

హైదరాబాద్ సిటీ, జూన్11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో ఎక్కడైనా మ్యాన్‌హోళ్ల మూతలు తెరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వాటర్‌బోర్డు హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించి ఎవ్వరైనా మ్యాన్‌హోళ్ల మూతలను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించింది. వర్షాకాలం నేపథ్యంలో.. ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ఉండేందుకు ఈ సూచనలు చేశారు. వాటర్‌బోర్డు యాక్ట్ -198 9సెక్షన్74 ప్రకారం ఎవరైనా పౌరులు, అనధికార వ్యక్తులు అధికారుల అనుమతి లేకుండా మ్యాన్‌హోళ్లపై ఉన్న మూత తెరచినా, తొలగించినా నేరం. దీన్ని అతిక్రమించి, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. నిందితులకు జరిమానా విధించడంతోపాటు కొన్నిసార్లు జైలుశిక్ష వేసే అవకాశముంది. అయితే నగరంలో ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనిస్తే వెంటనే వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్‌చేసి సమాచారమివ్వాలని, దగ్గరలోని వాటర్‌బోర్డు కార్యాలయాల్లో నేరుగా సంప్రదించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి సూచించారు.



కూకట్‌పల్లిలోని ఏవీబీపురం వద్ద మ్యాన్‌హోల్‌కు సేఫ్టీ గ్రిల్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నగరంలో ప్రధానంగా వర్షం వస్తే మ్యాన్‌హోళ్లలో పడి మృతి చెందిన ఘటనలున్న నేపథ్యంలో వాటర్‌బోర్డు అప్రమత్తమైంది. మ్యాన్‌హోళ్లను తెరువకుండా నగరవాసుల్లో అవగాహన కల్పించడంతో పాటు హెచ్చరికలు జారీ చేసింది. అంతేగాకుండా ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు వాటర్‌బోర్డు తీసుకుంది. 25వేలకు పైగా మ్యాన్‌హోళ్లకు సేఫ్టీగ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి, రెడ్ పెయింట్ ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఒక సీవరేజీ బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్రస్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు.

ప్రజల్లో విస్తృత అవగాహనకు చర్యలు

వర్షాకాలంలో సీవరేజీ నిర్వహణలో సాధారణ పౌరులు ఎలా ప్రవర్తించాలి, ఎలా నడుచుకోవాలనే అంశాలపై వాటర్‌బోర్డు విరివిగా ప్రచారం చేస్తోంది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్‌హెచ్ గ్రూపుల సభ్యులతో అవగాహన కల్పిస్తోంది.



మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసిన సేఫ్టీగ్రిల్

అంతే కాకుండా చేయాల్సిన, చేయకూడని పనులపై పత్రికలు, టెలివిజన్, ట్విటర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి సమాయత్తమవుతోంది.

అధికారుల సమన్వయంతో పనులు

జీహెచ్‌ఎంసీ, పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో పనులను చేయనున్నారు. వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్పీటీ) వాహనాలను రంగంలోకి దింపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలను అందించారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్‌తో కూడిన డీ వాటర్ మోటార్ ఉంటుంది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటి కప్పుడు క్లియర్ చేస్తారు. వీటితోపాటు ఎయిర్‌టెక్ మిషన్లు సైతం అందుబాటులో ఉన్నాయి. మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారు.



ఎం. శివయ్య, జి. శ్రీనివాసరావు, ఎం. స్వర్ణలత, ఎం. జశ్వంత్ (ఫైల్)

రూ. 10 కోట్లు కొల్లగొట్టారు

- యూట్యూబ్ చానళ్లలో ప్రచారం నిర్వహించిన కేటుగాడు
- శిక్షణ కోసం లక్ష ఫీజు వసూలు ● నలుగురి అరెస్టు
- సహకరించిన భార్య, కొడుకు, అడ్వొకేట్

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మోసపోయే వారు ఉన్నంత కాలం మోసం చేసే వారు ఉంటారనడంలో అతిశయోక్తి లేదు.. ఏపీకి చెందిన శివయ్య సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం భార్య, కొడుకు, ఓ అడ్వొకేట్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రెండు యూ ట్యూబ్ ఛానళ్లు ఏర్పాటుచేశారు. ఓ ఛానల్ ద్వారా ప్రకృతి వైద్యుడిగా శివయ్య ప్రచారం చేసుకొన్నాడు. మరో ఛానల్ ద్వారా రియల్ ఎస్టేట్‌లో డబ్బు సంపాదించేందుకు శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ తీసుకునే వారి నుంచి రూ. లక్ష ఫీజు వసూలు చేశారు. మొత్తం రూ. 10 కోట్లకు పైగా వసూలు చేసి బిచాణా ఎత్తేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు విచారణ చేపట్టి మంగళవారం నలుగురిని అరెస్టు చేశారు. నగరంలో ఉంటున్న ఏపీకి చెందిన శివయ్య అలియాస్ శివకుమార్ భార్య స్వర్ణలత, కొడుకు జశ్వంత్, అడ్వకేట్‌తో కలిసి సులభంగా డబ్బు సంపాదించేందుకు పథకం వేశాడు. మీ మాంస, రీబూట్ పేరుతో రెండు యూ ట్యూబ్ ఛానళ్లు ప్రారంభించారు. ప్రకృతి వైద్యంపై అవగాహన ఉండటంతో మీమాంస ఛానల్ ద్వారా శివయ్య బీపీ, మధుమేహం, థైరాయిడ్, కేన్సర్ వ్యాధులకు సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. నమ్మిన వారిని మభ్యపెట్టి రీబూట్ అనే మరో ఛానల్ ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో డబ్బు సంపాదనకంటూ శిక్షణ ఇచ్చేవాడు. ఇందుకు గాను లక్ష ఫీజు వసూలు చేసేవాడు. రియల్ రంగంలో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో లాభాలొస్తాయని నమ్మించాడు. నిజమని నమ్మిన 70 మంది లక్షల్లో పెట్టుబడి పెట్టారు. వారి నుంచి శివయ్య రూ. 10.86 కోట్లు కొల్లగొట్టాడు. ఎంతకూ లాభాలు రాకపోవడంతో డబ్బులు ఇచ్చిన వారు నిలదీయగా తాను గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దలకు బినామీ అని, నన్ను ఎవరూ ఏమీ చేయలేరని బెదిరించాడు. శివయ్య తీరుపై అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా అరెస్టు చేశారు. అతడ్ని విచారించగా.. భార్య స్వర్ణలత, కొడుకు జశ్వంత్, అడ్వొకేట్ శ్రీనివాస్‌తో కలిసి మోసం చేస్తున్నట్టు చెప్పాడు. వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన శివకుమార్, అతని కొడుకు జశ్వంత్ గతంలో జైలు కెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. మళ్లీ మోసాలకు పాల్పడుతున్నారు. మీమాంస, రీబూట్ పేరుతో జరిగే మోసాలను నమ్మొద్దని, ఆర్థిక మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీసీఎస్ డీసీపీ సూచించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/qRjHVpYలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.

జంతు కళేబరాలను బహిరంగ ప్రదేశాలలో వేయొద్దు

- డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్

రాజేంద్రనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జంతు కళేబరాలను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, మైలార్‌దేవుపల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ డివిజన్‌లలో వ్యర్థాలను రోడ్లపైన, బహిరంగ ప్రదేశాలలో వేయకుండా యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది నుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ ఉన్నందున జంతు కళేబరాలను, వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేస్తుంటారని, ముందస్తుగా మసీదులలో, బస్తీలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బస్తీల వారీగా బ్లాక్ కవర్‌లు ఇచ్చి వ్యర్థాలను ఆ కవర్‌లో స్వచ్ఛ ఆటో సిబ్బందికి అందజేసేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా వ్యర్థాలను, చెత్తను ఎత్తివేయడానికి ఎన్ని ఎస్కవలేటర్లు, ఎన్ని టిప్పర్ వాహనాలు కావాలో ముందే అంచనా వేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్లు కృష్ణకిషోర్, ప్రవీణ్, సామేశ్, ఎస్.వీరాంజనేయులు, యేసు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

- గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

చాంద్రాయణగుట్ట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మేకలమండిలో మురుగునీరు నీటి సమస్యను పరిష్కరించాలని గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి కోరారు. మంగళవారం మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, జలమండలి అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. రోడ్డుపై మురుగునీరు నిలిచిపోవడంతో బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను త్వరగా పరిష్కరించాలని జలమండలి అధికారులకు సూచించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని జలమండలి అలియాబాద్ సెక్షన్ మేనేజర్ ముక్రం బాబా తెలిపారు. ఆమె వెంట స్థానిక నాయకులు ఈ.సుమన్‌కుమార్, జి.రఘుకాంత్, మల్లేష్, జి.వికాస్, జలమండలి అధికారులు సర్వేశ్, రవి తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించే

ఏకైక యూనియన్ ఎంఎస్ఎంయూ

అఫ్జల్‌గంజ్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే ఏకైక యూనియన్ మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్(ఎంఎస్ఎంయూ) తప్పా మరే ఇతర యూనియన్లు లేవని అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం యూనియన్ ప్రధాన కార్యాలయంలో నగరంలోని వివిధ సర్కిళ్లకు చెందిన కార్మికులు, ఉద్యోగులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఉద్యోగులు సహకార మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఐఎన్‌టీయూసీ 75 సంవత్సరాలు పూర్తి చేసుకుందని... ఈ నెల 26న జరిగే వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు కార్యవర్గం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో కృపానందం, ఏవీఎస్ గాంధీ, జి.కె.శివకుమార్, వెంకటేశ్, మహ్మద్ యూసుఫ్, సిద్దిఖ్, కె.శివకుమార్, సత్యనారాయణ, ఖాజా, పాషా, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌రావు ముదిరాజ్‌కు శ్రీమహానంది పురస్కారం

రవీంద్రభారతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, శివతేజ ఆధ్వర్యంలో సామాజికసేవ కార్యక్రమాలతోపాటు పేదల జంటలకు వివాహాలు జరిపించడంలో కృషి చేస్తున్న పలువురు సామాజికవేత్తలకు శ్రీ మహానంది పురస్కారాల ప్రదానం 2023-24 మంగళవారం రవీంద్రభారతిలో జరిగింది. శాసనసభ డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, ఎంపీ ఆర్.కృష్ణయ్య బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, పల్లె లక్ష్మణ్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై సామాజివేత్త కాశమ్యోని శ్యాంరావు ముదిరాజ్‌కు శ్రీమహానంది పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో దైవాజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందజేస్తున్న ప్రకాశ్ ముదిరాజ్



పురస్కారాన్ని అందుకుంటున్న గోరుకంటి రవీందర్‌రావు

రవీందర్‌రావుకు విద్యాదాత పురస్కారం

హైదరాబాద్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): యశోద ఫౌండేషన్, యశోద ఆస్పత్రుల గ్రూప్ వ్యవస్థాపకుడు గోరుకంటి రవీందర్‌రావుకు విద్యాదాత పురస్కారాన్ని వందేమాతరం ఫౌండేషన్ అందించింది. రవీంద్రభారతిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పురస్కారాన్ని స్వీకరించారు. అనాథ పిల్లలను విద్యార్థులుగా తీర్చిదిద్దడం, ఆర్థిక స్వావలంబనను సాధించుకోవడానికి సేవలు అందిస్తున్నందుకు ఆయనకు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కమిషనర్ దేవసేన, జయప్రకాశ్‌నారాయణ, బీవీఆర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బదిలీలు.. సీఎం నిబద్ధతకు నిదర్శనం

- 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్

మంగళ్‌హాట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బదిలీల సమస్యను పరిష్కరించే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టడం హర్షించదగ్గ విషయమని తెలంగాణ 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ అన్నారు. మంగళవారం నాంపల్లి గృహకల్ప ప్రాంగణంలోని కార్యాలయంలో విలేకరు సమావేశం వారు మాట్లాడారు.

ఇరు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏపీ నుంచి తెలంగాణకు రావాలనుకునే ఉద్యోగుల విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల పట్ల రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని, రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలన్నింటిని సీఎం పరిష్కరిస్తారనే నమ్మకం ఉందన్నారు. 4వ తరగతి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించేలా తమవంతు కృషి చేస్తామన్నారు.

వైద్యుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలి

గోషామహల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్యశాఖలో బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని, వైద్య సంఘాల నేతల ప్రమేయం, ఒత్తిడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ టీచింగ్ డాక్టర్స్ జాయింట్ యాక్షన్ బృందం(జేఏసీ) కోరింది. మంగళవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ చైర్మన్ డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ... త్వరలో నిర్వహించనున్న వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా చేపట్టేలా చూడాలని మంత్రిని కోరారు. ఐదేళ్లుగా ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో పాతుకుపోయిన వైద్యులకు స్థానచలనం కల్పించి, గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న వైద్యులకు అవకాశం కల్పించాలని కోరారు. వైద్యుల సంఘం ముసుగులో కొందరు పదేళ్లుగా ఒకే చోట పని చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వారిపై దృష్టి సారించకపోవడం బాధకరమన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఈసారి బదిలీలో ఎవరి ప్రమేయం లేకుండా చేపడతామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు వైద్యులు చంద్రశేఖర్, బాబురావు, జగతి, ఆజం, కవిత, అరుణ, శకుంతల, సాంబశివరెడ్డి, సూర్యనారాయణ, అమరావతి, మూసాఖాన్, హేమలత తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రాజనర్సింహకు పూలబొకే అందజేస్తున్న మెడికల్ కాలేజీ వైద్యులు

కాలనీ ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో బోర్లు

- ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తూ నీటి విక్రయాలు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

రాజేంద్రనగర్, జూన్11(ఆంధ్రజ్యోతి): కాలనీ మధ్య ఖాళీ స్థలంలో బోరు వేసి నీటిని తోడేస్తున్నారు. బోరుకు మోటారు బిగించి ట్యాంకర్లలో నింపి నీటి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బుద్వేల్ వర్మ కాలనీ ప్రజలు కోరుతున్నారు. నెల రోజులకు పైగా సాగుతున్న నీటి వ్యాపారాన్ని అడ్డుకోవాలని రాజేంద్రనగర్ వాటర్‌వర్క్స్ అధికారులకు చెప్పగా, అది మా పరిధిలోకి రాదని దాటవేశారని వారన్నారు. ఇదే విషయం రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే వారూ పట్టించుకోలేదన్నారు. దాంతో జూన్ 2నరాజేంద్రనగర్ తహసీల్దార్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశామని వర్మ కాలనీ వాసులు చెప్పారు. స్పందించిన తహసీల్దార్ ప్రస్తుతం ఆర్‌ఐ సెలవులో ఉన్నారని, ఆయన రాగానే పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోర్లను సీజ్ చేస్తామని చెప్పి 8 రోజులు కావస్తోన్నా నేటి వరకు చర్యలు తీసుకోవడం లేదని కాలనీకి చెందిన వెంకట్‌రామ్ అనే వ్యక్తి తెలిపారు. కాలనీ మధ్యలో బోరు వేసి నీటిని తోడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.



జనావాసాల మధ్య ఖాళీ ప్రదేశంలో వేసిన బోరు



ఆస్పత్రిలో పూర్వవైద్య విద్యార్థి డాక్టర్ దినేష్‌రెడ్డితో గాంధీ వైద్యులు

'గాంధీ'కి రూ.50 లక్షల వైద్య పరికరాలు

- అందజేసిన పూర్వ విద్యార్థి డాక్టర్ దినేష్‌రెడ్డి

అడ్డగుట్ట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రవాసాంధ్రుడు, గాంధీ మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థి డాక్టర్ దినేష్‌రెడ్డి రూ.50 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను గాంధీ ఆస్పత్రికి అందజేశారు. మంగళవారం గాంధీ ఆస్పత్రి గ్యాస్ట్రో విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆస్పత్రికి రూ.50 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను దినేష్‌రెడ్డి ఇచ్చారు. 20 ఏళ్లుగా వైద్య వృత్తిలో ఉంటూ సామాజిక సేవలో పాల్గొంటున్నాని దినేష్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ డెబలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడిగా ఎడ్యూకేషన్, అగ్రికల్చర్, హెల్త్‌కేర్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై పరిశోధించిన డాక్టర్ దినేష్‌రెడ్డి నివేదికను గత ప్రభుత్వానికి అందజేసినట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్.. డాక్టర్ దినేష్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గ్రూప్-2, 3లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్‌సీ ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న గ్రూప్-2, 3 పరీక్షలకు ఉచిత శిక్షణకు మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మహ్మద్ ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 45 రోజులపాటు ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. అభ్యర్థులు హైదరాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, దరఖాస్తులను ఈనెల 18లోగా ఆబిడ్స్‌లోని తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్, నాంపల్లి హజ్‌హౌస్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. జూన్ 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 040-23240134 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అటానమస్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

- ఇండియన్ స్టూడెంట్ యూనియన్ డిమాండ్

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేరుగాంచిన అటానమస్ ఇంజనీరింగ్(ఏఈ) కళాశాలలు విద్యార్థుల నుంచి అధిక డొనేషన్లను వసూలు చేస్తున్నాయని, వాటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు డిమాండ్ చేశారు. ఆయా కళాశాలలు ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల నుంచి డొనేషన్ ఇతర ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రముఖ కళాశాలలతోపాటు సెకెండ్, థర్డ్ గ్రేడ్ ఉన్న కాలేజీలు కూడా కొత్త రూల్స్ పేరుతో లక్షలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అటానమస్ పేరుతో ఆయా కళాశాలలు ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా సీట్లు భర్తీ చేసుకుంటున్నాయని గుర్తుచేశారు. విద్యాశాఖ అధికారులు, సీఎం స్పందించి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం రేవంత్‌ను కలిసిన డాక్టర్ రఘురాం

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ సీఈఓ, డైరెక్టర్ డాక్టర్ రఘురాం మంగళవారం సచివాలయంలో కలిశారు. భారతదేశంలో మహిళలను ప్రభావితం చేసే అత్యంత సాధారణ కేన్సర్ రొమ్ము అని, దాని నియంత్రణ మార్గాలపై సీఎంతో చర్చించినట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో పటిష్ఠమైన జనాభా ఆధారిత రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనను డాక్టర్ రఘు రామ్ సమర్పించారు. డాక్టర్ రఘు రామ్ చేస్తున్న ప్రయత్నాలను సీఎం ప్రశంసించారు. ప్రతిపాదనను పరిశీలిస్తామని సీఎం హామీ ఇచ్చారని రఘురాం తెలిపారు.



సీఎం రేవంత్ రెడ్డితో డా.రఘురాం

ఖైదీల విడుదలకు ఎంపీజే సాయం

మదీన, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శిక్షా కాలం ముగిసినప్పటికీ జైలులో మగ్గుతున్న 13 మంది ఖైదీలకు ఆర్థిక, న్యాయపరమైన సాయం అందించి వారి విడుదలకు ఏర్పాట్లు చేశామని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సలీముల్ హిందీ తెలిపారు. మంగళవారం సంస్థ ప్రతినిధులు సంగారెడ్డి సెంట్రల్ జైలును సందర్శించి జైలు సూపరింటెండెంట్‌ను కలిశారు. ఈ సందర్భంగా సలీముల్ హిందీ మాట్లాడుతూ, కోర్టు విధించిన శిక్ష అనుభవించినా, జరిమానా చెల్లించలేక జైలులో ఉండిపోయిన 13 మంది ఖైదీలకు ఆర్థిక సాయం అందజేశామన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్

గోషామహల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో నేపథ్యంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన రౌడీషీటర్ మన్మోహన్‌సింగ్‌తో పాటు మరో ముగ్గురిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గోషామహల్ ఏసీపీ కె.వెంకట్ రెడ్డి, సీఐ మహేశ్ గౌడ్ వివరాలను వెల్లడించారు. బలరాం గల్లీలో రౌడీషీటర్, గంజాయి విక్రేత మన్మోహన్ సింగ్ (45) నివాసముంటున్నాడు. శివలాల్‌నగర్ నివాసముండే సురేందర్‌సింగ్ అలియాస్ సుర్రు (33)తో పాత కక్షలు ఉన్నాయి. ఈ నెల 7వ తేదీ రాత్రి సురేందర్‌సింగ్ రహీంపురా మీదుగా వెళుతున్నాడని తెలుసుకొని మన్మోహన్‌సింగ్‌తో పాటు మరో ఎనిమిది మంది అతడిని వెంబడించి గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. సురేందర్‌సింగ్ ఫిర్యాదు మేరకు మన్మోహన్‌సింగ్, శంకర్‌సింగ్, రాజు సింగ్, కిషన్‌సింగ్, పుష్పారాజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మనీష్, ధన్‌రాజ్, అనిల్, చోటూ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

మదీన, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయించేందుకు యత్నిస్తున్న ఐదుగురిని బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేటకు చెందిన ఫైసల్, అతని భార్య బషరత్‌తోపాటు అంబర్‌పేటకే చెందిన అబ్రార్, చందులాల్, బారాదరికి చెందిన రహ్మత్, బెంగళూరుకు చెందిన జునైద్ నార్కోటిక్ డ్రగ్స్‌కు తీసుకువచ్చి నగరంలో అమ్ముతుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం హసన్‌నగర్ వద్ద వారిని అరెస్ట్ చేశామని, రూ.2లక్షల విలువ చేసే 34 గ్రాముల డ్రగ్స్‌స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పనికోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం

పహాడిషరీఫ్ జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పని కోసం వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఈ ఘటన పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తుక్కుగూడకు చెందిన గంజి అంకం రావు, నాగేశమ్మ భార్యాభర్తలు. అల్వాల్‌లో పని ఉందని 20 రోజుల క్రితం భార్యకు చెప్పి తుక్కుగూడ నుంచి బైక్‌పై వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. ఈ నెల 7న భార్య ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన భార్య అతడు పనిచేస్తున్న స్థలం వద్దకు వెళ్లి విచారించగా నాలుగు రోజుల నుంచి పనికి రావడం లేదని అక్కడి వారు చెప్పారు. అప్పటి నుంచి అతడి ఆచూకీ కోసం గాలించినా లభించకపోవడంతో మంగళవారం భార్య నాగేశమ్మ పహాడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



అంకం రావు

కీమోథెరపీ రోగులకు అంకాలజీ బ్లాక్

మంగళ్‌హాట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కీమోథెరపీ చేయించుకుంటున్న రోగులకు వెయిటింగ్ పిరియడ్‌ను 48 గంటల నుంచి 6 గంటల కంటే తక్కువగా తగ్గించేందుకు కొత్తబ్లాక్ ఎంతో సహయపడిందని మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పది నెలల కాలంలో రెండు రాష్ట్రాల నుంచి దాదాపు 1.35 లక్షల మంది కేన్సర్ రోగులకు మెరుగైన చికిత్సలు అందించామన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.80 కోట్లతో 300 పడకల అత్యాధునిక అంకాలజీ బ్లాక్‌ను నిర్మించిందని.. ఇందులో రేడియోథెరపీ, కీమోథెరపీ, పాలియోటివ్ కేర్‌తో వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు.

గృహజ్యోతి పథకం అమలు చేయాలి


- సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్, జూన్11 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బుద్వేల్‌లోని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయం(ఏఆర్ దేవరాజ్ భవన్)లో విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ఈ.నిరంజన్‌గౌడ్, జి.సత్యంతో కలసి ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగియడంతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. గృహ జ్యోతి పథకం కింద వినియోగదారులకు 200 యూనిట్లు వరకు వచ్చే బిల్లులు జీరో క్రింద అమలు చేస్తామని చెప్పారన్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాలో అమలు చేస్తున్నారన్న ఆయన, రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాలలో, గ్రేటర్ పరిధిలోనూ గృహజ్యోతి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మళ్లీ పూర్వ స్థితికి డార్మిటరీ

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- టెండర్ రద్దు చేస్తామని యజమానికి హెచ్చరిక






డార్మిటరీని పరిశీలిస్తున్న అధికారులు.. సామగ్రి తొలగించిన తర్వాత...

అఫ్జల్‌గంజ్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎంజీబీఎస్ బస్టాండ్‌లోని డార్మిటరీలో నిల్వ చేసిన నిత్యావసరాలను తొలగించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'వంటశాలగా మారిన ఎంజీబీఎస్ డార్మిటరీ' కథనానికి అధికారులు స్పందించారు. ఆర్టీసీ పాలక వర్గం వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకుంది. రంగారెడ్డి రీజియన్ ఇన్‌చార్జి ఆర్ఎం రాజు ఆదేశాల మేరకు సీఆర్ఎం శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి మంగళవారం యఘ్నేశ్ విరాట్ డార్మిటరీ హాల్‌ను సందర్శించి పరిశీలించారు. ఎక్కడపడితే అక్కడ నూనె డబ్బాలు, బియ్యం బస్తాలు, ఉల్లిగడ్డ బస్తాలు, కూరగాయాలు నిత్యావసర సరుకులు కనిపించడంతో యజమానిని పిలిపించి మందలించారు. ప్రయాణికులకు విశ్రాంతి కోసం కేటాయించిన గదులను వంటశాలగా మారడం ఏంటనీ సదరు కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. వెంటనే హాల్‌లో ఉన్న సరుకులను తొలగించి పూర్వ స్థితికి తీసుకొచ్చారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో చేపడితే టెండర్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

గోల్కొండ ఆలయంలో ప్రారంభమైన బోనాల ఏర్పాట్లు

నార్సింగ్ జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ బోనాలు ఆషాడమాసంలో ప్రారంభం కానున్నాయి. మంగళవారం కోటపై గల చారిత్రక శ్రీజగదాంబిక (గోల్కొండ ఎల్లమ్మ) ఆలయంలో మంగళవారం ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయ ప్రధాన పూజారి సర్వేశ్ పంతులు ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహానికి అలంకరణతోపాటు, చుట్టు ప్రక్కల ప్రాంగణాలకు రంగులు వేస్తున్నారు. ఆలయం చుట్టూ క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. ఆలయం కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఉండడంతో పురావస్తుశాఖ నిబంధనలు ప్రకారం ఏర్పాట్లు జరుగుతున్నాయని పూజారి తెలిపారు.



ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం



ఎల్లమ్మ అమ్మవారు

కారు నడిపిన బాలుడి తల్లిదండ్రులపై కేసు నమోదు

నార్సింగ్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మణికొండలో సోమవారం రాత్రి బాలుడు కారు డ్రైవింగ్ చేసి పలు వాహనాలను ఢీకొట్టి ఇద్దరిని గాయపరిచిన ఘటనపై నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనం నడిపిన బాలుడి తండ్రిపై, కారు యజమాని(తల్లి)పై కేసు నమోదు చేశామని నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. ఇంట్లో కీ కనిపించడంతో ఎవరికి చెప్పకుండా కారు తీసుకుని బయటకు వచ్చాడు. మొదట ఒక వాహనాన్ని ఢీకొట్టడంతో స్థానికులు అరవగా కారు వేగాన్ని పెంచి మరికొన్నింటిని ఢీకొట్టాడు. బాలుడి తల్లిదండ్రులపై ఐపీసీ సెక్షన్‌లతో పాటు మోటార్ వెహికల్ యాక్ట్ కూడా నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. మైనర్లకు కారు, ద్విచక్ర వాహనం ఇచ్చినా తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

మేడ్చల్ జోన్‌లో సంగారెడ్డి సర్కిల్

- పాలన సౌలభ్యం కోసం విద్యుత్‌శాఖ మార్పులు
- జూలై 1 నుంచి మేడ్చల్ జోన్ నుంచి సంగారెడ్డి ఆపరేషన్స్
- ఉత్తర్వులు జారీ చేసిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ



మేడ్చల్ జోన్‌లో సర్కిళ్లు, విద్యుత్ కనెక్షన్లు

సర్కిల్	విద్యుత్ కనెక్షన్లు
హబ్సిగూడ	8,95,038
మేడ్చల్	8,44,514
సంగారెడ్డి	7,91,364
మొత్తం	25,30,916

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చుట్టూ శివారు ప్రాంతాల్లో వేగంగా విస్తరించడం.. భారీగా విద్యుత్ డిమాండ్ పెరగడం, లక్షల సంఖ్యలో కొత్త విద్యుత్ కనెక్షన్లు వస్తుండడంతో తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) పాలనా సౌలభ్యం, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మేడ్చల్ రూరల్ జోన్ పరిధిలోని సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్‌ను మేడ్చల్ జోన్‌లో కలుపుతున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జూలై 1 నుంచి సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్ నిర్వహణ మేడ్చల్ జోన్ పరిధిలోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంగారెడ్డి సర్కిల్ మేడ్చల్ జోన్‌లోకి తీసుకురావడంతో ఈ జోన్‌లో సర్కిళ్ల సంఖ్య మూడుకు చేరింది. ఇప్పటికే మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్లు మేడ్చల్ జోన్ పరిధిలో ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ మూడు జోన్లు ఉన్నాయి. మెట్రోజోన్ పరిధిలో బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, సౌత్, సికింద్రాబాద్ ఆపరేషన్ సర్కిళ్లు పనిచేస్తున్నాయి. రంగారెడ్డి జోన్‌లో సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లు, మేడ్చల్ జోన్‌లో హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్లు ఉండగా కొత్తగా సంగారెడ్డి సర్కిల్‌ను కలిపారు. సంగారెడ్డి సర్కిల్‌లో పటాన్‌చెరు, జహీరాబాద్, జోగిపేట, సంగారెడ్డి డివిజన్లు ఉండగా మొత్తం 7.91 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ఏరియాతో పాటు ఎక్కువ అపార్ట్‌మెంట్లు, కొత్తకాలనీలు ఏర్పాటవుతుండటంతో విద్యుత్‌శాఖ ఈ ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తున్నది. బీరంగూడ, ఆర్సీపురం, అమీన్‌పూర్, బొల్లారం, పటాన్‌చెరు వంటి ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ రికార్డుస్థాయిలో పెరుగుతోంది. నగరంలో ఎలాంటి విద్యుత్ సరఫరా వ్యవస్థ ఉందో అదేతరహాలో శివారు ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సర్కిళ్లను విద్యుత్‌శాఖ విస్తరిస్తోంది.

విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేయాలి

'ఆంధ్రజ్యోతి' సంపాదకులు కె.శ్రీనివాస్

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ చదువులతోపాటు సమాజంలో అసమానతలు, ఆర్థిక అంతరాలను రూపుమాపేందుకు సమాజాన్ని మార్చేందుకు అధ్యయనం చేయాలని 'ఆంధ్రజ్యోతి' సంపాదకులు కె.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి అధ్యక్షతన రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతుల ప్రారంభ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కె.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. సమాజంలో ఆధిపత్య వర్గాల భావజాలం అధికార భావజాలంగా ఉందని, బలహీనవర్గాలు, పేదలకు అందాల్సిన సౌకర్యాలు దేశంలో అందడం లేదన్నారు. దేశంలో ఒక వర్గంపై పనిగట్టుకుని మరీ విషప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు తమ భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు విద్య, చరిత్ర, అన్ని అంశాలను వాడుకుంటున్నారని అన్నారు. అందుకే సమసమాజం రావడానికి విద్యార్థులు తమ అకాడమిక్ చదువులతో పాటు సమాజంలో జరిగే దోపిడీ, అసమానతలు, ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బలమైన పోరాటాల నిర్వహణకు ఈ తరగతులలో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, శ్రీకాంత్‌వర్మ, ప్రశాంత్, శంకర్, సహాయ కార్యదర్శులు మమత, డి.కిరణ్, అశోక్‌రెడ్డి, డి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

వరదనీటి నిర్వహణలో విఫలం

(3వ పేజీ తరువాయి)

ఐటీ కారిడార్ వరకు అదే దుస్థితి. ప్రధాన రహదారులు, పలు ఏరియాల్లో అంతర్గత రోడ్లపైనా ట్రాఫిక్‌జామ్ అవుతోంది. దీంతో కిలోమీటర్ దూరానికి 10 నుంచి 30నిమిషాలు వేచి చూడాల్సి వస్తోంది. పలు ప్రాంతాల్లో అత్యవసర బృందాలు కనిపిస్తోన్నా.. తక్కువ సమయంలో అధిక వర్షపాతం కురుస్తుండడంతో వరదనీటి నిర్వహణ అదుపులోకి రావడం లేదు. గంటల తరబడి రోడ్లపైనే వరద నీరు నిలుస్తోంది. కొన్నిచోట్ల జీహెచ్ఎంసీ బృందాలు కనిపించకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు వరదనీటిని తొలగిస్తున్నారు. ఈక్రమంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సాధ్యపడడం లేదు. వరదనీటి డ్రైన్లలో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది కూడా వరదనీరు సాఫీగా వెళ్లకపోవడానికి మరో కారణం. ఖైరతాబాద్‌లో అత్యధికంగా 35 ప్రాంతాల్లో వరదనీరు నిలుస్తుండగా.. అత్యల్పంగా ఎల్‌బీనగర్‌లో అలాంటి తొమ్మిది ఏరియాలను గుర్తించారు.

నేడు వర్షాకాల సన్నద్ధతపై సమీక్ష

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల సన్నద్ధతపై హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం మొదలవుతుందని అధికారులు తెలిపారు.

వరద నీరు నిలిచే ప్రాంతాలు...

జోన్	సమస్య పరిష్కరించిన ప్రాంతాలు	పనులు వివిధ దశల్లో ఉన్నవి	ఎమర్జెన్సీ బృందాలు పనిచేసే ఏరియాలు	మొత్తం
ఎల్‌బీనగర్	5	4	0	9
చార్మినార్	5	9	4	18
ఖైరతాబాద్	12	13	10	35
శేరిలింగంపల్లి	7	3	9	19
కూకట్‌పల్లి	8	16	2	26
సికింద్రాబాద్	3	8	7	18
మొత్తం	40	53	32	5

ఐదు వేలిస్తే బస్సు ఫిట్!?

(3వ పేజీ తరువాయి)

కాగా.. 2,873 వాహనాలకు సర్టిఫికెట్లు లేవని రవాణా విభాగం వర్గాలే చెబుతున్నాయి. మరో ఎనిమిది వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తిరస్కరించారు. నిబంధనల ప్రకారం విద్యాసంస్థల బస్సులకు ప్రతి యేటా రవాణా శాఖ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఈ క్రమంలో కొందరు అధికారులు, పాఠశాలల యజమాన్యాలు పరస్పర అవగాహనతో వ్యవహరిస్తున్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీకి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించడం లేదు. ఇంజన్ ఎలా ఉంది..? బ్రేకులు పని చేస్తున్నాయా..? ప్రమాణాల మేరకు లైట్లు, సీట్లు ఉన్నాయా..? అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లున్నాయా..? కాలుష్యం, ఇతరత్రా సర్టిఫికెట్లు ఉన్నాయా..? అన్నది చూడడం లేదు. కొన్ని పాఠశాలలు బస్సుల ఫిట్‌నెస్ టెస్ట్ బాధ్యతలను దళారులకు అప్పగిస్తుండడం గమనార్హం. యాజమాన్యంతో బేరం కుదుర్చుకుంటోన్న వారు.. అధికారులకు కావాల్సింది ఇచ్చి పని పూర్తి చేస్తున్నారు. కొండాపూర్ ఆర్టీఏ పరిధిలో ఓ పాఠశాలకు సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీలో భారీగా డబ్బులు చేతులు మారాయనే ప్రచారం జరుగుతోంది. టోలిచౌకి, బండ్లగూడలో వాహనానికి ఇంత అని.. రేటు ఫిక్స్ చేసి మరీ వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. మలక్‌పేట, నాగోల్ ఆర్టీఏ పరిధిలో జారీ అవుతోన్న సర్టిఫికెట్ల పైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్కాజిగిరి జిల్లా పరిధిలో 4,443 వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చిన అధికారులు ఒక్కటీ తిరస్కరించకపోవడం గమనార్హం. హైదరాబాద్‌లో ఏడు, రంగారెడ్డిలో ఓ బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తిరస్కరించారు.

అర్హత.. అనుభవం పట్టించుకోకుండా..

అనుభవం లేని డ్రైవర్లు, బస్సుల్లో ఉండే సహాయకులకు సరైన అవగాహన లేకపోవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో గతంలో ప్రమాదాలు జరిగాయి. ఐదేళ్ల అనుభవంతో కూడిన భారీ వాహనాల లైసెన్స్ ఉండాల్సి ఉండగా.. కొన్ని పాఠశాలల యజమాన్యాలు అదేం పట్టించుకోకుండా తక్కువ వేతనానికి పనిచేసే వారిని నియమిస్తున్నాయి. విద్యార్థులు ఎక్కే, దిగేటప్పుడు నిలిపిన వాహనం ముందుకు కదిలే సమయంలో జాగ్రత్తగా పరిశీలించాల్సిన సహాయకులకు సరైన అనుభవం లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. విద్యా సంవత్సరం ఆరంభంలో కొన్నాళ్లు హడావిడి చేసి అధికారులు మిన్నకుంటున్నారు. ఈ సారైనా పూర్తిస్థాయిలో తనిఖీలు చేస్తారా..? అన్నది చూడాలి.

నిబంధనలివి...

- విద్యాసంస్థల వాహనాలు పసుపు రంగులో ఉండాలి. వెనుక, ముందు స్కూల్ బస్ అని రాయాలి.
- పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోన్ నెంబర్ రాయాలి.
- ఆన్ స్కూల్/కాలేజ్ డ్యూటీ అన్న ఇండికేషన్ కూడా ఉండాలి.
- విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేందుకు వీలుగా సీట్ల మధ్య గ్యాప్ ఉండాలి.
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, స్పీడ్ గవర్నర్ ఉండాలి.
- అతి వేగం, డ్రంకన్ డ్రైవ్‌లో ఒక్కసారి చలాన పడినా.. బస్ డ్రైవర్‌గా నియమించకూడదు.
- అర్హత ఉన్న వారిని బస్సులో సహాయకులుగా నియమించాలి.
- భారీ వాహనాలకు సంబంధించి ఐదేళ్ల అనుభవంతో డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.

గత ఘటనలు..

- హయత్‌నగర్‌లో మూడేళ్ల బాలుడిపై నుంచి స్కూల్ బస్సు వెళ్లడంతో దుర్మరణం చెందాడు.
- జవహర్‌నగర్‌లో రెండున్నరేళ్ల బాబు బస్సు చక్రాల కింద నలిగిపోయాడు.
- హబ్సిగూడలో తండ్రితో పాటు అన్నను స్కూల్ బస్సు ఎక్కించేందుకు వచ్చిన 19 నెలల బాలుడు.. ఆ వాహనం టైర్ల కింద పడి చనిపోయాడు. బాబు వచ్చిన విషయాన్ని డ్రైవర్ గమనించక పోవడం వల్లే దుర్ఘటన జరిగింది.

జిల్లా	విద్యా సంస్థల బస్సులు	ఫిట్‌నెస్ ఉన్నవి	లేనివి	తిరస్కరించినవి
హైదరాబాద్	1290	943	347	7
మల్కాజిగిరి	5609	4443	1166	0
రంగారెడ్డి	5732	4372	1360	1
మొత్తం	12631	9578	2873	8

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీ తప్పనిసరి

- జాయింట్ సీపీ జోయల్ డేవిస్

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్కూళ్లు పునఃప్రారంభం అవుతున్న తరుణంలో సైబరాబాద్ పరిధిలో ఉన్న స్కూల్ బస్సులను తనిఖీ చేయాలని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఆదేశాలు జారీ చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, తనిఖీలు, బస్సులో రక్షణ చర్యలను పరిశీలించాలన్నారు. స్కూల్ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, జీపీఎస్ ట్రాకింగ్, సీట్ బెల్ట్‌లు తదితర సదుపాయాలను పరిశీలించాలన్నారు. స్కూల్ బస్సుల నిర్వాహకులు అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. స్కూల్ నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిపి స్కూల్ బస్సుల నిర్వహణపై సమావేశం నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ గురించిన అవగాహన కార్యక్రమాలు శిక్షణ అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్ డీవీ శ్రీనివాసరావు, అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బేగంపేటలో ఉన్న ప్రభుత్వ మంజీర అతిథి గృహం గోడల్లోనుంచి చెట్లు పెరుగుతున్నా పట్టించుకునే వారెవరూ లేరంటూ 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 9న ప్రచురితమైన ఫొటో కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం మంజీర అతిథి గృహం గోడల్లోనుంచి పెరిగిన చెట్లను తొలగించారు. - ఫొటో, ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఉప్పల్ భగాయత్‌లో.. సీవరేజ్ లైన్లకు మహర్దశ

- పునరుద్ధరణకు వాటర్‌బోర్డు టెండర్లు
- తాగునీటి వ్యవస్థ మెరుగుకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ భగాయత్‌లో సీవరేజ్ లైన్ల మహర్దశకు వాటర్‌బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉప్పల్ భగాయత్‌లో మురుగు నీటి నిర్వహణ అధ్వానంగా మారి వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్న పరిస్థితులపై, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర ప్రభుత్వ విభాగాలు పట్టించుకోకపోవడంపై 'బాప్‌రే భగాయత్' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి వాటర్‌బోర్డు స్పందించింది. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో మురుగునీటి నిర్వహణను పూర్తిగా పునరుద్ధరణ చేసేందుకు వాటర్‌బోర్డు టెండర్లను ఆహ్వానించింది. దాదాపు రూ.4కోట్లతో పనులు చేపట్టేందుకు నిర్ణయించింది. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో గల 600, 450, 300, 250, 200ఎంఎం డయా సీవరేజ్ లైన్లు దెబ్బతింటే వాటిని పునరుద్ధరించాలని, ఎక్కడైనా సిల్ట్ పేరుకపోతే పూర్తిగా తొలగించాలని టెండర్ ప్రక్రియలో ఆదేశాలిచ్చారు. అదేవిధంగా ఉప్పల్ భగాయత్‌లోనే తాగునీటి వ్యవస్థను రూ.3.92కోట్లతో మెరుగుపరిచేందుకు నిర్ణయించారు. 2వేల కిలో లీటర్ల ట్యాంకు నిర్మాణంతో పాటు 200/150 ఎంఎం డయా పైపులైన్లు, వాల్వులు, ఛాంబర్లను ఏర్పాటు చేయనున్నారు.


పట్టాలు పొందిన విద్యార్థులతో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల కృషి భేష్

హైదరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సుస్థిర పర్యావరణ నిర్వహణ - పరిరక్షణకు ప్రధానమైన అటవీ రంగానికి విద్యార్థులు చేస్తున్న కృషి సహకారం అద్భుతమని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులోని తెలంగాణ ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) ఆడిటోరియంలో జరిగిన సంస్థ మూడో స్నాతకోత్సవంలో రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందజేయడంతో పాటు అగ్రభాగాన నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలను గవర్నర్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ గీతాలక్ష్మి, ఎఫ్‌సీఆర్ఐ డీన్ ఎజె.ఆశ,తదితర అధికారులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న కేటీఆర్, జగదీష్‌రెడ్డి, పద్మారావుగౌడ్

ముగిసిన శంకర్‌యాదవ్ అంత్యక్రియలు

- అంతిమయాత్రలో పాల్గొన్న కేటీఆర్

రెజిమెంటల్‌బజార్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు తలసాని శంకర్‌యాదవ్ అంత్యక్రియలు బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో నిర్వహించారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని రాధిక కాలనీ నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర మోండామార్కెట్ మీదుగా బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికకు చేరుకుంది. అంతిమయాత్రలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు పద్మారావుగౌడ్, జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్య, కార్పొరేషన్ల మాజీ ఛైర్మన్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతిమయాత్రకు ముందు రాధికా కాలనీలో శంకర్‌యాదవ్ పార్థివ దేహానికి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, వివేక్, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మంతరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నివాళులు అర్పించారు. శంకర్‌యాదవ్ చితికి ఆయన తనయుడు శివ నిప్పంటించారు.

బడికి వేళాయె..!

(3వ పేజీ తరువాయి)

కొరతతోపాటు తెలుగు, ఇంగ్లీష్‌ను సైతం బోధించే వారు కరువవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సదుపాయాల కొరత

పలు పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా మూడు జిల్లాల్లో ఏడాదిన్నర క్రితం చేపట్టిన పనుల్లో 45 శాతమే పూర్తయ్యాయి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కొంతమంది కాంట్రాక్టర్లు పనులను మధ్యలో వదిలేశారు.

55 శాతమే అమ్మ ఆదర్శ పనులు పూర్తి..

హైదరాబాద్ జిల్లాలోని 16 మండలాల పరిధిలో 691 పాఠశాలలున్నాయి. ఇందులో 562 స్కూళ్లను అమ్మ ఆదర్శ కార్యక్రమం కింద ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.30.63 కోట్లు మంజూరు చేసింది. మేలో ప్రారంభించిన పనులను జూన్ 12 వరకు పూర్తి చేయాలని టార్గెట్ విధించినప్పటికీ ఇప్పటి వరకు 55 శాతమే పూర్తయ్యాయి. గోల్నాకలోని తులసీరాంనగర్ హైస్కూల్‌లో టాయిలెట్ల నిర్మాణం ఇంకా సాగుతోంది. ఇక్కడ పనులు పూర్తికావాలంటే మరో పది రోజుల సమయం పట్టనుంది. కాగా, ఎంపిక చేసిన స్కూళ్లలో ఎలక్ట్రికల్ పనులు మాత్రమే వందశాతం పూర్తికాగా.. మరుగుదొడ్ల మరమ్మతు, నీటి కుళాయిల ఏర్పాటు, కొత్త టాయిలెట్ల నిర్మాణం, గ్రిల్స్, పెయింటింగ్ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో హెచ్ఎంలు నిమగ్నమవడంతో పనుల్లో జాప్యం జరిగిందని, ఈ నెల 30లోపు వందశాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీని దాదాపుగా పూర్తిచేశారు. హైదరాబాద్ జిల్లాలో ఈ ఏడాది 11,02,102 లక్షల పుస్తకాలకు ఇండెంట్ పెట్టగా.. ఇందులో ఇప్పటి వరకు 10,75,799 పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేశామని, యూనిఫాం కుట్టు పనులు 80 శాతం పూర్తయ్యాయని, బుధవారం నుంచి విద్యార్థులకు పంపిణీ చేస్తామని చెప్పారు. కాగా, రంగారెడ్డి జిల్లాలో 13,44,080 పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ పెట్టగా.. 74.43శాతం పుస్తకాలను స్కూళ్లకు సరఫరా చేశారు.

కూటమి నేతగా బాబు

- ఎన్నుకున్న మూడు పార్టీల ఎమ్మెల్యేలు
- పవన్ ప్రతిపాదన.. పురందేశ్వరి సమర్థన

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు తమ నేత చంద్రబాబును ఆహ్వానించాలని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ హాలులో ఈ కూటమి ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి శాసనసభాపక్ష నేతగా పవన్ కల్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబు పేరును ప్రతిపాదించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మద్దతు ప్రకటించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్, పురందేశ్వరి రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్‌ను కలిసి చంద్రబాబును కూటమి నేతగా ఎన్నుకున్నట్లు తెలియజేస్తూ.. మూడు పార్టీల ఎమ్మెల్యేలు సంతకాలు చేసిన లేఖలను ఆయనకు అందజేశారు. దీంతో గవర్నర్.. చంద్రబాబును ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. అంతకుముందు చంద్రబాబును ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ 'ఏ' కన్వెన్షన్‌లోనే జరిగిన ఈ భేటీలో అచ్చెన్నాయుడు ఆయన పేరును ప్రతిపాదించగా.. టీడీపీ ఎమ్మెల్యేలంతా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఏపీ ఏర్పడిన తర్వాత తొలిసారి అద్భుత విజయం సాధించామని, దీనికి చంద్రబాబు, మోదీ, పవన్ కల్యాణ్, పురందేశ్వరి కారకులంటూ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం చంద్రబాబు టీడీఎల్పీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.



గవర్నర్‌ను సత్కరించి, తిరుమల వెంకన్న ప్రతిమను అందజేస్తున్న చంద్రబాబు

మీ విజయం ఊహించా!

కూటమి నేతలతో గవర్నర్ నజీర్

'టీడీపీ కూటమి విజయం ఊహించిందే. కానీ ఇంత అనూహ్యమైన ఫలితం వస్తుందని ఊహించలేదు' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ కూటమి నేతలతో వ్యాఖ్యానించారు. గతంలో పోలింగ్ సందర్భంగా జరిగిన హింసపై ఫిర్యాదు చేసేందుకు టీడీపీ నేతలు తన వద్దకు వచ్చినప్పుడు..'మీరే అధికారంలోకి వస్తున్నారుగా..!' అని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనంతరం చంద్రబాబు ప్రమాణ స్వీకార తేదీ, సమయాలను వారు ఆయనకు తెలియజేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానిస్తూ గవర్నర్ లేఖ రాశారు. ఆయన పిలుపు మేరకు చంద్రబాబు రాజ్‌భవన్‌కు వెళ్లారు. మంత్రివర్గం కూర్పుపై ఆయనతో చర్చించారు.

రాష్ట్రానికి చంద్రబాబు అవసరం

- జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్



అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): "మంచి రోజులు వస్తాయని చెప్పాను! వచ్చాయి" అని జనసేనాని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. దార్శనికుడు, అనుభవజ్ఞుడైన చంద్రబాబు అద్భుతమైన పాలన అందిస్తారని అన్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి శాసనసభ్యుల సమావేశంలో పవన్ ప్రసంగించారు. 'ఈ మాట చంద్రబాబు పక్కన నిలుచుని చెప్పాలి' అని పవన్ అనడంతో.. చంద్రబాబు లేచి ఆయన వద్దకువెళ్లారు. పవన్, చంద్రబాబు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. చేతులు కలిపి ఆత్మీయత పంచుకున్నారు. "చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు చూశాను. ఆయన నలిగిపోయి ఉన్నారు. పాపం భువనేశ్వరి బాధను చూశాను. కన్నీళ్లు పెట్టొద్దని, మంచి రోజులు వస్తాయని ఆమెకు చెప్పాను. ఇప్పుడు మంచి రోజులొచ్చాయి. వారికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు. "నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపార అవగాహన, పెట్టుబడులు తెచ్చే సమర్థత.. ప్రతిభ, విదేశాల్లో ఉండే నాయకులను, అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించగల చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. ఆయన ధైర్యశాలి. క్లైమోర్‌మైన్ పేలితే చొక్కా దులుపుకొని లేచి నిల్చున్న వ్యక్తి. ఈ రోజున సైబరాబాద్ ఉందంటే ఆయన దార్శనికత వల్లే. ఆంధ్రప్రదేశ్‌కు కూటమి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబును జనసేన తరఫున బలపరుస్తున్నాం" అని అన్నారు. అంతకుముందు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జనసేన శాసనసభా పక్ష సమావేశం జరిగింది. తమ పక్ష నేతగా పవన్ పేరును పీఏసీ చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా దీనిని ఆమోదించారు. అక్కడ, ఆ తర్వాత విజయవాడలో జరిగిన కూటమి శాసనసభ్యుల సమావేశంలో పవన్ ప్రసంగించారు.

ఏపీ సీఎంగా నేడే బాబు ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధులు, తెలుగు తమ్ముళ్లు, అభిమాన సందోహం నడుమ అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కాగా, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన రాజ్యాంగ ప్రక్రియను మంగళవారం పూర్తి చేశారు. మంగళవారం ఉదయం విజయవాడలోని ఏ-కన్వెన్షన్ సమావేశ మందిరంలో కూటమిలోని మూడు పార్టీల ఎమ్మెల్యేల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొదట టీడీపీ శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు నాయుడును ఎన్నుకొన్నారు. ఆ తర్వాత కూటమి తరఫున శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్వయంగా ప్రతిపాదించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బలపర్చారు. సమావేశానికి హాజరైన మూడు పార్టీల ఎమ్మెల్యేలు హర్షధ్వానాలతో ఈ నిర్ణయాన్ని ఆమోదించారు.

గవర్నర్ నుంచి ఆహ్వానం...

ఈ భేటీ అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. సభా నేతగా చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నట్లు మూడు పార్టీల తరఫున విడివిడిగా లేఖలు సమర్పించారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రభుత్వ ఏర్పాటుకు చంద్రబాబును ఆహ్వానిస్తూ గవర్నర్ ఒక లేఖ పంపారు. సాయంత్రం చంద్రబాబు రాజ్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

నేతల రాక...

చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా మంగళవారం రాత్రి విజయవాడకు చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి వారు నేరుగా అమరావతిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ఆయనతో కలిసి రాత్రి భోజనం తర్వాత నోవాటెల్ హోటల్‌కు చేరుకొని రాత్రి బస చేశారు. మంగళవారం సాయంత్రం కొంత విరామం తీసుకొని చంద్రబాబు తన మంత్రివర్గ కూర్పుపై కసరత్తు చేశారు.



కేసరపల్లిలో ప్రమాణ స్వీకార వేదికకు పూర్తయిన ఏర్పాట్లు

నేడు ప్రధాని రాక

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం ప్రధాని మోదీ బుధవారం విజయవాడ రానున్నారు. ప్రమాణ స్వీకార ముహూర్తానికి కొంత ముందు ఆయన రానున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం తర్వాత ఆయన భువనేశ్వర్ వెళ్లి ఒడిసా నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారని సమాచారం. కాగా, చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రసంగాలు ఏవీ ఉండవని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రధాని ప్రసంగం కూడా ఉండబోదని అంటున్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత అదే ప్రాంగణంలో కొత్త మంత్రులతో అల్పాహార విందు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి ప్రధానిని కూడా ఆహ్వానించారు.

రేపే 'తొలి సంతకాలు'

ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు గురువారం తొలి సంతకాలు చేయనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సంబంధించిన ఫైళ్లపై ప్రమాణ స్వీకార వేదికపైనే సంతకం చేయాలని తొలుత భావించారు. కానీ, కొన్ని కారణాల వల్ల ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రమాణ స్వీకారానికి మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించారు. బుధవారం ఉదయం సీఎంగా ప్రమాణం చేసిన అనంతరం ఆయన తిరుమల వెళతారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని, 10.45 గంటలకు అమరావతి సచివాలయానికి చేరుకుంటారు. సచివాలయ ఉద్యోగుల స్వాగత కార్యక్రమం పూర్తి కాగానే ఒకటో బ్లాకులోని సీఎం కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ.. 'డీఎస్సీ నోటిఫికేషన్'పైనే తొలి సంతకం పెడతానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. ఫైలుపై సంతకం చేస్తారు. ఆ తర్వాత.. సామాజిక పింఛను రూ.4వేలకు పెంపు, నైపుణ్యాభివృద్ధి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతోపాటు మరో ఫైలుపై ఆయన సంతకం చేసే అవకాశముంది.

ఏపీ రాజధాని అమరావతే

ఆర్థిక రాజధానిగా విశాఖ..కర్నూలును అభివృద్ధి చేస్తాం.. నేటి నుంచే ప్రజాపాలన

- ప్రతి అడుగు ప్రజల కోసమే
- కూల్చివేతలు, నరికివేతలు ఉండవు
- తెలుగు జాతిని నంబర్ వన్ చేద్దాం!
- 3 రాజధానుల ఆటలుండవ్
- పవన్ కల్యాణ్ స్ఫూర్తి భేష్
- టీడీపీ అధినేత చంద్రబాబు

అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): 'మూడు రాజధానులంటూ రాష్ట్ర భవిష్యత్‌తో ఆటలాడుకోవడం ఉండదు. అమరావతే మన రాజధాని, విశాఖను ఆర్థిక రాజధానిగా, ప్రత్యేకమైన సిటీగా తయారుచేసుకుందాం. కర్నూలును అభివృద్ధి చేస్తాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటించారు. మంగళవారం విజయవాడలో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు తనను కూటమి శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్న తర్వాత ఆయన వారినుద్దేశించి ప్రసంగించారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో బుధవారం నుంచే ప్రజా పరిపాలన సాగుతుందన్నారు. ప్రతి అడుగు ప్రజల కోసమేనన్నారు. తెలుగు జాతిని నంబర్ వన్ చేయాలని చెప్పారు. ఇక కూల్చివేతలు నరికివేతలు ఉండవని, సీఎం వస్తే చెట్ల కొట్టివేత, షాపుల బంద్, పరదాలు కట్టడం ఉండదన్నారు. తన కుటుంబానికి జరిగిన అవమానంతో శాసనసభను కౌరవ సభ చేశారని, ఈ సభను గౌరవ సభ చేశాకే అడుగు పెడతానని శపథం చేశాను. ఆ శపథాన్ని ప్రజలు గౌరవించారన్నారు. దాన్ని నిలబెట్టుకోవాలన్నారు. తాను చాలా ఎన్నికలు చూశానని.. ప్రజలు ఈసారి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని తీర్పు ఇచ్చారని.. ఈ తీర్పును నిలబెట్టుకునే బాధ్యత మనపై ఉందని తెలిపారు. అరాచక, విధ్వంసకర పాలనకు వ్యతిరేకంగా ఈ మూడు పార్టీల కలయిక అద్భుతం. ఏ అహంకారంతో విర్రవీగిపోయారో ఆ అహంకారం కూలిపోయిందని వైసీపీ నేతలనుద్దేశించి అన్నారు. ఇంకా ఏమన్నారంటే.. 1994లో ఏకపక్షంగా ఎన్నికలు జరిగాయి. కానీ ఇప్పుడు 175 సీట్లలో 164 చోట్ల గెలిచి 93 శాతం సీట్లు సాధించాం. దేశ చరిత్రలోనే ఇది అరుదైన అనుభవం. 50 శాతం ఓట్లు అంటేనే ఎక్కువ.. అలాంటిది 57 శాతం వేశారంటే మనపై జనం ఎన్ని ఆశలు పెట్టుకున్నారో అర్థమవుతోంది. చరిత్రలో ఎప్పుడూ గెలవని విధంగా కడప జిల్లాలో 7 సీట్లలో ఐదు సీట్లు గెలిచాం. బీజేపీ పది సీట్లు తీసుకుంటే 8 గెలిచింది. జనసేన 21కి 21 సీట్లూ గెలిచింది. ఇదో చరిత్ర.



ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు

వ్యతిరేక ఓటు చీలకూడదన్న పవన్..

పవన్ కల్యాణ్ స్ఫూర్తిని మరచిపోలేను. నేను జైలులో ఉన్నప్పుడు పరామర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని చెబుతూ వచ్చిన పవన్.. ఆ రోజు జైలు నుంచి బయటకు వచ్చి టీడీపీతో జనసేన పొత్తు ఉంటుందని మొట్టమొదటసారిగా చెప్పారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఇద్దరం బీజేపీతో పొత్తు పెట్టుకున్నాం. ఆ రోజు నుంచి ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా పనిచేశాం. ఎందుకు పొత్తు పెట్టుకున్నామో ధర్మవరం నియోజకవర్గ సభలో అమిత్‌షా స్పష్టత ఇవ్వడంతో రాష్ట్ర ప్రజలకు ఈ కూటమిపై నమ్మకం ఏర్పడిందన్నారు.

చట్టపరంగా శిక్షించాలి..

పదవి వస్తే వినయం అవసరం. రేపు అనేది లేకుండా వ్యవహరిస్తే ఇదే జరుగుతుంది. ఇదంతా ఒక కేసు స్టడీగా తీసుకోవాలి. గత ఐదేళ్ల పరిపాలన చేసిన వ్యక్తిని చూసిన తర్వాత ఇలాంటి వ్యక్తి పాలనకు పనికిరాడని తీర్పు ఇచ్చారు. మనం కూడా కక్ష తీర్చుకోవాలనుకుంటే సమస్యలొస్తాయి. అలాగని తప్పుచేసిన వాడిని క్షమిస్తే కూడా అలవాటుగా మారుతుంది. తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాల్సిన అవసరముంది.

అప్పులపై అధ్యయనం చేయాలి..

రాష్ట్రం పూర్తిగా శిథిలమైపోయింది. ప్రభుత్వంలో ఏముందో తెలియదు.. ఎంత అప్పు ఉందో, ఎక్కడెక్కడ తెచ్చారో తెలియదు.. ఏమేం తాకట్టు పెట్టారో అధ్యయనం చేయాలి. ఇరిగేషన్ రంగాన్ని నిర్వీర్యం చేశారు. పోలవరం ముఖ్యమైన ప్రాజెక్టు. దాన్ని పూర్తి చేసే కార్యక్రమం మన ముందు ఉంది. వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. ఐదేళ్లలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. పదేళ్ల తర్వాత మన రాజధాని ఏది అంటే చెప్పలేని దుస్థితిలో ఉన్నాం.

పెద్ద కుర్చీ వద్దన్న బాబు..

మూడు పార్టీల ఎమ్మెల్యేల సమావేశ వేదికపై పవన్ కల్యాణ్, అచ్చెన్నాయుడు, చంద్రబాబు, పురందేశ్వరి కోసం కుర్చీలు వేశారు. చంద్రబాబు కోసం ప్రత్యేకంగా పెద్ద కుర్చీ ఏర్పాటు చేశారు. చంద్రబాబు పెద్ద కుర్చీ చూసి తనకు అందరితో సమానంగా ఉన్న కుర్చీ వేయాలని, పెద్దది వద్దని సూచించారు. దీంతో సిబ్బంది కుర్చీని మార్చారు.

కూటమి విజయం దేశానికి స్ఫూర్తి

- ప్రజాహిత పాలనపై దృష్టిపెట్టాలి
- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి: పురందేశ్వరి



అమరావతి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మూడు పార్టీలూ కలిసి అనూహ్యమైన విజయం సాధించామని, ఇది దేశానికే స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కూటమి శాసనసభా పక్ష నేతగా చంద్రబాబుకు ఆమె మద్దతు పలికారు. అంతకుముందు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేల భేటీలో మాట్లాడారు. 'గడచిన ఐదేళ్ల కాలంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, విద్వేష, విధ్వంస పాలనను ఎదుర్కొన్నారు. అభివృద్ధి అనే పదానికి అర్థం లేకుండా పోయి.. నిజమైన సంక్షేమమనేది దూరమై.. విసిగి, వేసారిపోయిన ప్రజలు కూడా ఇంత ఘనమైన విజయాన్ని ఊహించలేదు. ప్రజావ్యతిరేక పాలన అంతమొందించాలని జగన్ అనే రాక్షసుడిని ఇంటికి పంపించాలనే భావనతో జనం ఓట్లేశారు. మనం గెలిచాం, అధికారంలోకి వచ్చామన్న భావన కన్నా ప్రజాహితమైన పాలన, సుపరిపాలన ఏ విధంగా ప్రజలకు అందించాలన్న విషయంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉంది. బీజేపీ ఆది నుంచీ సబ్‌కా వికాస్ అని.. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడు సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అని.. సమాజంలో పేదవాడికి అన్యాయం జరిగితే గళం విప్పి ప్రశ్నిస్తామని జనసేన ఆవిర్భావం నుంచీ ముందుకొచ్చిన నేపథ్యం. ఈ మూడు పార్టీల ఆవిర్భావం ఒకే దిశలో ఉన్నాయి. వీటికి అనుకూలంగా రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలి' అని కోరారు.

29 ఏళ్ల తర్వాత..

1995లో పురందేశ్వరి భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు అప్పట్లో టీడీఎల్పీ నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించగా.. 29 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆమె బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కూటమి శాసనసభపక్ష నేతగా చంద్రబాబుకు మద్దతు పలకడం విశేషం.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

- విజయవాడ వాసికి తొలి బహుమతి
- రెండో బహుమతి కర్నూలు పాఠకురాలికి
- మరో ఐదుగురికీ బహుమతులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'కూటమికి 164 సీట్లు వస్తాయి. వైసీపీ 11 స్థానాలతో సరిపెట్టుకుంటుంది' అని ఎన్నికల ఫలితాలను అత్యంత కచ్చితత్వంతో అంచనా వేసిన 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు బహుమతుల పంట పండింది. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పోటీలో విజేతలను మంగళవారం విజయవాడ 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంలో డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగింది. మొత్తం 13 మంది కచ్చితమైన అంచనా వేయగా... డ్రాలో తొలి బహుమతి విజయవాడకు చెందిన వీరపనేని మునలయ్యకు లభించింది. ఆయనకు రూ.లక్ష బహుమతి అందించడం జరుగుతుంది. మునలయ్య విజయవాడ ఆర్టీసీ బస్టాండులో పార్కింగ్ కాంట్రాక్టర్. 'డ్రా'లో రెండో బహుమతి రూ.50వేలు కర్నూలు నగరం కల్లూరుకు చెందిన ఎస్.మహేశ్వరికి దక్కింది. ఇక... ఎ.సాంబశివరావు (ఒంగోలు), ఏసీ బాలన్న (కడప), మామిడి వేదవర్ష (గాజువాక, విశాఖపట్నం), వజ్జా శిరీష (నందిగామ, శ్రీకాకుళం) పుల్లూరు మాధవ్ (మట్టపల్లె, చిత్తూరు)కు రూ.10వేల చొప్పున బహుమతి లభించింది. ఈ 'డ్రా' కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావుతోపాటు ఎడిటోరియల్, సర్క్యులేషన్, అడ్వర్టైజింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



విజేతల లక్కీ డ్రా తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావు. చిత్రంలో.. 'ఆంధ్రజ్యోతి' ఎడిటోరియల్, సర్క్యులేషన్, అడ్వర్టైజ్‌మెంట్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 12 జూన్ 2024
cinema@andhrajyothy.com

రాయన్ రాక ఖాయం



హీరో ఇమేజ్‌ను పక్కనపెట్టి ఎలాంటి పాత్రలో అయినా ఇట్టే ఇమిడిపోయే నటనా చాతుర్యం ధనుశ్ సొంతం. తమిళ చిత్రాలతో మొదలైన ఆయన నట ప్రస్థానం హాలీవుడ్ దాకా చేరింది. కోట్లాది మంది అభిమానుల ఆదరణ సొంతం చేసుకుంది. 'ఇంత సాధించాం ఇక చాల్లే' అనుకోకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఆయన త్వరలో తన 50వ చిత్రం 'రాయన్'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. ఈ సినిమాను ధనుశ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సన్‌పిక్చర్స్ నిర్మిస్తోంది. మేకర్స్ మంగళవారం రిలీజ్‌డేట్‌ను ప్రకటించారు. జూలై 26న 'రాయన్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ శక్తిమంతమైన లుక్‌లో కనిపించారు. కాళిదాస్ జయరామ్, ఎస్.జె సూర్య, సెల్వ రాఘవన్, అపర్ణ బాలమురళి, దుషార విజయన్ ప్రధాన తారాగణం. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాశ్. ఎడిటర్: ప్రసన్న జికె

రవితేజ 75వ సినిమా!



స్వయంకృషితో స్టార్ ఎదిగిన నటుడు రవితేజ. కామెడీ టైమింగ్‌లో, విలక్షణమైన డైలాగ్ డెలివరీతో ఆడియన్స్‌ను ఆకట్టుకొన్న ఆయన కొత్త చిత్రం మంగళవారం ప్రారంభమైంది. ఇది ఆయనకు 75వ సినిమా కావడం విశేషం. సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న శ్రీలీల క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించడం విశేషం. ఈ చిత్రంతో రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య' చిత్రానికి మాటల రచయితగా, 'సామజవరగమన' సినిమాకు స్క్రీన్‌ప్లే రచయితగా పని చేసి మంచి గుర్తింపు పొందిన భాను భోగవరపు ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న 109వ చిత్రానికి మాటలు రాస్తున్నారు. ఆ చిత్రం నిర్మాణంలో ఉండగానే ఆయనకు దర్శకుడిగా అవకాశం రావడం గమనార్హం. పలు విజయవంతమైన చిత్రాలను నిర్మిస్తున్న సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వినోదంతో కూడిన పూర్తి మాస్ పాత్రలో రవితేజను చూడాలని కోరుకుంటున్న ఆయన అభిమానులకు ఈ సినిమా ఫుల్ జోష్ ఇస్తుందని దర్శకనిర్మాతలు వెల్లడించారు. మంగళవారం నుంచే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: నందు సవిరిగాన, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్.



సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె వివాహం

సీనియర్ నటుడు అర్జున్ కుమార్తె ఐశ్వర్య వివాహం సోమవారం రాత్రి చెన్నైలో జరిగింది. అర్జున్ నిర్మించిన యోగాంజనేయస్వామి దేవాలయంలోనే ఈ పెళ్లి సంప్రదాయబద్ధంగా జరిగింది. తమిళ హాస్యనటుడు తంబి రామయ్య కుమారుడు ఉమాపతి పెళ్లి కొడుకు. కొన్ని తమిళ చిత్రాల్లో హీరోగా నటించారు. ఉమాపతి, ఐశ్వర్యల నిశ్చితార్థం గత ఏడాది అక్టోబర్‌లో జరిగింది. ఈ పెళ్లికి విశాల్, కార్తి, సముద్రఖని, కె.ఎస్.రవికుమార్, ఎస్.ఆర్.ప్రభు, విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ నెల 14న చెన్నైలో రిసెప్షన్ ఏర్పాటు చేస్తున్నారు.

విశాల్ హీరోగా నటించిన సినిమాతో ఐశ్వర్య హీరోయిన్‌గా పరిచయమైంది. కానీ ఆమె నటిగా సక్సెస్ కాలేకపోయింది.


ఆమెను తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయం చేసే ఉద్దేశంతో స్వీయ దర్శకత్వంలో అర్జున్ కొన్ని నెలల క్రితం ఓ సినిమాను హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభించారు. అయితే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లే లోపే అందులో హీరో విష్వక్‌సేన్ ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో సినిమా ఆగిపోయింది.

యేవమ్ అందరికీ మంచి బ్రేక్ ఇస్తుంది




చాందిని చౌదరి, వశిష్ఠ సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి నవదీప్, గోపరాజు నిర్మాతలు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ "నేను బాగా గౌరవం ఇచ్చే కోస్టార్స్‌లో చాందిని ఒకరు. పలువురు మహిళలు ఉన్న ఈ సినిమా టీమ్‌ను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. అందరికీ ఈ చిత్రం మంచి బ్రేక్‌నిస్తుంది" అని అన్నారు. డైరెక్టర్ సందీప్ రాజ్ మాట్లాడుతూ "ఇదొక డిఫరెంట్ థ్రిల్లర్. ఇంటర్వెల్, పతాక సన్నివేశాలు ఊహించని విధంగా ఉంటాయి" అని చెప్పారు. "మనసుపెట్టి, నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా" అని నిర్మాత నవదీప్ అన్నారు. చిత్ర దర్శకుడు ప్రకాశ్ దంతులూరి మాట్లాడుతూ "ఆసక్తికరంగా ఉండే వినోదాత్మక థ్రిల్లర్ 'యేవమ్'" అని చెప్పారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ "ఇందులో నాది పోలీస్ పాత్ర అనగానే యాక్షన్ ఓరియెంటెడ్‌గా ఉంటుందని అనుకున్నాను. అయితే యాక్షన్‌తో పాటు అన్ని షేడ్స్ నా పాత్రలో ఉన్నాయి" అని చెప్పారు.

రౌడీ రిలీజ్‌కు రెడీ



కేజీఎఫ్ ఫేమ్ యశ్ హీరోగా నటించిన ఓ కన్నడ చిత్రం 'రాజధాని రౌడీ' పేరుతో తెలుగులో విడుదలవుతోంది. షీనా కథానాయిక. కేవీ రాజు దర్శకుడు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలవుతోంది. సంతోష్ ఎంటర్టైన్‌మెంట్స్ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'మాదక ద్రవ్యాలు, మద్యపానం బారినపడిన నలుగురు యువకులు తమ జీవితాలను ఎలా నాశనం చేసుకున్నారు అనే పాయింట్ చుట్టూ కథ సాగుతుంది. వినోదానికి చక్కటి సందేశాన్ని జోడించి తెరకెక్కించాం' అని తెలిపారు. 'ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్ పోలీస్ ఆఫీసర్‌గా కీలకపాత్రలో నటించారు. ముమైత్‌ఖాన్ పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉంటుంది' అని దర్శకుడు అన్నారు.



మా అమ్మాయి పెళ్లి విషయం నాకు తెలియదు

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా పెళ్లిపై వస్తున్న వార్తలపై ఆమె తండ్రి శత్రుఘ్న సిన్హా స్పందించారు. "సోనాక్షి, జహీర్ ఇక్బాల్ పెళ్లి విషయం నాకు తెలియదు. ఆ విషయాన్ని అందరిలాగే పత్రికల్లో చదివే నేనూ తెలుసుకున్నా. ఒకవేళ ఈ పెళ్లి విషయం నాకు చెపితే.. నేనూ, నా భార్య పూనమ్ కలసి ఆ జంటను దీవించడానికి సిద్ధం. ఈ కాలం పిల్లలు తల్లితండ్రులకి చెప్పి నిర్ణయాలు తీసుకోవట్లేదు. అనుమతులు కోరకుండా.. అనుకున్నది చేయడానికి సమాచారం మాత్రమే ఇస్తున్నారు. నా కూతురు ఎటువంటి తప్పుడు నిర్ణయం తీసుకోదని నాకు తెలుసు. ఆమెకు ఏది తప్పో.. ఏది ఒప్పో తెలుసు. తాను పెళ్లి చేసుకోవాలన్న విషయమే నిజమైతే.. వారి నిర్ణయాన్ని స్వాగతిస్తా" అని చెప్పారు. కాగా, సోనాక్షి సిన్హా తన బాయ్‌ఫ్రెండ్ జహీర్ ఇక్బాల్‌ను ఈ నెల 23న పెళ్లాడుతున్నట్లు కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే.

ప్రియురాలి కోసం హత్య..



కన్నడ హీరో దర్శన్ అరెస్ట్

సినిమా క్లైమాక్స్‌లో నేరం చేసిన విలన్‌ను హీరో కటకటాల్లోకి నెట్టడం మనం అనేక సినిమాల్లో చూసిందే. అయితే ఈసారి మాత్రం సీన్ రివర్స్ అయింది. వెండితెరపై హీరోగా అభిమానుల ప్రశంసలు అందుకుంటున్న వ్యక్తి కాస్తా హత్యకేసులో ముద్దాయిగా ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. మన పొరుగునే ఉన్న కన్నడ చిత్ర పరిశ్రమలో జరిగిందీ ఘటన.

ప్రియురాలి కోసం ఓ వ్యక్తిని హత్య చేయించారన్న ఆరోపణలతో ప్రముఖ కన్నడ హీరో దర్శన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నటి పవిత్ర గౌడతో దర్శన్ సన్నిహితంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో పవిత్రకు అసభ్యకర సందేశాలు పంపిన రేణుకాస్వామి (33) దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్య కన్నడ ఇండస్ట్రీని కుదిపేసింది. దర్శన్ సూచనల మేరకే ఈ హత్య జరిగినట్టు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మైసూర్‌లో దర్శన్‌ను, ఆయన ప్రియురాలు పవిత్ర గౌడను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దీంతో ఇప్పటివరకు రేణుకాస్వామి హత్య కేసులో సంబంధం ఉన్న మొత్తం 13 మందిని అరెస్టు చేసినట్టు మంగళవారం ప్రకటించారు. రేణుకాస్వామి ఓ మెడికల్ షాపులో పనిచేసేవాడు. ఆయన ఇటీవల పవిత్రగౌడపై సోషల్ మీడియాలో అసభ్య సందేశాలు పోస్టు చేశారని ఆరోపణలున్నాయి. ఇదే విషయాన్ని ఆమె నటుడు దర్శన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చిత్రదుర్గలోని దర్శన్ అభిమాన సంఘం ముఖ్యుడు రాఘవేంద్రకు సమాచారం ఇచ్చి, రేణుకాస్వామిని బెంగళూరుకు రప్పించారు. కామాక్షిపాళ్యలోని దర్శన్ అనుచరుడికి చెందిన కారుషెడ్‌లో ఈ నెల 8న రేణుకాస్వామిపై దాడి చేసి చంపేశారు. అనంతరం ఆ మృతదేహాన్ని కారు షెడ్ సమీపంలోని ఓ మురుగు కాలువలో పడేశారు. దాడి సమయంలో దర్శన్ కూడా అక్కడే ఉన్నట్లు తెలిసింది. ఈ నెల 9న స్థానికులు మృతదేహాన్ని గుర్తించారు. అక్కడి అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ గార్డు కామాక్షిపాళ్య పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు తొలుత ఆత్మహత్యగా భావించారు. కానీ, శరీరంపై ఉన్న గాయాల ఆధారంగా హత్యగా అనుమానించి.. ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలతో మృతుడిని రేణుకాస్వామిగా గుర్తించారు. ఈ నేపథ్యంలో గిరినగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు కామాక్షిపాళ్య పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. ఆర్థిక లావాదేవీల కారణంగా హత్య చేశామని పోలీసులకు తెలిపారు. పోలీసులు సోమవారం తమదైన శైలిలో విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పవిత్రగౌడకు రేణుకా స్వామి అశ్లీల మెసేజ్‌లు పంపించాడని, నటుడు దర్శన్ సూచనల మేరకు అతనిపై దాడి చేశామని తెలిపారు. తదుపరి దర్యాప్తులో 11 మంది అనుమానితులను అరెస్టు చేశారు. వారు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ హత్యతో సంబంధం ఉన్న దర్శన్, పవిత్రలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పవిత్రగౌడ ఏ1 కాగా, దర్శన్ ఏ2గా ఉన్నారు. వారిని మంగళవారం సాయంత్రం 24వ ఏసీఎంఎం కోర్టు ముందు హాజరు పరిచారు. కాగా, అరెస్టు తర్వాత దర్శన్ మీడియాతో మాట్లాడుతూ.. తాను ఎటువంటి తప్పు చేయలేదని, రేణుకాస్వామిని హెచ్చరించి వెళ్లిపోయానని అన్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదన్నారు.

\- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

కథ కాదు... అలరించే అనుభవం



జగదీశ్ కేకే దర్శకత్వంలో శ్రీపాద క్రియేషన్స్ బేనర్‌పై రూపొందుతోన్న రెండో చిత్రానికి 'తుఫాను హెచ్చరిక' అనే టైటిల్ ఖరారైంది. డాక్టర్ శ్రీనివాస్ కిషన్, డాక్టర్ రజనీకాంత్, సన్నీ బన్సల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం మేకర్స్ టైటిల్‌ను ప్రకటించి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ కేకే మాట్లాడుతూ 'ఈ చిత్రం ఒక కథ కాదు.. అలరించే అనుభవం. హిల్ స్టేషన్‌లో జీవించే సాధారణ యువకుడి జీవితంలో తుఫాను లాంటి విధ్వంసం జరిగితే, ఆ పరిస్థితుల నుంచి అతను ఎలా బయటపడ్డాడు అనే అంశం చుట్టూ కథ నడుస్తుంది. వర్షంలో కీలక సన్నివేశాలను తెరకెక్కించడంలో మా సాంకేతిక నిపుణులు, నటీనటులు చక్కని సమన్వయంతో పనిచేసి, మంచి అవుట్‌పుట్ రాబట్టారు. ఏడాది కష్టం ఈ సినిమా. త్వరలో వెండితెరపై చూడబోతున్నారు' అన్నారు. ఈ ఉత్కంఠభరిత చిత్రంలో ప్రతి మలుపు ప్రేక్షకులను అలరిస్తుంది అని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి ఆర్ కే నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

క్లైమాక్స్ ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది



'సెహరి' సినిమాతో దర్శకుడిగా తొలి చిత్రంతోనే ప్రేక్షకుల దగ్గర మంచి మార్కులు కొట్టేశారు జ్ఞానసాగర్ ద్వారక. ఆయన దర్శకత్వం వహించిన రెండో సినిమా 'హరోం హర'. సుధీర్‌బాబు నటించిన ఈ చిత్రాన్ని సుమంత్.జి.నాయుడు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక మీడియాతో ముచ్చటించారు. "యాక్షన్ సినిమాలు చేయడమంటే నాకు చాలా ఇష్టం. 'హరోంహర' ఒక న్యూ ఏజ్ కమర్షియల్ సినిమా. 1990ల నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ చిత్రంలో చాలా మాస్ ఎలిమెంట్స్, ఎలివేషన్స్ ఉంటాయి. వాస్తవిక సంఘటనల ఆధారంగా ఈ కథను రాసుకున్నాను. ఇందులో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేసే కథానాయకుడు.. గన్ మేకింగ్ మొదలుపెట్టి పవర్‌ఫుల్ సుబ్రమణ్యంగా ఎలా మారాడన్నది సినిమా కథ. లవ్, యాక్షన్, ఎమోషన్, సెంటిమెంట్‌తో పాటు ఆధ్యాత్మిక అంశాలు కూడా ఉంటాయి. సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది. కుప్పం యాసలో ఆయన ఇరగదీశారు. సినిమాకు మ్యూజిక్, విజువల్స్ బాగా వచ్చాయి. ఈ సినిమా థియేటర్లలో చూస్తున్న ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తుంది. క్లైమాక్స్ అయితే ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని చెప్పారు.

షూటింగ్ ముగిసింది



అశోక్‌గల్లా కథానాయకుడిగా నటిస్తున్న రెండో చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. ఇందులో ఆయన మాస్ పాత్రలో కనిపించనున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రానికి అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. నల్లపనేని యామిని సమర్పణలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసినట్లు యూనిట్ మంగళవారం తెలిపింది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తామని చెప్పారు. ఈ చిత్రానికి సాయి మాధవ్ బుర్రా సంభాషణలు, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రసూల్ ఎల్లోర్, ప్రసాద్ మూరెళ్ల



సీతాకోక చిలుకై ఎగిరింది



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నేను కీర్తన'. రిషిత, మేఘన కథానాయికలు. సీ లక్ష్మీకుమారి నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం నుంచి 'సీతాకోక చిలుకై ఎగిరింది మనసే' అంటూ సాగే యుగళ గీతాన్ని నిర్మాత సాయి రాజేశ్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ 'ఫస్ట్‌కాపీ సిద్ధమైంది. పాటలు, ఫైట్స్ మా చిత్రానికి ప్రత్యేకాకర్షణ. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. సంధ్య, జీవా, జబర్దస్త్ అప్పారావు కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎల్ రాజా, సినిమాటోగ్రఫీ: కె. రమణ

ఒకే రోజు రెండు సినిమాలు



దిలీప్‌కుమార్ రాథోడ్, అరవింద అగర్వాల్, షణ్ను హీరోహీరోయిన్లుగా నటించే 'సన్నాఫ్ సునామీ', 'బాల తేజం' చిత్రాల షూటింగ్ మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. చిత్తజల్లు ప్రసాద్ దర్శకుడు. చిత్ర నిర్మాత కృష్ణప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మా బేనరులో ఒకే రోజు రెండు సినిమాలు ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఇవి కాకుండా మరో రెండు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమాలు నిర్మిస్తున్నాం' అని తెలిపారు. నాలుగు చిత్రాల్లో వరుసగా నటించే అవకాశం కల్పించిన నిర్మాతకు హీరో దిలీప్‌కుమార్ రాథోడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రానికి పాటలు: గడ్డ సీతారామ చౌదరి, సంగీతం: లక్ష్మణ్ సాయి, ఫొటోగ్రఫీ: నితీశ్, సహ నిర్మాత: చెన్నై బ్రహ్మ.

సీతా కల్యాణ వైభోగమే



సుమన్ తేజ్, గరీమ చౌహాన్ జంటగా నటించిన 'సీతా కల్యాణ వైభోగమే' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. సతీశ్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను 'బలగం' చిత్రనిర్మాత హర్షిత్‌రెడ్డి ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. దర్శకుడు సతీశ్ పరమవేద మాట్లాడుతూ 'హర్షిత్‌రెడ్డి కజిన్ సుమన్ తేజ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నాం. నిర్మాత యుగంధర్‌కు సినిమా అంటే ఎంతో ప్యాషన్. కుటుంబసమేతంగా చూసే విధంగా మా చిత్రం ఉంటుంది' అని చెప్పారు. సినిమాను ఆదరించాలని నిర్మాత యుగంధర్ కోరారు. అందరినీ అలరించే చిత్రమిదని సుమన్ తేజ్ చెప్పారు.

భారత ఆర్మీ కొత్త చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ, జూన్ 11: భారత ఆర్మీకి కొత్త చీఫ్ రానున్నారు. ప్రస్తుత సైన్యాధ్యక్షుడు లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ పాండే ఈ నెల 30న రిటైర్ కానున్న నేపథ్యంలో.. ఆయన స్థానంలో తదుపరి చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేదిని నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ప్రకటన చేసింది. ఉపేంద్ర ద్వివేది ప్రస్తుతం ఆర్మీ స్టాఫ్ వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్నారు. వాస్తవానికి మనోజ్ పాండే మే 31వ తేదీనే రిటైర్ కావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని నెల రోజులపాటు పొడిగించింది. దీంతో ఉపేంద్ర ద్వివేదికి సైన్యాధ్యక్షుడిగా అవకాశం ఇచ్చే యోచన లేనందునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్న ప్రచారం జరిగింది. కానీ, ఆయనకే అవకాశం కల్పిస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ తాజాగా నిర్ణయం తీసుకుంది.

24 నుంచి పార్లమెంట్ సమావేశాలు?

న్యూఢిల్లీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనికోసం ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఈ నెల 24 నుంచి జూలై 3వ తేదీ వరకు ప్రత్యేక సమావేశాలు జరుగుతాయని తెలిసింది. ఈ నెల 24, 25 తేదీల్లో ఎంపీల ప్రమాణస్వీకారం, 26న స్పీకర్ ఎన్నిక కార్యక్రమం ఉండే అవకాశం ఉందని సంబంధిత వర్గాల సమాచారం. అయితే ఈసారి స్పీకర్ పదవి ఎవరికి దక్కొచ్చనే చర్చ జోరుగా సాగుతోంది. బీజేపీకి చెందిన వారికే ఆ పదవి ఇస్తారా? లేక ఎన్డీయేలోని మరెవరికైనా అవకాశం కల్పిస్తారా? అనే చర్చ జరుగుతోంది.

రాజ్యసభలో పది స్థానాలు ఖాళీ

న్యూఢిల్లీ, జూన్ 11: రాజ్యసభలో కొత్తగా పది ఖాళీలు ఏర్పడ్డాయి. ఇటీవలి ఎలక్షన్‌లో పది మంది ఎగువసభ సభ్యులు లోక్‌సభకు ఎన్నిక కావడమే ఇందుకు కారణం. అస్సాం, బీహార్, మహారాష్ట్రల్లో రెండేసి ఖాళీలు, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర రాష్ట్రాల్లో ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఏర్పడ్డాయని రాజ్యసభ సెక్రటేరియట్ ప్రకటించింది. లోక్‌సభకు ఎన్నికయిన ప్రముఖుల్లో సర్బానంద్ సోనోవాల్ (అస్సాం), మీసా భారతి (బిహార్), దీపేందర్ సింగ్ హుడా (హరియాణా), జ్యోతిరాదిత్య సింధియా (మధ్యప్రదేశ్), పీయూష్ గోయల్ (మహారాష్ట్ర), కె.సి.వేణుగోపాల్ (రాజస్థాన్), బిప్లబ్ కుమార్ దేవ్ (త్రిపుర) ఉన్నారు.

ఇక 'మోదీ కా పరివార్'ను తీసేయండి: మోదీ

న్యూఢిల్లీ, జూన్ 11: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తానిచ్చిన 'మోదీ కా పరివార్' నినాదం లక్ష్యం నెరవేరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. తానిచ్చిన పిలుపు మేరకు సోషల్ మీడియా ఖాతా హ్యాండిల్స్ పేరు పక్కన 'మోదీ కా పరివార్' అనే మాటను చేర్చిన వారు ఇక దానిని తొలగించాలని కోరారు. మోదీకి ఓ కుటుంబమంటూ లేదని లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. ఇందుకు బదులుగా తనని అభిమానించే వారంతా తమ సోషల్ మీడియా హ్యాండిల్ పేరు పక్కన మోదీ కా పరివార్(మోదీ కుటుంబం) అనే మాటను చేర్చాలని మోదీ ఎన్నికల ముందు కోరారు.

క్యాబినెట్ కాదు..పరివార్ మండల్: రాహుల్

న్యూఢిల్లీ, రాయబరేలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రధానిగా కొలువుదీరిన నూతన మంత్రివర్గంలో పలువురు మంత్రులు రాజకీయ కుటుంబాలకు చెందినవారే ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్ర మంత్రివర్గాన్ని పరివార్ మండల్‌గా అభివర్ణిస్తూ ఆయన ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. తరతరాల పోరాటం, సేవ, త్యాగాల సంప్రదాయాన్ని బంధుప్రీతిగా అభివర్ణించేవారు తమ అధికారాన్ని మాత్రం 'సర్కారీ పరివార్'(ప్రభుత్వ కుటుంబానికి)కి పంచుతున్నారని విమర్శించారు. మాటలకు, చేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నరేంద్ర మోదీ అంటారని రాహుల్ ఎద్దేవా చేశారు. కాగా రాయబరేలిలో మంగళవారం నిర్వహించిన ఒక బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ... తన సోదరి ప్రియాంక వారాణసీ నుంచి పోటీ చేసి ఉంటే... మోదీ 2, 3 లక్షల ఓట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయేవారని అన్నారు. ఇదిలా ఉండగా, పార్లమెంటు ఎన్నికల్లో లడఖ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన మహ్మద్ హనీఫా కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. తాజా పరిణామంతో లోక్‌సభలో కాంగ్రెస్ బలం 102కు చేరుకోనుంది. కాంగ్రెస్ నుంచి 99 మంది ఎంపీలుగా ఎన్నికవగా సాంగ్లీ ఎంపీ విశాల్‌పాటిల్, పూర్ణియా ఎంపీ పప్పూ యాదవ్ ఇప్పటికే కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు.

కొత్త మంత్రుల్లో 28మందిపై క్రిమినల్ కేసులు

న్యూఢిల్లీ, జూన్ 11 : నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో కొత్తగా కొలువుదీరిన మంత్రివర్గంలోని 28 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీళ్లలో 19 మందిపై హత్యాయత్నం, విద్వేష ప్రసంగం, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. ఆయా ఎంపీలు తమ ఎన్నికల నామినేషన్లు దాఖలు సందర్భంగా సమర్పించిన అఫిడవిట్లను అధ్యయనం చేసిన అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) ఈ మేరకు ఓ నివేదిక ఇచ్చింది. ముఖ్యంగా పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖల సహాయ మంత్రి శంతనూ ఠాకూర్, విద్య, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్‌పై హత్యాయత్నం కేసులు ఉన్నాయి. అలాగే, శంతనూ ఠాకూర్, మజుందార్, బండి సంజయ్. సురేష్ గోపీ సహా ఐదుగురు సహాయ మంత్రులపై మహిళలపై నేరాలకు పాల్పడిన కేసులు ఉన్నాయి. ఇక, 71 మంది మంత్రుల్లో 70 మంది అనగా 99 శాతం మంది కోటీశ్వరులని, మంత్రుల సగటు ఆస్తి రూ.108 కోట్లని ఏడీఆర్ పేర్కొంది.

మాలవీయ హనీట్రాప్‌లో పడతారనే: శంతను

న్యూఢిల్లీ, జూన్ 11: బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ హనీట్రాప్‌లో పడొచ్చన్న భయంతోనే ఆయన స్త్రీ లోలత్వం గురించి హెచ్చరించాను తప్ప, ఆయన ప్రతిష్ఠను దిగజార్చడానికి కాదని పశ్చిమబెంగాల్‌కు చెందిన లాయర్ శంతను సిన్హా మంగళవారం వివరణ ఇచ్చారు. మాలవీయపై తాను ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టును వాడుకుంటూ కాంగ్రెస్ పార్టీ 'విద్వేష ప్రచారం' చేస్తోందన్నారు. ఈ మేరకు మంగళవారం శంతను ఫేస్‌బుక్‌లో మరో పోస్టు చేశారు. అయితే, మాలవీయ గురించి గతంలో తాను చేసిన పోస్టును డిలీట్ చేయబోనని ఆయన చెప్పారు. "నేను మాలవీయను లక్ష్యంగా చేసుకోలేదు. లైంగిక వేధింపుల ఆరోపణలు చేయలేదు. ఆయన హనీట్రాప్‌లో పడతారన్న భయంతోనే ఫేస్‌బుక్‌లో గతంలో ఆ పోస్టు పెట్టాను. నా పోస్టును దయచేసి తప్పుగా అర్థం చేసుకోవద్దు" అని శంతను బీజేపీ శ్రేణులను విజ్ఞప్తి చేశారు. మాలవీయ పశ్చిమ బెంగాల్‌కు వచ్చినప్పుడల్లా స్థానిక బీజేపీ నేతలు ఆయనకు అమ్మాయిలను సరఫరా చేసేవారని, మాలవీయ తన శృంగార కార్యకలాపాల కోసం బీజేపీ ఆఫీసులను కూడా వాడుకున్నారని శంతను సిన్హా ఇటీవల ఆరోపించారు.

భారత్‌తో ఒప్పందాలపై మాల్దీవుల దర్యాప్తు

న్యూఢిల్లీ, జూన్ 11 : భారత్ విషయంలో మాల్దీవుల తీరు మారడం లేదు. గత ప్రభుత్వం భారత్‌తో చేసుకున్న కొన్ని ఒప్పందాలపై మాల్దీవుల పార్లమెంట్ దర్యాప్తుకు ఆదేశించింది. ఆ దేశ అధ్యక్షుడు మహమ్మద్ మయిజ్జు భారత్ పర్యటనలో ఉండగానే ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. నేవీ బేస్‌ల అభివృద్ధికి సంబంధించి మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం సోలీహ్ ప్రభుత్వం భారత్‌తో చేసుకున్న మూడు ఒప్పందాలు మాల్దీవుల సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా ఉండడంతో దర్యాప్తు చేపట్టామని మాల్దీవుల పార్లమెంటరీ కమిటీ ప్రకటించింది. ఈ అంశంపై భారత ప్రభుత్వం ఇంకా స్పందించలేదు.

విమానం కూలి మలావీ ఉపాధ్యక్షుడి మృతి




బ్లాంటైర్, జూన్ 11 : ఆఫ్రికా దేశమైన మలావీలో జరిగిన విమాన ప్రమాదంలో ఆ దేశ ఉపాధ్యక్షుడు సౌలస్ చిలిమా సహా పది మంది మరణించారు. చిలిమా, మరో తొమ్మిది మంది ప్రయాణిస్తున్న ఓ సైనిక విమానం సోమవారం నుంచి కనిపించకుండా పోయింది. గల్లంతైన విమానం కోసం గాలించిన సిబ్బంది 24 గంటల తర్వాత దేశ ఉత్తర ప్రాంతంలోని కొండల్లో విమాన శకలాలను గుర్తించారు. చిలిమా ప్రయాణిస్తున్న విమానం ప్రతికూల వాతావరణం వల్ల కూలిపోయిందని, అందులో ఉన్న వారంతా మరణించారని మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా ప్రకటించారు.

నిజమైన సేవకుడు అహంకారంతో ఉండడు

నేనే చేశానని చెప్పుకోడు

- ప్రజా జీవితంలో మర్యాదలు పాటిస్తాడు
- రాజకీయాల్లో విపక్షాలే తప్ప విరోధి పక్షాలు ఉండవు: మోహన్ భాగవత్




నాగ్‌పూర్, జూన్ 11: కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తరుణంలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ చేసిన పలు హితవచనాలు రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రజాసేవలో నాయకులు వ్యవహరించాల్సిన తీరును, ఎన్నికల ప్రచారంలో పాటించాల్సిన హుందాతనాన్ని ఆయన గుర్తుచేశారు. అల్లర్లతో అతలాకుతలమవుతున్న మణిపూర్ సమస్యను తొలుత పరిష్కరించాలని ప్రభుత్వానికి దిశానిర్దేశం చేశారు. అహంకార రహితంగా ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఉద్బోధించారు. నిజమైన సేవకునికి అహంకారం ఉండదని, ప్రజాజీవితంలో గౌరవ మర్యాదలు పాటిస్తాడని అన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో సోమవారం ఆరెస్సెస్ ట్రైనీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇటీవలి ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మర్యాదలు పాటించలేదని చెబుతూ నిజమైన సేవకుని లక్షణాలను వివరించారు. ఎన్నికలంటే పోటీయే తప్ప యుద్ధం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. రాజకీయాల్లో 'ప్రతి పక్షమే' తప్ప 'విరోధి పక్షం' ఉండదని, అందుకు అనుగుణంగానే పార్టీల వ్యవహార శైలి ఉండాలని చెప్పారు. "ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు అత్యవసరం. రాజకీయ పార్టీల మధ్య పోటీ కూడా ఉంటుంది. పోటీ అంటే ఒకరు ముందుకు వెళ్లడం, మరొకర్ని వెనక్కి లాగడం. ఇదే చేయొద్దు. ప్రజలు ప్రతినిధులను ఎందుకు ఎన్నుకుంటారు? పార్లమెంటులో కూర్చొని ఏకాభిప్రాయం సాధించి దేశాన్ని నడిపిస్తారని..ఏకాభిప్రాయ సాధనే మన సంప్రదాయం. పార్లమెంటుకు వచ్చిన రెండు పక్షాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం కొంత కష్టమే. అందుకే మెజార్టీని పరిగణనలోకి తీసుకుంటారు. పార్టీల మధ్య పోటీ ఉంటుందే తప్ప పరస్పర యుద్ధం కాదు"ని అన్నారు. అందువల్ల ఇరు పక్షాల అభిప్రాయాలను తెలుసుకున్న తరువాత చర్చలు జరిపి అంగీకారానికి రావాల్సి ఉంటుందని చెప్పారు. ఇటీవలి ఎన్నికల ప్రచారంలో అదుపుతప్పి విమర్శలు చేసుకున్న వైనాన్ని మోహన్ భాగవత్ ప్రస్తావించారు. దీంట్లోకి ఆరెస్సెస్‌ను కూడా లాగారని విచారం వ్యక్తం చేశారు. "ఒకరిని మరొకరు విమర్శించుకున్న తీరు..ప్రచారంలో వ్యవహరించిన విధానం..సమాజంలో విభేదాలను పెంచుతాయి. సమాజాన్ని రెండు వర్గాలుగా చీల్చుతాయి. పరస్పరం అవిశ్వాసాన్ని కలిగిస్తాయి. ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంట్లోకి సంఘ్‌ను కూడా లాగారు. సాంకేతికతను దుర్వినియోగం చేసి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేశారు. మొత్తం అబద్ధాలనే చెప్పారు. గౌరవనీయ వ్యక్తులెవరూ ఇలాంటి సాంకేతికతను ఉపయోగించరు. ఎన్నికల్లో గౌరవ మర్యాదలు పాటించాలి. దేశ సమస్యలు ఇంకా తీరలేదు కాబట్టి మర్యాదలతో మెగలడం తప్పనిసరి" అని అన్నారు. ఎన్నికల వాతావరణం నుంచి బయటపడి దేశ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని భాగవత్ హితవు చెప్పారు. అత్యంత ప్రాధాన్యమున్న అంశంగా మణిపూర్ అల్లర్లను గుర్తించాలని సూచించారు. "ఏడాది కాలంగా మణిపూర్ శాంతి కోసం ఎదురు చూస్తోంది. గత పదేళ్లుగా ఆ రాష్ట్రంలో శాంతి నెలకొంది. కానీ ఆకస్మికంగా తుపాకీ సంస్కృతి మళ్లీ పెరిగింది. అది ఇంకా మంటల్లో కాలుతునే ఉంది. ఎవరు దీనిపై దృష్టి పెడుతారు? దీన్ని ప్రాధాన్యమైన సమస్యగా గుర్తించి చర్చించాలి. దీన్ని కర్తవ్యంగా భావించాలి" అని తెలిపారు. మోదీ ప్రభుత్వం చాలా రంగాల్లో విశేష ప్రగతి సాధించిందని ప్రశంసిస్తూనే దేశం ఇంకా సవాళ్ల నుంచి విముక్తి పొందలేదని వ్యాఖ్యానించారు.

సలహాలను మోదీ పాటించాలి: విపక్షాలు

భాగవత్ ప్రసంగంపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు స్పందించాయి. ఆయన సలహాలను పాటించాలని ప్రధాని మోదీకి సూచించాయి. ఇప్పటికైనా మణిపూర్ వెళ్లి పరిస్థితులను చక్కదిద్దాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ప్రధానిని ఉద్దేశించి అన్నారు. అసలు సలహాలు వినడం మోదీ డీఎన్‌ఏలోనే లేదని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల మాటలు వినకపోయినా, కనీసం ఆరెస్సెస్ చీఫ్ సూచనలైనా పట్టించుకోవాలని అన్నారు. ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్ మాట్లాడుతూ 'విస్పష్టంగా కనిపిస్తున్న అహంకారం గురించి భాగవత్ అనుభవపూర్వకంగా చెప్పినట్టుంద'ని వ్యాఖ్యానించారు. ఇంతజరుగుతున్నా మణిపూర్‌పై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని ఎన్సీపీ (పవార్) నాయకురాలు సుప్రియా సూలే విమర్శించారు.

అతివిశ్వాసమే బీజేపీని ముంచింది!

'ఆర్గనైజర్'లో సంఘ్ నేత రతన్ శారద ధ్వజం



న్యూఢిల్లీ, జూన్ 11: మూడోసారి భారీ మెజారిటీతో గెలిచి తీరతామన్న అతి విశ్వాసమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీసిందా? ఎన్నికల్లో సహకరించాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నేతలను, కార్యకర్తలను ఆ పార్టీ నాయకత్వం ఆహ్వానించలేదా..? సంఘ్ పరివార్‌తో దాని సంబంధాలు సజావుగా లేవా.. ఈ ప్రశ్నలకు.. సంఘ్ పత్రిక 'ఆర్గనైజర్'లో వచ్చిన ఓ వ్యాసం కాదనే జవాబిస్తోంది. సంఘ్ జీవిత కాల కార్యకర్త రతన్ శారద రాసిన ఈ వ్యాసంలో చాలా కటువుగా తన అభిప్రాయాలను తెలియజేశారు. అతివిశ్వాసానికి అసలు వాస్తవం ఎన్నికల ఫలితాల ద్వారా చెక్ పెట్టిందన్నారు. నేతలు క్షేత్ర స్థాయికి వెళ్లకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడానికే పరిమితమయ్యారని ఆక్షేపించారు. ఊహాలోకంలో విహరిస్తూ క్షేత్ర స్థాయి వాణిని వినిపించుకోలేదన్నారు. 'తామే అసలైన రాజకీయ నేతలమని.. సంఘ్ సోదరులు పల్లెటూరి బైతులన్న అహంకారం బీజేపీ నేతల తలకెక్కింది' అని విమర్శించారు. గత ఎన్నికల్లో 303 ఎంపీ స్థానాలు సొంతగా సాధించిన బీజేపీ.. ఈ దఫా 240 స్థానాలకే పరిమితమై.. సాధారణ మెజారిటీ (272)కి 32 స్థానాల దూరంలో నిలిచింది. దీంతో, 'ఈసారి 400 సీట్లు దాటాలి' అని ప్రధాని మోదీ పెట్టిన లక్ష్యం బీజేపీకేనన్న విషయం ఆ పార్టీ నేతలు గ్రహించలేదంటూ రతన్ మండిపడ్డారు. 'మోదీ ప్రజాకర్షక శక్తి చూసి ఆనందించారు. క్షేత్రస్థాయి సమస్యలను గాలికొదిలారు. అంకితభావం కలిగిన వృద్ధ కార్యకర్తలను.. ప్రస్తుత సోషల్ మీడియా 'సెల్ఫీ' కార్యకర్తలు అలక్ష్యం చేశారు. బీజేపీ ఎంపీలు, మంత్రులు జనాలకు అందుబాటులో లేరు' అని విమర్శించారు. బీజేపీ నేతలకు సంఘ్ అవసరం లేదా అని ప్రశ్నించారు. మోదీ మేజిక్‌కు కూడా పరిమితులున్నాయని స్పష్టం చేశారు. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాల్లో ప్రధాని మోదీయే పోరాడుతున్నారన్న ఆలోచననే ఆయన గట్టిగా ఆక్షేపించారు. స్వీయ ఓటమికి కారణమైన ఈ ఆలోచనతోనే అభ్యర్థులను మార్చారని.. స్థానిక నేతలను పక్కపెట్టి బలవంతంగా అభ్యర్థులను రుద్దారని.. ఫిరాయింపుదారులకు ప్రాధాన్యమిచ్చారని.. బాగా పనిచేస్తున్న పార్లమెంటేరియన్లను కాదని చివరి నిమిషంలో పార్టీలో చేరిన వారికి టికెట్లు ఇచ్చారని.. పరాజయానికి ఇవన్నీ కారణాలని రతన్ విశ్లేషించారు. 'బీజేపీ అభ్యర్థుల్లో 25 శాతం మంది వలసవచ్చినవారేనని అంచనా. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి 30 శాతం మంది రెబెల్స్ కారణమన్న షాకింగ్ అనుభవం చూశాక కూడా లోక్‌సభ ఎన్నికల్లో అదే పనిచేశారు. స్థానిక సమస్యలు, అభ్యర్థుల ట్రాక్‌రికార్డు ఎన్నికల్లో విజయానికి గీటురాళ్లు. స్థానిక బీజేపీ కార్యకర్తల నిరాసక్తత కూడా ఓటమికి కారణం' అని తెలిపారు.

అజిత్ పవార్‌ను చేర్చుకోవడం ఎందుకు?

మహారాష్ట్రలో అనవసర రాజకీయం కొంపముంచిందని రతన్ శారద అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పనితీరు దెబ్బతినడానికి ఇది కూడా కారణమన్నారు. 'మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ, షిండే శివసేనకు చాలినంత మెజారిటీ ఉన్నప్పటికీ అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీని చేర్చుకున్నారు. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలె, అజిత్ పవార్ మధ్య అంతర్గత విభేదాలతో ఎన్సీపీ 2-3 ఏళ్లలో అంతరించి పోయేది. ఇలాంటి అక్కరమాలిన చర్య ఎలా చేపట్టారు? ఏళ్ల తరబడి కాంగ్రెస్ సిద్ధాంతాలపై బీజేపీ కార్యకర్తలు పోరాడారు. ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ ఒక్క దెబ్బతో బీజేపీ తన బ్రాండ్ విలువను తగ్గించుకుంది. మహారాష్ట్రలో నంబర్ వన్ పార్టీగా ఎదిగేందుకు ఏళ్లతరబడి పోరాడింది. ఇప్పుడు ఎలాంటి ప్రత్యేకతా లేని మామూలు రాజకీయ పార్టీగా మారిపోయింది' అని ఆవేదన వ్యక్తంచేశారు. 'కాషాయ ఉగ్రవాదం' అన్న పేరుతో హిందువులను వేధించి.. ముంబై 26/11 దాడులను ఆర్ఎస్ఎస్ కుట్రగా అభివర్ణించి.. ఆర్ఎస్ఎస్‌పై ఉగ్రవాద సంస్థగా ముద్ర వేసి.. బీజేపీని హీనంగా చూసిన కాంగ్రెస్ నేతలను బీజేపీలో చేర్చుకోవడాన్ని రతన్ తీవ్రంగా విమర్శించారు. ఇది ఆర్ఎస్ఎస్ సానుభూతిపరులను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా ఆర్ఎస్ఎస్ పనిచేసిందా అన్న అంశంపైనా ఆయన ఘాటుగా స్పందించారు. 'ఒక్క విషయం స్పష్టం చేయదలచుకున్నాను. ఆర్ఎస్ఎస్ శ్రేణులు బీజేపీకి క్షేత్రస్థాయి బలగం కాదు. బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ. తనకంటూ సొంత కార్యకర్తలు ఉన్నారు' అని ఎద్దేవాచేశారు. "ఎన్నికల పనిలో సహకారం కోరడానికి తమ సైద్ధాంతిక మిత్రులను బీజేపీ కార్యకర్తలు, స్థానిక నేతలు కోరాలా.. వద్దా? నాకు తెలిసినంతవరకు వారు మా సాయం కోరలేదు" అని కటువుగా తన వ్యాసంలో పేర్కొన్నారు.

ఒడిసా సీఎంగా మోహన్ చరణ్ మాఝీ



- గిరిజన నేతకు అవకాశం కల్పించిన బీజేపీ
- భువనేశ్వర్‌లో నేడు ప్రమాణ స్వీకారం

భువనేశ్వర్, జూన్ 11: తొలిసారి ఒడిసాలో అధికారం దక్కించుకున్న బీజేపీ.. గిరిజన నేతకు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించింది. కియోంజర్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మోహన్ చరణ్ మాఝీ (52)ని సీఎంగా ఎంపిక చేసింది. ప్రవతీ పరిడా, కేవీ సింగ్‌దేవ్‌లకు ఉప ముఖ్యమంత్రులు పదవులు దక్కనున్నాయి. మంగళవారం భువనేశ్వర్‌లో ఒడిసా బీజేపీ శాసనసభా పక్ష సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, భూపేంద్ర యాదవ్ పరిశీలకులుగా హాజరయ్యారు. అనంతరం మాఝీని శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాజ్‌నాథ్ ప్రకటించారు. బుధవారం సాయంత్రం మాఝీ, పలువురు మంత్రులు ప్రమాణం చేయనున్నారు. ప్రభుత్వ ఏర్పాటు ఆహ్వాన తొలి పత్రికను ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలోని జగన్నాథస్వామికి సమర్పించి పూజలు చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేడీ అధినేత, మాజీ సీఎం నవీన్ పట్నాయక్‌ను ఆహ్వానించారు. కాగా, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ సీఎంలు సైతం దీనికి హాజరవనున్నారు. 147 సీట్లున్న ఒడిసాలో ఎన్నికల్లో బీజేపీ 78 గెలుచుకుని తొలిసారిగా అధికారం చేపట్టనుంది.

వాచ్‌మన్ కుమారుడు.. సర్పంచి.. జార్ఖండ్ ఎన్నికలు

మోహన్ చరణ్ 1997-2000 మధ్యన ఆదివాసీ ప్రాంతం రాయికల సర్పంచ్‌గా పనిచేశారు. ఈయన తండ్రి వాచ్‌మన్. కాగా, 2000 సంవత్సరంలో మాఝీ తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004, 2019లోనూ నెగ్గారు. ప్రజా సంబంధాలు, సంస్థాగతంగా బీజేపీ బలోపేతానికి కృషి చేశారు. మరోవైపు జార్ఖండ్‌లో మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఒడిసా పొరుగున ఉండే ఈ రాష్ట్రంలో గిరిజనులు 26 శాతం పైగా ఉంటారు. వారిని మచ్చిక చేసుకునే ఉద్దేశంలోనే మాఝీని ఒడిసా సీఎం చేసినట్లుగా విశ్లేషకులు చెబుతున్నారు.

గత ఏడాది చివర్లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో సీనియర్ నాయకులు, సీఎంలుగా పనిచేసిన శివరాజ్ చౌహాన్, రమణ్‌సింగ్, వసుంధరా రాజెలను పక్కనపెట్టి కొత్తవారికి అవకాశం ఇచ్చింది బీజేపీ. ఒడిసాలోనూ ఇదే తరహాలో ఆశ్చర్యకర ఎంపిక చేపట్టింది. కాగా, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్‌లను అరుణాచల్ ప్రదేశ్ సీఎం ఎంపికకు పరిశీలకులుగా బీజేపీ నియమించింది. వీరు బుధవారం ఇటానగర్ వెళ్లనున్నారు. ప్రస్తుత సీఎం పెమా ఖండూనే మళ్లీ ఎన్నుకునే వీలుంది.

నీట్ పవిత్రత దెబ్బతింది!



మీ సమాధానం చెప్పండి.. కేంద్రం, ఎన్టీయేకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)కు ఉన్న పవిత్రత దెబ్బతిన్నదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) స్పందనలు తెలియజేయాలంది. నీట్ యూజీ-2024లో ప్రశ్నపత్రం లీకేజీ, అవకతవకలు జరిగినందున ఆ పరీక్షను రద్దుచేయాలని కోరుతూ 10 మంది నీట్ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్లపై మంగళవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ అమనుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ విచారణ జరిపింది. పరీక్షలో అవకతవకలు జరిగాయని, వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని పిటిషనర్ల తరఫున న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పరీక్షను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని కోరారు. స్పందించిన ధర్మాసనం.. "పరీక్ష పవిత్రత దెబ్బతిన్నది. ఇప్పుడు మాకు సమాధానాలు కావాలి" అని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై సమాధానాలు ఇవ్వాలంటూ కేంద్రం, ఎన్టీఏకు నోటీసులు జారీ చేసింది. అలాగే బిహార్‌లో పరీక్ష నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నోటీసులు ఇచ్చింది. తక్షణమే సమాధానాలు ఇవ్వాలని కేంద్రం, ఎన్టీఏను ఆదేశించింది. ఇక ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల కౌన్సెలింగ్ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. ఈ ఏడాది మే 5న నీట్ యూజీ పరీక్ష జరిగింది. జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. ఒకే పరీక్ష కేంద్రంలో ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం.. పలు అనుమానాలకు దారితీసింది. మరోవైపు, నీట్-పీజీ 2022 జవాబు పత్రాలను బహిర్గతపర్చాలన్న పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఫెయిల్.. నీట్‌లో 705 మార్కులు!

నీట్‌పై సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులు వైరల్‌గా మారుతున్నాయి. ఆర్యన్ ప్రతీక్ అనే 'ఎక్స్' వినియోగదారుడు ఓ విద్యార్థిని ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఫెయిలవగా.. నీట్‌లో మాత్రం 720కి 705 మార్కులు సాధించిందంటూ పోస్ట్ చేశారు. నీట్ మార్కుల స్క్రీన్‌షాట్, ఇంటర్ మార్కుల పత్రం ఫొటోలు కూడా జత చేశారు. ఇదెలా సాధ్యం? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఇక మరో విద్యార్థిని జూన్ 4న వచ్చిన ఫలితాల్లో తన రిజల్ట్ కనిపించకపోవడంతో సర్వర్ సమస్యగా భావించానని.. ఎన్టీఏ మాత్రం ఓఎంఆర్ షీట్ పాడైపోవడం వల్ల ఫలితాలు ప్రకటించలేదని మెయిల్ పంపినట్లు ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. పాడైన ఓఎంఆర్ షీట్‌ను తనకు పంపాలని కోరగా అందులో అన్ని సమాధానాలూ స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడించింది.

ఇక బ్లాక్ కమాండోలు కనిపించరు!

న్యూఢిల్లీ, జూలై 11: వీఐపీలకు వ్యక్తిగత భద్రతను కల్పిస్తున్న ఎన్ఎస్‌జీ బ్లాక్ కమాండోలు, ఐటీబీపీ బలగాలను ఆ బాధ్యతల నుంచి మోదీ సర్కారు తప్పించనుంది. వాటి స్థానంలో సీఆర్పీఎఫ్‌కు ఈ బాధ్యతలను కేటాయించనుంది. తీవ్రవాద, ఉగ్రవాద ముప్పును ఎక్కువగా ఎదుర్కొంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు, తదితర ముఖ్యనేతలను బ్లాక్ క్యాట్ కమాండోలు కంటిరెప్పలా ఇప్పటిదాకా కాపాడుతూ వస్తున్నారు. ఇకపై వారి సేవలను ఇతర పారామిలిటరీ విధులకు వినియోగించుకోనున్నట్టు రక్షణ వర్గాలు తెలిపాయి. ప్రముఖుల వ్యక్తిగత భద్రతను సీఆర్పీఎఫ్ వీఐపీ సెక్యూరిటీ యూనిట్, సీఐఎస్ఎఫ్ వీఐపీ వింగ్ (ఎస్ఎస్‌జీ) ఇక ముందు చూస్తాయి. ఈ విభాగాలు ఇప్పటికే సోనియా కుటుంబానికి, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ తదితర 200 మందికి భద్రత అందిస్తున్నాయి.

రూ.300 నగ 6 కోట్లకు!

అమెరికన్ మహిళని మోసం చేసిన జైపూర్ వ్యాపారి..పోలీసుల విచారణ

జైపూర్, జూన్ 11 : రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ నగల వ్యాపారి అమెరికన్ మహిళకు రూ.300 నకిలీ నగను ఏకంగా రూ.6 కోట్లకు అమ్మి మోసం చేశాడు. ఆ మహిళ జైపూర్‌లోని జోరి బజార్‌లో కొన్ని నెలల క్రితం ఆ నగను కొన్నారు. నగల దుకాణం యజమాని రాజేంద్ర సోని, అతడి కుమారుడు గౌరవ్ దాని నాణ్యతను నిర్ధారిస్తూ ఓ నకిలీ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. ఆమె ఆ నగను అమెరికా తీసుకువెళ్లి అక్కడ ఓ ఎగ్జిబిషన్‌లో ఉంచబోగా అది నకిలీదని వెల్లడైంది. దీంతో ఆ మహిళ తిరిగి భారత్ కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆ నగల షాపు యజమానే ఆమెపై తప్పుడు కేసు పెట్టాడు. చివరికి అమెరికన్ ఎంబసీ జోక్యంతో జైపూర్ పోలీసులు ఈ ఉదంతంపై విచారణ చేపట్టారు. నిందితులు పరారీలో ఉన్నారు. నకిలీ సర్టిఫికెట్ ఇచ్చిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు జైపూర్‌లో రూ.3 కోట్ల ఫ్లాట్ కొన్నట్లు గుర్తించారు.

ఏడాదికి 2సార్లు అడ్మిషన్లు!

- ఉన్నత విద్యాసంస్థల్లో ఈ ఏడాది నుంచే అమలు

న్యూఢిల్లీ, జూన్ 11: ఉన్నత విద్యా సంస్థల్లో ఏడాదికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకునేందుకు యూజీసీ అనుమతించింది. రెగ్యులర్ విధానంలో కోర్సులు సాగించే యూనివర్సిటీలు, కాలేజీలకు ఈ మేరకు అవకాశం కల్పించింది. జనవరి లేదా ఫిబ్రవరి, జూలై లేదా ఆగస్టు నెలల్లో విద్యార్థుల అడ్మిషన్లకు యూజీసీ విధాన నిర్ణాయక మండలి ద్వైవార్షిక విధానాన్ని ప్రతిపాదించినట్టు కమిషన్ ఛైర్‌పర్సన్ జగదీశ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నిర్ణయం 2024-25 విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి వస్తుందన్నారు. మే 5న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం యూనివర్సిటీలు, కాలేజీలు ఏటా జూలై-ఆగస్టు మధ్య రెగ్యులర్ విధానంలో విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తున్నాయి. అయితే.. ఈ విధానం వల్ల లక్షల మంది విద్యార్థులు ఒక ఏడాది పాటు ఆయా సంస్థలలో చేరేందుకు నిరీక్షించాల్సి వస్తోందని, దీంతో వారి అమూల్యమైన సమయం వృథా అవుతోందని జగదీశ్ కుమార్ తెలిపారు. గత ఏడాది ఆన్‌లైన్ పద్ధతిలో ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ విధానాలను ద్వైవార్షికంగా చేపట్టినట్టు చెప్పారు. ఇది లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించిందన్నారు.

మూల వేతనంలో 50% పింఛను!

న్యూఢిల్లీ, జూన్ 11: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం.. ఉద్యోగులకు భారీ ఆఫర్ ప్రకటించనుంది. జాతీయ పింఛను పథకం(ఎన్‌పీఎస్)లో భాగంగా ఉద్యోగుల చిట్ట చివరి మూల వేతనం(బేసిక్ పే)లో 50% పింఛనుగా ఖచ్చితంగా ఇవ్వాలని ప్రతిపాదించింది. ఎన్‌పీఎస్‌పై అభ్యంతరాలు, పలు రాష్ట్రాలు తిరిగి పాత పింఛను విధానం వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ నేతృత్వంలో 2023లో కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఎన్‌పీఎస్‌ను మరింత ప్రయోజనకరంగా మార్చేందుకు అనుసరించాల్సిన విధానాలపై ఈ కమిటీ అధ్యయనం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం.. ఉద్యోగులకు చిట్ట చివరి మూల వేతనంలో 50% మొత్తాన్ని పింఛనుగా ఇచ్చేందుకు ప్రతిపాదించింది. ఎన్‌పీఎస్‌లో మార్పులు చేయాలని కూడా సోమనాథన్ కమిటీ సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. అయితే.. కమిటీ తన సిఫారసులను అమలు చేసేందుకు ఎలాంటి నిర్దిష్ట గడువు విధించలేదు.

లోకం తీరు

ఏపీకి అమరావతే రాజధాని: చంద్రబాబు



అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులు దృష్టిపెట్టాలి

» ఈ నెలాఖరుకు 456 మండలాల్లో వీసీ యూనిట్లు: తుమ్మల



హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక సాంద్రత పత్తిసాగుపై దృష్టి సారించాలని, ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం చేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. అధిక సాంద్రత పత్తి, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు సూచనలు చేశారు. అధిక సాంద్రత పత్తిసాగుతో తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని చెప్పారు. రైతులకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాన్ని పంపిణీ చేశామని, ఇతర రాష్ట్రాల నుంచి అదనపు విత్తనాలు కూడా తెప్పించి అందుబాటులో ఉంచామని తెలిపారు. రాష్ట్రంలో అవసరమైన మేరకు పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఈసెట్ కౌన్సెలింగ్‌కు వచ్చే అభ్యర్థులకు ఊరట

» హెల్ప్‌లైన్ కేంద్రాలకు చేరిన డిప్లొమా పాసైన వారి డేటా

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి విద్యాశాఖ అధికారుల స్పందన

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీజీఈసెట్ అభ్యర్థులకు ఊరటనిచ్చేలా సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు చేతికి రాని కారణంగా కౌన్సెలింగ్‌కు వందల సంఖ్యలో అభ్యర్థులు దూరమవుతున్న అంశంపై 'ఈసెట్ కౌన్సెలింగ్‌లో గందరగోళం' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థుల డేటాను అన్ని హెల్ప్‌లైన్ కేంద్రాలకు పంపించారు. ఈసెట్ కౌన్సెలింగ్ హాజరయ్యేందుకు అవసరమైన క్రెడిట్స్ (పాస్) అభ్యర్థికి ఉన్నాయో, లేదోనన్నది హెల్ప్‌లైన్ కేంద్రాల సిబ్బంది తెలుసుకునేందుకు వీలు కల్పించారు. దీంతో వెరిఫికేషన్ ప్రక్రియ సులువైంది. అలాగే పదో తరగతి మెమో, స్టడీ సరిఫికెట్లు పాలిటెక్నిక్ కళాశాలల్లో సమర్పించిన అభ్యర్థులు.. ఆయా సంస్థల నుంచి కస్టోడియన్ సర్టిఫికేట్లు తెచ్చినా అనుమతించాలని హెల్ప్‌లైన్ కేంద్రాలకు సాంకేతిక విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. విద్యార్థుల ధ్రువపత్రాలే కాకుండా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్స్ లేకున్నా ఆన్‌లైన్‌లోనే వెరిఫికేషన్ చేయాలని సూచించినట్లు సమాచారం.



హార్టికల్చర్ వర్సిటీ స్నాతకోత్సవంలో పట్టాలను అందజేస్తున్న గవర్నర్, వీసీ

పేదల ఆకలి తీర్చిన మోదీ : గవర్నర్ రాధాకృష్ణన్

గజ్వేల్/ములుగు, జూన్ 11: పేదల ఆకలి తీర్చిన నాయకుడు మోదీ అని.. ప్రజా సేవలో అబ్రహం లింకన్, మోదీ తమదైన ముద్ర వేశారని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన వర్సిటీ మూడో స్నాతకోత్సవంలో రాధాకృష్ణన్ మాట్లాడారు. 2047 వరకు భారత స్థూల జాతీయోత్పత్తి 30 ట్రిలియన్ డాలర్లకు ఎదిగేందుకు పుష్కల అవకాశాలు ఉన్నాయని, అందులో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. స్నాతకోత్సవంలో 156 మందికి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మందికి ఫారెస్ట్ పీజీ, ఆరుగురికి పీహెచ్‌డీ పట్టాలను అందజేశారు.

ఎంపికైన ఏఈఈలకు నియామక పత్రాలివ్వాలి

» మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మంగళవారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాలు పొందిన వారికి కాంగ్రెస్ సర్కార్ నియామక పత్రాలు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. ఉద్యోగాలకు ఎంపికైన ఏఈఈ అభ్యర్థులకు బీఆర్ఎస్ తరఫున తమ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా, తమకు వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలంటూ ఏఈఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు మంగళవారం గాంధీభవన్ ముందు మోకాళ్లపై నిల్చుని ఆందోళన వ్యక్తం చేశారు. 'హలో నిరుద్యోగి- చలో గాంధీభవన్' పేరుతో నిరసన తెలిపారు.

కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాక సోమవారమే..!

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లు కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా సొంత రాష్ట్రానికి సోమవారం రానున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేయాలని బీజేపీ నిర్ణయించింది. వారితో పాటు కొత్తగా ఎన్నికైన మిగతా ఆరుగురు ఎంపీలను కూడా ఘనంగా సన్మానించనున్నారు.

మునిసిపల్ చట్టాన్ని సవరించాలి: చాంబర్స్

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం మునిసిపల్ చట్టం- 2019ని తీసుకొచ్చి పురపాలక సంఘాల కౌన్సిళ్లను నిర్వీర్యం చేసిందని తెలంగాణ మునిసిపల్ చాంబర్స్ పేర్కొంది. అధికారాలన్నీ అధికారులకు అప్పగించి పాలకవర్గాలను పూర్తిస్థాయిలో నిరుపయోగంగా మార్చిందని అభిప్రాయపడింది. ఈ చట్టాన్ని కొత్తగా వచ్చిన ప్రభుత్వం సవరించి రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో ప్రజాపాలన సాగేలా చేయాలని కోరింది. మునిసిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కలెక్టర్లకు, అదనపు, కలెక్టర్లకు, కమిషనర్లకు అధికారాలు ఇవ్వడంతో కౌన్సిల్ ప్రమేయం లేకుండా పురపాలక సంఘాల డబ్బులను ఇష్టానురీతిలో కేటాయిస్తున్నారని, పాలకవర్గాల సంబంధం లేకుండా వ్యవహరించడం స్థానిక సంస్థలకే పెద్ద అవరోధంగా మారిందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మునిసిపల్ చట్టం- 2019ని సవరించి అధికారాలను మునిసిపల్ కౌన్సిల్‌కు, సీడీఎంఏకు అప్పగించాలని వెన్‌రెడ్డి రాజు కోరారు.

ఎస్‌ఐబీ సీఐ రాసలీలలు?

» హనుమకొండలో ఓ మహిళతో చిక్కిన ఖాకీ

» పోలీసుల అదుపులో సీఐ.. వివరాలు గోప్యం!

వరంగల్ క్రైం, జూన్ 11: స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్(ఎస్ఐబీ)కు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ రాసలీలలు వరంగల్‌లో కలకలం సృష్టిస్తున్నాయి. మంగళవారం తన మిత్రులతో కలిసి వరంగల్‌లోని చింతగట్టు క్యాంపు గెస్ట్ హౌస్‌కు వచ్చిన ఆ ఇన్‌స్పెక్టర్.. అక్కడ పార్టీ చేసుకున్నారు. ఆ తర్వాత ఓ మహిళను గెస్ట్‌హౌస్‌కు పిలిపించుకున్నట్లు తెలిసింది. సదరు మహిళ కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో.. కాకతీయ యూనివర్సిటీ రాణా పోలీసులు ఆ గెస్ట్‌హౌస్‌పై దాడి చేసి, సదరు సీఐని అదుపులోకి తీసుకున్నారు. పోలీసు శాఖకు చెందిన అధికారి పట్టుబడడం.. ఇటీవలే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎస్ఐబీ పేరు బయటకు రావడంతో.. ఈ కేసు వివరాలను ఉన్నతాధికారులు గోప్యంగా పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే.. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై కేయూ రాణా అధికారుల వివరణకు యత్నించగా.. వారి ఫోన్లు స్విచాఫ్ కావడం గమనార్హం..!

రూ. 18 లక్షల నకిలీ నోట్ల పట్టివేత

శంషాబాద్ రూరల్, జూన్ 11: వాహనాల తనిఖీలో ఓ వ్యక్తి వద్ద రూ.18 లక్షల మేర నకిలీ నోట్లు లభించిన ఉదంతమిది. రంగారెడ్డి జిల్లా తొండుపల్లి వద్ద మంగళవారం ఉదయం ఎస్సై భాస్కర్ తన సిబ్బందితోపాటు వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నంబర్‌ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వస్తున్న కర్ణాటకలోని హోసలింగాపుర గ్రామానికి చెందిన కొరచ మురుగేశ్ అడ్డుకున్నారు. పత్రాలు లేకపోవడంతో.. పొంతనలేని సమాధానాలిస్తున్న మురుగేశ్ బ్యాగ్‌ను తనిఖీ చేయగా.. రూ.500 నోట్ల కట్టలు రూ.18 లక్షల మొత్తంలో ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరీక్షించగా.. అవన్నీ నకిలీవని తేలింది. నిందితుడు తన సోదరుడు రవిచంద్ర, యోగేశ్‌తో కలిసి స్వగ్రామంలో కంప్యూటర్స్ అండ్ జిరాక్స్ దుకాణాన్ని నడుపుతున్నట్లు గుర్తించారు. కలర్ జిరాక్స్ ద్వారా రూ.500 నకిలీ నోట్లను తయారు చేస్తున్నట్లు మురుగేశ్ అంగీకరించాడని, ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు.

కేసీఆర్ కోసం కొన్న కార్లు మంత్రులకు

విజయవాడ నుంచి రానున్న 22 కొత్త ల్యాండ్ క్రూయిజర్లు

రాష్ట్ర మంత్రులకు కేటాయించాలని సర్కార్ నిర్ణయం

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఇకపై ల్యాండ్ క్రూయిజర్ కార్లలో ప్రయాణించనున్నారు. పూర్తిస్థాయి బుల్లెట్ ప్రూఫ్‌తోపాటు శాటిలైట్ ఆధారిత టెక్నాలజీతో రూపుదిద్దుకున్న ల్యాండ్ క్రూయిజర్లను మంత్రులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో తన కాన్వాయ్ కోసం రూ.66 కోట్లతో 22 ల్యాండ్ క్రూయిజర్ కార్లను కొనుగోలు చేశారు. వాటికి బుల్లెట్ ప్రూఫ్‌తో పాటు, ఇతర సాంకేతిక వ్యవస్థను అమర్చడం కోసం విజయవాడలోని త్రిహాయని ఇంజనీరింగ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు తరలించారు. సాంకేతికతో పాటు అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఆ కార్లను ఇప్పుడు రాష్ట్ర మంత్రులకు కేటాయించనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందే వాహనాలు సిద్ధమై రావాల్సి ఉండగా పనుల్లో ఆలస్యం కారణంగా అవి అక్కడే ఉండిపోయాయి. అదనపు హంగుల పనులు పూర్తి కావడంతో త్వరలో కొత్త కార్లను విజయవాడ నుంచి హైదరాబాద్ తీసుకురానున్నారు. కొద్దిరోజుల క్రితమే కొత్త వాహనాలు హైదరాబాద్‌కు రావాల్సి ఉన్నా లోక్‌సభ ఎన్నికల హడావిడి, కోడ్ కారణంగా తీసుకురాలేదు. ప్రస్తుతం సాధారణ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో త్వరలో ఆ కార్లను హైదరాబాద్ తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే నిఘా విభాగం అధికారులు విజయవాడ వెళ్లి కొత్త వాహనాల పనితీరును పరిశీలించి వచ్చారు. కాగా గత ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో ఉపయోగించిన ల్యాండ్ క్రూయిజర్ల రంగు మార్చి.. వాటినే సీఎం రేవంత్ రెడ్డి వాడుతున్నారు.

ఆర్టీఐ చీఫ్ కమిషనర్.. కమిషనర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు(ఆర్టీఐ) చీఫ్ కమిషనర్, కమిషనర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 29న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇచ్చింది. ఈ మేరకు నోటిఫికేషన్ సంబంధిత ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం జారీ చేశారు. సమాచార హక్కు చట్టం-2005లోని సెక్షన్లు 15, 16 ప్రకారం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం తెలిపింది. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జత పర్చాలని పేర్కొంది. దరఖాస్తులను https://telangana.gov.in లేదా http://tsic.gov.in వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఈ దరఖాస్తులను రిజిస్టర్డ్ పోస్టు ద్వారా సచివాలయంలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపాలని తెలిపింది. 2023 జూలై 4న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం వివరించింది.

ఏపీ మంత్రివర్గంలో బీసీలకే పెద్దపీట

అచ్చెన్న, కొల్లు సహా 8 మందికి మంత్రి పదవులు

అనిత, సవిత సహా ముగ్గురు మహిళలకు చోటు

» పవన్, దుర్గేశ్, కొండపల్లి సహా 8 మంది కొత్త ఎమ్మెల్యేలకు చోటు

» పాత తరం ఆనం, కొలుసుకూ చోటు

» నారాయణ, లోకేశ్, కేశవ్, ఫరూక్ కూడా

» ప్రతి ఏడుగురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవి

» ఆ లెక్కన జనసేనకు 3, బీజేపీకి ఒకటి

» కేబినెట్ కూర్పుపై బాబు ఫార్ములా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



కూటమి భేటీకి హాజరైన మహిళా ఎమ్మెల్యేలు

తన మంత్రివర్గంలో బీసీలకు, మహిళలకు టీడీపీ కూటమి సారథి చంద్రబాబు అధిక ప్రాధాన్యమిచ్చారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి సహా 8 మంది బీసీ నేతలకు అవకాశమిచ్చారు. అలాగే టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత, సీనియర్ నాయకురాలు గుమ్మడి సంధ్యారాణి, కొత్తగా ఎన్నికైన సవితకు కూడా మంత్రి పదవులు లభించాయి. జనసేనాని పవన్ కల్యాణ్, కందుల దుర్గేశ్, సవిత సహా కొత్తగా ఎన్నికైన 8 మంది ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో చోటు కల్పించారు. ఆయనతో పాటు పదవీ ప్రమాణం చేసే మొత్తం 24 మంది మంత్రుల పేర్లను మంగళవారం అర్ధరాత్రి దాటాక ప్రకటించారు. కాపు, కమ్మ సామాజిక వర్గాలకు చెరి నాలుగు పదవులు దక్కాయి. కాపుల్లో పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు, పవన్, దుర్గేశ్.. కమ్మ వర్గానికి చెందిన లోకేశ్, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్‌కు.. రెడ్డి సామాజిక వర్గంలో సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎం.రాంప్రసాద్‌రెడ్డికి అవకాశం లభించింది. ఎస్సీ కోటాలో అనిత, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్టీ కోటాలో గుమ్మడి సంధ్యారాణి, ముస్లింల నుంచి మాజీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఆర్య వైశ్య వర్గం తరఫున టీజీ భరత్ చోటు సంపాదించారు. అసెంబ్లీలో 175 సీట్లు ఉండగా మంత్రివర్గంలో 25 మంది మంత్రులను తీసుకోవడానికి అవకాశం ఉంది. కేబినెట్ కూర్పునకు చంద్రబాబు ఓ ఫార్ములా రూపొందించారు. ప్రతి ఏడుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి కేటాయించారు. ఆ లెక్కన 21 మంది ఎమ్మెల్యేలున్న జనసేనకు మూడు, 8 మంది ఎమ్మెల్యేలున్న బీజేపీకి ఒకటి (సత్యకుమార్).. 135 స్థానాలున్న టీడీపీకి 21 మంత్రి పదవులు లభించాయి. పదవులు పొందిన బీసీ నేతల్లో ఇంకా కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్, సత్యకుమార్, సవిత ఉన్నారు.

ఏపీ మంత్రులు వీరే...

తెలుగుదేశం

1. నారా లోకేశ్ (మంగళగిరి)
2. కింజారపు అచ్చెన్నాయుడు (టెక్కలి)
3. కొల్లు రవీంద్ర (బందరు)
4. పొంగూరు నారాయణ (నెల్లూరు సిటీ)
5. వంగలపూడి అనిత (పాయకరావుపేట)
6. నిమ్మల రామానాయుడు (పాలకొల్లు)
7. ఎన్ఎండీ ఫరూక్ (నంద్యాల)
8. ఆనం రామనారాయణ రెడ్డి (ఆత్మకూరు)
9. పయ్యావుల కేశవ్ (ఉరవకొండ)
10. అనగాని సత్యప్రసాద్ (రేపల్లె)
11. కొలుసు పార్థసారథి (నూజివీడు)
12. డోలా బాల వీరాంజనేయ స్వామి (కొండపి)
13. గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి)
14. గుమ్మడి సంధ్యారాణి (సాలూరు)
15. బీసీ జనార్దన రెడ్డి (బనగానపల్లె)
16. టీజీ భరత్ (కర్నూలు)
17. ఎస్.సవిత (పెనుకొండ)
18. కొండపల్లి శ్రీనివాస్ (గజపతినగరం)
19. ఎం.రాంప్రసాద్ రెడ్డి (రాయచోటి)
20. వాసంశెట్టి సుభాష్ (రామచంద్రాపురం)

జనసేన

1. పవన్ కల్యాణ్ (పిఠాపురం)
2. నాదెండ్ల మనోహర్ (తెనాలి)
3. కందుల దుర్గేశ్ (నిడదవోలు)

బీజేపీ

1. సత్యకుమార్ యాదవ్ (ధర్మవరం)

ఈ దారి.. ప్రగతికి రహదారి!

» హైదరాబాద్ -విజయవాడ హైవేపై స్థిరాస్తి బూమ్

» ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం రావడంతో ప్రభావం

» ఇప్పటికే మౌలిక ప్రాజెక్టులు, పారిశ్రామిక పార్కులు

» హైదరాబాద్ రియాల్టీ అభివృద్ధికి ఇదో చోదక శక్తి..!

» ఆంధ్రా రాజధాని అమరావతికి పెట్టుబడుల పయనం

» హైదరాబాద్ మార్కెట్‌లో స్తబ్దత.. ఐనా ఆశావహమే

» రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అన్ రాక్ అంచనా

హైదరాబాద్, జూన్ 11: ఏపీలో కొత్త సర్కారు ఏర్పడుతున్న వేళ.. అక్కడ చోటుచేసుకునే అభివృద్ధి పరిణామాలు హైదరాబాద్ స్థిరాస్తి రంగాన్ని ప్రభావితం చేస్తాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అన్‌రాక్ అంచనా వేస్తోంది. పొరుగు రాష్ట్రంలో కొలువుదీరనున్న చంద్రబాబు ప్రభుత్వం రాజధాని అమరావతిని మళ్లీ పరుగులు పెట్టిస్తుందని, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ, పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నాలు సాగిస్తుందని గుర్తుచేస్తూ.. ఈ దూకుడు ప్రభావం హైదరాబాద్ పైన కూడా ఎంతో కొంత ఉంటుందని చెబుతోంది. ఏపీ సర్కారు పెట్టుబడులను ఆకర్షిస్తుందని, ఇది నగర రియాల్టీ మార్కెట్‌లో కొంత స్తబ్దతకు దారితీస్తుందని వివరిస్తోంది. అయితే, ఇదేమీ స్వరూపాన్ని పూర్తిగా మార్చదని, కార్యాలయ, వాణిజ్య అవసరాల కోసం స్థలాలకు డిమాండ్ ఏర్పడి మొత్తమ్మీద సానుకూలతే ఉంటుందని విశ్లేషిస్తోంది. కాగా, హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్ ఇప్పటికే గరిష్ఠాలకు వెళ్లిపోయిందని, మరీ ముఖ్యంగా 2021 నుంచి ఆస్తుల విలువలు 45 శాతం వరకు పెరిగిన విషయాన్ని ప్రస్తావించింది. తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలక రహదారి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి. ఇప్పటికే మౌలిక ప్రాజెక్టులు, పారిశ్రామిక పార్కులు ఉన్న ఈ మార్గంలో ఉన్నాయి. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం రావడంతో.. అనుకూల విధానాలతో ఐటీ, ఇతర పరిశ్రమలను ఆకర్షిస్తారని అన్‌రాక్ అంచనా వేస్తోంది. ఆ పర్యవసానాల ప్రభావంలో ప్రత్యేకంగా హైదరాబాద్-విజయవాడ వంటి మార్గాల్లో కార్యాలయ, వాణిజ్య స్థలం డిమాండ్ పెరుగుతుందని చెబుతోంది. ఇకపై ఈ సుదీర్ఘ మార్గం మరింత ముఖ్యం కానుందని, హైదరాబాద్ రియాల్టీ వృద్ధికి చోదక శక్తిగా ఎదుగుతుందని పేర్కొంటోంది. వాణిజ్యపరమైన స్థిరాస్తి లావాదేవీల వృద్ధికి దోహదం చేస్తుందని వివరిస్తోంది.

విప్లవోద్యమ నాయకురాలు రాధక్క కన్నుమూత

» గోదావరి లోయ ప్రతిఘటనోద్యమంలో ముఖ్యపాత్ర

» చంద్ర పుల్లారెడ్డి ఉద్యమ సహచరిగా గుర్తింపు

» భర్త, పిల్లల్ని వదిలి అడవిబాట



రాధక్క (ఫైల్)

హైదరాబాద్ సిటీ, జూన్11 (ఆంధ్రజ్యోతి): గోదావరి లోయ ప్రతిఘటనా పోరాట నిర్మాణంలో ముఖ్య భూమికగా నిలిచిన విప్లవోద్యమ నాయకురాలు రాధక్క (86) ఇకలేరు. కొంతకాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె మంగళవారం ఉదయం సరూర్‌నగర్ సమీపంలోని సింగరేణికాలనీలో ఉన్న కుమార్తె జ్యోతి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. రాధక్క అసలు పేరు అక్కినేని నిర్మల. ఆమె స్వస్థలం ఉమ్మడి కృష్ణాజిల్లా పోతురెడ్డిపల్లి. తనకు పద్నాలుగో ఏట అక్కినేని శివరామకృష్ణతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెకాగా పెద్ద కుమారుడు హరికృష్ణ కొంతకాలం కిందట మరణించారు. చిన్నకుమారుడు నవకృష్ణ అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన బుధవారం సాయంత్రానికి ఇక్కడికి చేరుకుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రాధక్క కాకినాడ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న సమయంలో సీపీఎం అనుబంధ మహిళా సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. శ్రీకాకుళ రైతాంగ పోరాట స్ఫూర్తితో సాగిన గోదావరి లోయ ప్రతిఘటనోద్యమంలో భాగంగా అడవి బాట పట్టారు. ములుగు నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదివాసీ, గిరిజనులకు వందల ఎకరాల పోడుభూమి పంచడంలో రాధక్క పాత్ర ప్రత్యేకమైనదని చెప్పుకోవచ్చు. విప్లవోద్యమ క్షేత్రంలో దళ కమాండర్‌గానూ వ్యవహరించారు. సీపీఐ(ఎంఎల్) పార్టీ రాష్ట్ర, కేంద్ర కమిటీల్లోనూ సభ్యురాలిగా పనిచేశారు. విప్లవోద్యమంలో అగ్రశ్రేణి నాయకుడిగా పేరొందిన చంద్ర పుల్లారెడ్డి (సీపీ) ఉద్యమ సహచరిగా గుర్తింపు పొందారు. సాయుధ పోరాటంలో పని చేస్తున్న క్రమంలో ఎన్నోసార్లు పోలీసుల కాల్పుల నుంచి తప్పించుకున్నారు. ఆదివాసీ గూడేల్లో రాత్రి పాఠశాలలు లాంటివి నిర్వహించి వారిని చైతన్యవంతం చేసేందుకు కృషి చేశారు. 'విమోచన' పత్రికలో వ్యాసాలు రాశారు. రాధక్క 1984లో అరెస్టు అయ్యి, కొంతకాలం జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత కొన్నాళ్ళు అజ్ఞాత వాసంలో ఉన్నారు. వయసు రీత్యా ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో 1990లో జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ప్రతిఘటనా పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన రాధక్క మృతి బాధాకరం అంటూ సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్, సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, ప్రజాగాయని విమలక్క, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, బూర్గుల ప్రదీప్ తదితరులు విచారం వ్యక్తం చేశారు. రాధక్క అంత్యక్రియలు సైదాబాద్‌లోని దోబీఘాట్ పరిసరాల్లోని శ్మశానవాటికలో గురువారం నిర్వహించనున్నట్లు ఆమె సోదరుడు జగన్మోహన్ తెలిపారు.

ఆ కుర్చీలకు అతుక్కుపోయి..

వైద్యశాఖలో ఏళ్ల తరబడి ఒకే స్థానంలో కొందరు ఉద్యోగుల తిష్ట.. 36 ఏళ్లుగా కుర్చీ వదలని ఓ ఫార్మసిస్టు

» 25 ఏళ్లుగా హైదరాబాద్ వదలని హెచ్‌వోడీ

» 19 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వైద్యుడు

» ఇలాంటి వారి జాబితాపై సర్కారుకు నివేదిక

» దాని ఆధారంగా బదిలీలకు అవకాశం

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఉద్యోగుల్లో కొందరు ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పని చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా తమ కుర్చీని కాపాడుకుంటున్నారు. ఇలా, సచివాలయ డిస్పెన్సరీలో పని చేసే ఓ ఫార్మసిస్టు 36 ఏళ్లుగా అదే స్థానంలో కొనసాగుతున్నారు. వైద్య విద్య సంచాలకుల పరిధిలోని ఓ హెచ్‌వోడీ అయితే తనకు ఉద్యోగం వచ్చినప్పటి నుంచి ఈ రోజు దాకా పాతికేళ్లుగా హైదరాబాద్‌లోనే తిష్ట వేశారు. ప్రస్తుతం ఓ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలోని ఓ వైద్యుడు 19 ఏళ్లుగా అక్కడే పాతుకుపోయారు. నిర్మల్ జిల్లా భైంసా ఏరియా ఆస్పత్రిలో ఓ వైద్యుడు 14 ఏళ్లుగా అక్కడే పని చేస్తుండగా, మెదక్, సంగారెడ్డి జిల్లా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు ఎనిమిదేళ్లుగా అక్కడే ఉంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు చేపట్టాలని భావిస్తున్న ప్రభుత్వం ఇలా ఒకే చోట ఏళ్లుగా పాతుకుపోయిన ఉద్యోగులపై దృష్టి పెట్టింది. ఈ మేరకు వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆయా ఉద్యోగుల వివరాలతో నివేదిక సిద్ధం చేసిన అధికారులు దానిని ప్రభుత్వానికి సమర్పించారు.

నివేదిక ఆధారంగా బదిలీలు.. ?

డీఎంఈ, డీహెచ్, టీవీవీపీ, ఆయుష్‌తో పాటు ఇతర విభాగాల్లో ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్న వారితో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలతో వైద్య శాఖ ఓ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ నివేదిక ప్రకారం ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది కలిపి ఐదేళ్లకు పైగా ఒకే చోట పాతుకుపోయిన వారు సుమారు 3000 మంది ఉన్నారు. వీళ్లలో అత్యధికులు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోనే పని చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇక, వైద్య కళాశాలలు, జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనే కాకుండా డిప్యుటేషన్లు, వర్క్ ఆర్డర్స్ ఫారిన్ సర్వీస్ డిప్యుటేషన్ (ఎఫ్ఎస్‌డీ) పేరుతో ప్రధాన విభాగాధిపతుల కార్యాలయాల్లో ఏళ్లుగా తిష్ట వేసిన వారు కూడా ఉన్నారు. ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో ఐదేళ్లకు మించి హెచ్‌వోడీ కార్యాలయాల్లో పని చేస్తున్న వారు ఏకంగా 43 మంది ఉన్నారు. అలాగే, వైద్యవిద్య సంచాలకుల పరిధిలో 18 మంది, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కార్యాలయంలో 9 మంది, ఆయుష్ ఆఫీసులో ఏడుగురు మొత్తం 77 మంది ఇలాగే హెచ్‌వోడీ కార్యాలయాల్లో పని చేస్తున్నారు. అలాగే 20 మంది నాలుగేళ్లుగా, 37 మంది మూడేళ్లుగా హెచ్‌వోడీ కార్యాలయాల్లో ఉన్నవారూ ఉన్నారు. ఇలాంటి వారందరికీ సాధారణ బదిలీల్లో భాగంగా స్థాన చలనం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

వైద్యుల బదిలీలు పారదర్శకంగా జరగాలి

వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం(టీటీజీడీఏ) మంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేసింది. గ్రామీణ ప్రాంత వైద్య కళాశాలల్లో ఐదేళ్లకు మించి పనిచేస్తున్న వారికి బదిలీల్లో ప్రాధాన్యమివ్వాలని టీటీజీడీఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్‌కుమార్, మాదల కిరణ్ కోరారు. పదోన్నతులకు కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగులు ఇవ్వాలన్నారు. వైద్యుల వేతన పెంపు గిరిజన, గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మినహా అన్ని మెడికల్ కాలేజీలకు వర్తింపజేయాలని కోరారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

పలు ప్రాంతాల్లో 4 సెం.మీ.కు పైగా నమోదు

నిర్మల్, నిజామాబాద్, యాదాద్రి జిల్లాల్లో వాన

నేడు పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చార్మినార్ సర్దార్ మహల్‌లో అత్యధికంగా 4.8, వారాసిగూడ బౌద్ధ నగర్‌లో 4.7 సెం.మీ వర్షం కురిసింది. రామాంతాపూర్, కాప్రా, హయత్‌నగర్, బండ్లగూడ, అంబర్‌పేట, నాచారం, హబ్సిగూడ ప్రాంతాల్లో 4 సెం.మీ.కుపైగా వాన పడింది. ముషీరాబాద్, ఉప్పల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులపై వరద నీరు నిలిచిపోవడంతో ఎల్‌బీనగర్, ఉప్పల్ స్టేడియం, చిక్కడపల్లి, గాజులరామారం ప్రాంతాల్లో ట్రాఫిక్‌జాం సమస్యలు తలెత్తాయి. చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి, కుత్బుల్లాపూర్, సూరారం, జీడిమెట్ల, షాపూర్‌నగర్, సుచిత్ర సెంటర్, నిజాంపేట బాచుపల్లి ప్రగతినగర్ ప్రాంతాల్లో రహదారులపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నగరంలో మరో రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని బేగంపేట వాతావరణ శాఖ తెలిపింది. ఇక, ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం వర్షం పడింది. ఉట్నూర్ మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మండలంలోని కొలాంగూడ వద్ద రోడ్డుపై భారీ వృక్షం పడిపోవడంతో ఇటు వైపు కొత్తగూడ చెక్‌పోస్టు వరకు, అటు దంతనపల్లి కొలాంగూడ వరకు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. అలాగే ఉట్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్, నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ వాన కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో భారీగా, వలిగొండలో మోస్తరు వర్షం పడింది.



హైదరాబాద్‌లో భారీ వర్షానికి రోడ్లపై నిలిచిన నీరు

నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు

పలు జిల్లాల్లో బుధవారం అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతారణ కేంద్రం తెలిపింది. రంగారెడ్డి, సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, వరంగల్, మహబూబాబాద్, ములుగు, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, హన్మకొండ, మేడ్చల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, పసిఫిక్ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో అసాధారణ మార్పుతో ఎల్‌నినో స్థితి నుంచి లానినోకు మారతున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇంకోయిస్) అంచనా వేసింది. పసిఫిక్ మహా సముద్రంపై లానినో పరిస్థితులు సంభవిస్తే అవి నైరుతి రుతుపవనాలకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందని అభిప్రాయపడింది. సాధారణంగా లానినో స్థితి ఎక్కువగా జూలై-సెప్టెంబరు మధ్య ఉంటుందని, అది 2025 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది.



రామోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, మంత్రి తుమ్మల

రామోజీ కుటుంబసభ్యులకు సీఎం పరామర్శ

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కుటుంబసభ్యులను మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. రామోజీరావు మరణించిన సమయంలో ఢిల్లీలో ఉన్న సీఎం సీడబ్ల్యూసీ, పార్టీ ఇతర సమావేశాల్లో పాల్గొనాల్సి ఉండడంతో పార్థివ దేహాన్ని చూసేందుకుగానీ, అంత్యక్రియలకు గానీ హాజరు కాలేకపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం రామోజీ ఫిల్మ్ సిటీలోని రామోజీరావు నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్ ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. రామోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీఎంతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, ఇటీవల ఖమ్మం పట్టభద్రులు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన తీన్మార్ మల్లన్న మంగళవారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం నివాసంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వారిని అభినందించి శాలువాలతో సత్కరించారు.

రెరా చట్టాన్ని కఠినంగా అమలు చేయండి: సీఎం

రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి రెరా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ రాజశేఖర్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి సూచన చేశారు. ఈ చట్టం అమలు చేసి కొనుగోలు దారులు మోసపోకుండా చూడాలన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని మంగళవారం ట్రిబ్యునల్ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు పల్లె ప్రదీప్‌కుమార్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ చిత్రా రామచంద్రన్ కలిశారు.

సింగరేణిలో కారుణ్య నియామకాల

వయోపరిమితి 40 ఏళ్లకు పెంపు

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కారుణ్య నియామకాల గరిష్ఠ వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం సింగరేణి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. కారుణ్య నియామకాల ఉద్యోగార్థుల వయోపరిమితిని పెంచాలని కార్మికులు దీర్ఘకాలంగా కోరుతుండగా.. ఇటీవలే వారికి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తాజాగా ఆ నిర్ణయం కార్యరూపం దాల్చింది. ఈ సడలింపు నిర్ణయం 2018 మార్చి 9 నుంచి అమల్లోకి రానుంది. దాంతో ఆ రోజు నుంచి 40 ఏళ్లలోపు ఉన్నవారికి కొలువులు దక్కనున్నాయి. ఈ నిర్ణయంతో 2018 నుంచి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న దాదాపు 300 మంది వారసులకు తక్షణమే ప్రయోజనం చేకూరనుందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు.

'ప్రజావాణి'లో మంత్రి సీతక్క

బేగంపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో మంత్రి సీతక్క ఆకస్మికంగా పాల్గొన్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు దివ్యతో కలిసి మంత్రి సీతక్క ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గ్రేటర్ హైదరాబాద్ డ్రైవర్ కమ్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు.. ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగినందున ప్యాకేజీ పెంచాలని కోరారు. మాజీ సైనికులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీలో సస్పెండైన ఉద్యోగులు తమ సమస్యలను మంత్రి సీతక్కకు విన్నవించుకున్నారు. వీరితో రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. 'ప్రజావాణి'లో మంగళవారం అన్ని విభాగాలకు సంబంధించి 702 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఆహార కల్తీ చేస్తే కఠిన చర్యలు

- హోటల్స్ అసోసియేషన్లతో వైద్యమంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీ చేస్తూ నాణ్యత పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో హోటల్స్ అసోసియేషన్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. నిజాం కాలం నుంచి హైదరాబాద్ బిర్యానీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందన్నారు. హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. అలాగే, ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్నామని తెలిపారు.

ఫ్లైయాష్ అక్రమ రవాణాతో

పొన్నంకు రోజుకు రూ.50 లక్షలు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపణ

రామగుండం ఎన్టీపీసీ పరిధిలో నిబంధనలకు విరుద్ధగా ఫ్లైయాష్‌ను రవాణా చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ భారీ అవినీతికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఫ్లైయాష్ తరలింపులో మంత్రి పొన్నం రోజుకు రూ.50 లక్షలు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఒక్కో లారీలో కేవలం 32 టన్నుల ఫ్లై యాష్ తరలించాల్సి ఉండగా.. 72 టన్నుల ఓవర్ లోడ్‌తో వెళ్తున్న 13 లారీలను పట్టుకుని రవాణా శాఖ అధికారులకు అప్పగించానని తెలిపారు. కానీ, రవాణా శాఖ మంత్రి నుంచి వచ్చిన ఫోన్‌తో అధికారులు కేవలం రెండు లారీలనే సీజ్ చేశారని చెప్పారు. ఈ అంశంలో మంత్రి పొన్నంతో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇంత అవినీతి జరుగుతున్నా ఎన్టీపీసీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్‌ది బూడిద రాజకీయం : ఆది శ్రీనివాస్

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పని బూడిదయ్యాక.. ఆ పార్టీ బూడిద రాజకీయం చేస్తోందంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఎన్టీపీసీ బూడిదలో రోజుకు రూ. 50 లక్షల చొప్పున సంపాదిస్తున్నట్లు ఆరోపిస్తున్న ఆ పార్టీ నేతలు.. గడిచిన పదేళ్లలో ఎంత సంపాదించారని నిలదీశారు. టెండర్ ప్రక్రియ ద్వారా ఎన్టీపీసీ బూడిద ఖమ్మంకు వెళతుంటే.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీపీసీ బూడిదను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టెండర్ వేసి అమ్ముతుంటారని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ప్రమేయమే ఉండదన్నారు.

బీరు సీసాలపై చేర్యాల నకాశీ చిత్రాలు

- కర్జ్బూర, 100పైపర్ బీర్‌బాటిళ్లపై చేర్యాల చిత్రకళ
- ఆయా కంపెనీలతో కొందరు కళాకారుల ఒప్పందం
- స్థానికులు, అభిమానుల మండిపాటు



చేర్యాల, జూన్ 11: అరుదైన చిత్రకళగా, వారసత్వ సంపదగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన చేర్యాల నకాశీ చిత్రాలను మద్యం సీసాలపై ముద్రించడంతో చిత్రకారులు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో పోటీని తట్టుకునేందుకు గతంలో గ్రామదేవతల చరిత్రలు, ఇతిహాసాల వివరణతో పాటు బొమ్మల తయారీ, టీ షర్టులు, భోజన ప్లేట్లు, ఇతరాత్ర వస్తువులపై నకాశీ చిత్రాలను ముద్రించేవారు. అయితే ఇప్పుడు కొత్తగా బీరు బాటిళ్లపై నకాశీ చిత్రాలను ముద్రించడానికి కర్జ్బూర, 100 పైపర్ బ్రాండ్ కంపెనీలతో కొందరూ కళాకారులు ఒప్పందం చేసుకున్నారు. భౌగోళిక గుర్తింపు (జీఐ) ట్యాగ్ ఉన్న అపురూప చిత్ర కళా లేబుల్ ముద్రణను సదరు కంపెనీలకు కళాకారులు అమ్ముకోవడంపై స్థానికులు, చిత్రకళా అభిమానులు మండిపడుతున్నారు.

'కాళేశ్వరం'పై అబద్ధాలు చెబితే క్రిమినల్ కేసులు

- బ్యారేజీల వైఫల్యానికి కారణాలు చెప్పాలి
- అధికారులకు జస్టిస్ పీసీ ఘోష్ హెచ్చరిక
- 25లోగా అఫిడవిట్ల దాఖలుకు నిర్దేశం



హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణంతో ముడిపడిన అంశాలపై వివరాలు చెప్పే అధికారులు.. వాటికి కట్టుబడి ఉండాలని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ అన్నారు. విచారణలో చెప్పిన అంశాలనే అఫిడవిట్‌లో పొందుపరచాలన్నారు. అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాలు వాస్తవ విరుద్ధంగా ఉంటే ఆయా అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకూ వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ నెల 25వ తేదీలోగా అఫిడవిట్లను అందజేయాలని ఆదేశించారు. ఏ కారణాలతో బ్యారేజీల వైఫల్యం జరిగిందో సవివరంగా కమిషన్‌కు వివరించాల్సిందేనని స్పష్టం చేశారు. కాళేశ్వరంలోని మేడి గడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ, నాణ్యత, నిర్వహణ లోపాలు, అవినీతి, నిధుల దుర్వినియోగాన్ని వెలికి తీసి.. వాటికి బాధ్యులను గుర్తించేందుకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ విచారణ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ మంగళవారం క్షేత్రస్థాయిలోని ఇంజనీర్లను పలు అంశాలపై ప్రశ్నించారు. వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీల స్థితిగతులపై తెచ్చుకున్న నివేదికలపై స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో) అధికారులను విచారించారు. బ్యారేజీల నాణ్యత ఏ విధంగా ఉందని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ప్రశ్నించారు. అనంతరం విచారణ జరుగుతున్న తీరును ఆయన విలేకరులకు వివరించారు. బ్యారేజీల డిజైన్లు, నిర్మాణం, నాణ్యత వంటి అంశాలపై అధికారులను పిలిచి వివరాలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులనూ పిలుస్తామన్నారు. కమిషన్‌కు 54 మంది దాకా ఫిర్యాదులు చేశారని, వీటిలో భూసేకరణ, పరిహారానికి సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయని, వీటిని ప్రభుత్వానికి నివేదించామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలే కాకుండా ఇతర కాంపోనెంట్లపై కూడా ఫిర్యాదులు అందాయని, అవి విచారణ పరిధిలో లేనందున.. వాటిపై ఏం చేయాలనే దానిపై ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

సాంకేతిక అంశాలను తెలుసుకోవడానికే..

విచారణలో భాగంగా అధికారులు అందించిన వివరాలు, కాగ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నివేదికలతోపాటు జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలన్నింటినీ పరిశీలించాక.. తదుపరి ఎవరెవరిని పిలవాలనే దానిపై నిర్ణయం ఉంటుందని జస్టిస్ పీసీ ఘోష్ అన్నారు. ప్రస్తుతం సాంకేతిక అంశాలను పరిశీలించడానికి/తెలుసుకోవడానికే పిలుస్తున్నామని, ఆ తరువాత ఉల్లంఘనలపై దృష్టి పెడతామని అన్నారు. కమిషన్ విచారించిన వారిలో ఈఎన్‌సీ(ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావు, మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్ రమణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నూనె శ్రీధర్, ఓంకారేశ్వర సింగ్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌కు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)



సమయం దృష్ట్యా అప్పటి వరకూ గడువు ఇవ్వలేమని, ఈ నెల 15 లోగా వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. మంగళవారం కమిషన్ కార్యాలయంలో జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. గత నెలలో కేసీఆర్‌తోపాటు మొత్తం 25 మందికి (వీరిలో పలువురు ప్రభుత్వ అధికారులు) నోటీసులు ఇచ్చామని, కొందరిని కమిషన్ ఎదుట హాజరుకావలసిందిగా కోరగా, మరికొందరిని లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని పేర్కొన్నామన్నారు. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం వల్ల కలిగే నష్టంపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీఈఆర్‌సీ)కి ఇంధనశాఖ మాజీ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ 2016 నవంబరు 30వ తేదీన రాసిన లేఖ కీలకమైన సమాచారం అందించిందన్నారు. కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియను అనుసరించకుండా నామినేషన్ పద్ధతిలో ఛత్తీస్‌గఢ్ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్) నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు 2014లో నాటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. ఓవైపు ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ మాత్రమే కొంటూ మరోవైపు 2000 మెగావాట్ల విద్యుత్ కారిడార్ (అంతరాష్ట్ర విద్యుత్ సరఫరా లైన్ల) కోసం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ డిస్కమ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఛత్తీస్‌గఢ్‌తో 2014లో ఒప్పందం చేసుకున్నప్పటికీ మూడేళ్ల వరకు విద్యుత్ సరఫరా కాలేదని, 2017లో సరఫరా మొదలైనా మరో మూడేళ్ల తర్వాత నిలిచిపోయిందన్నారు. ఈ వ్యవహారంతో ఆర్థికంగా నష్టం జరిగినట్లుగా అధికారులు, ఇతరుల ద్వారా తెలిసిందన్నారు. మణుగూరు వద్ద భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో కాకుండా సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించాలని నిర్ణయించటం వల్ల వాతావరణ కాలుష్యంతోపాటు ఏటా రూ.వెయ్యి కోట్లకు పైగా నష్టం వాటిల్లనుందని పలు వివరాలు తెలియజేస్తున్నాయన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.250 కోట్ల నుంచి రూ.300 కోట్ల దాకా విలువైన బొగ్గును ప్లాంటుకు ఉపయోగించాల్సిన పరిస్థితి ఉందని తమకు లభించిన ఆధారాలు వెల్లడిస్తున్నాయన్నారు. 2011లోనే సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉండగా భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను సబ్ క్రిటికల్ టెక్నాలజీతో కట్టడం వల్ల ప్రజలపై దీర్ఘకాలంగా ఆర్థికభారం పడుతున్నట్లు వివిధ వర్గాల ద్వారా లభించిన సమాచారం మేరకు తెలుస్తోందన్నారు. భద్రాద్రి విద్యుత్‌కేంద్రం పనులను ఓపెన్ కాంపిటీటివ్ బిడ్డింగ్‌కి బదులు నామినేషన్ పద్ధతిలో ఈపీసీ విధానంలో కాంట్రాక్టర్లకు అప్పగించారని, నిర్మాణానికి ఏడేళ్ల కాల వ్యవధి పట్టటంతో నిర్మాణవ్యయం పెరిగిందని పేర్కొన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా పోటీ బిడ్డింగ్ విధానంలో కాకుండా నామినేషన్ ప్రాతిపదికన బీహెచ్ఈఎల్‌కు అప్పగించారని గుర్తు చేశారు. 2018లోనే పూర్తి కావాల్సిన ఈ విద్యుత్‌కేంద్రం ఇప్పటికీ పూర్తికాకపోవడం, విదేశీ బొగ్గుతో ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించటం, తాజా ప్రభుత్వం విదేశీ బొగ్గు అంశాన్ని పక్కనపెట్టి, సింగరేణి నుంచి బొగ్గు తీసుకోవటానికి నిర్ణయించటం వంటి అంశాలను ప్రస్తావించారు. ఇటీవలే ఈ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించామని, ఆగస్టు నాటికి ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి జరుపుతామని అధికారులు చెబుతున్నప్పటికీ, తనకు సందేహాలున్నాయని జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి తెలిపారు. ఎందుకంటే, ఇప్పటికీ అక్కడ బొగ్గును సరఫరా చేసే రైల్వేలైను పనులు పూర్తి కాలేదని, రైల్వే లైను టెస్టింగ్ పనులే 2-3 నెలల పాటు జరుగుతాయని పేర్కొన్నారు.

త్వరలో రఘు, కోదండరాం హాజరు

ఈనెల 18వ తేదీ నుంచి తెలంగాణ విద్యుత్ జేఏసీ ఛైర్మన్ కె.రఘు, తెలంగాణ జేఏసీ ఛైర్మన్ కోదండరాం, విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్, తిమ్మారెడ్డి కమిషన్ ముందు హాజరై.. వివరాలు అందించనున్నారు. ఇప్పటికే ఆయా నిర్ణయాలపై వీరు కమిషన్‌కు ఫిర్యాదు చేయగా.. మరిన్ని వివరాలు అందించాలని కమిషన్ వీరికి కబురు పంపింది. ఈనెల 18వ తేదీన రఘు, 19న కోదండరామ్, 20న వేణుగోపాల్, తిమ్మారెడ్డి కమిషన్ ముందు హాజరయ్యే అవకాశాలున్నాయి. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం తెలంగాణకు ఏ మాత్రం లాభదాయకం కాదని తొలి నుంచి ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా కె.రఘు గళమెత్తారు.

హాజరైన అర్వింద్‌కుమార్, ఎస్‌కే జోషి

కమిషన్ నోటీసులు జారీ చేసిన వారిలో 2014 నుంచి 2023 వరకూ ఇంధనశాఖ కార్యదర్శులుగా ఉన్న అర్వింద్‌కుమార్, సురేష్‌చంద, సునిల్‌శర్మ, జెన్‌కో, ట్రాన్స్‌కో మాజీ సీఎండీ డి.ప్రభాకర్‌రావు, మాజీ విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి తదితరులున్నారు. వీరిలో ప్రభాకర్‌రావు సోమవారం కమిషన్ ఎదుట హాజరయ్యారు. అర్వింద్‌కుమార్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి మంగళవారం హాజరయ్యారు. నాటి నిర్ణయాలన్నీ ప్రభుత్వం ఉన్నత స్థాయిలో తీసుకున్నవేనని, వాటిని తాము అమలు చేయడం మాత్రమే జరిగిందని వారు కమిషన్‌కు నివేదించినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం వల్ల కలిగే నష్టంపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీఈఆర్‌సీ)కి అర్వింద్‌కుమార్ 2016 నవంబరు 30వ తేదీన రాసిన లేఖనే ప్రస్తుతం కమిషన్ విచారణలో కీలకంగా మారింది. ఈ లేఖ రాసినందుకుగాను ఆ మరుసటి రోజే అర్వింద్‌కుమార్‌ను గత ప్రభుత్వం ఢిల్లీకి తిప్పి పంపింది.

గనుల తవ్వకాలకు వార్షిక క్యాలండర్‌ను

రూపొందించండి

- ఆ తర్వాతే టెండర్లు పిలవండి
- ఇసుక రీచ్‌లను మహిళా సంఘాలకు అప్పగించడంపై సర్వే చేయండి
- గనుల శాఖపై సమీక్షలో డిప్యూటీ సీఎం


హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక, వివిధ గనుల తవ్వకాలకు సంబంధించి వార్షిక క్యాలండర్‌ను రూపొందించాలని, ఆ తర్వాతే గనుల టెండర్లు పిలవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయంలో గనుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గడిచిన రెండేళ్లలో గనుల శాఖ రాబడులను ఆయన సమీక్షించారు. గనుల శాఖ ద్వారా ఆదాయాలను పెంచే మార్గాలను అన్వేషించాలన్నారు. రాష్ట్రంలోని నదీ తీరాల్లో ఇసుక తవ్వకాలకు అవకాశమున్న రీచ్‌ల గుర్తింపు, టెండర్లు, ఆదాయానికి సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేసుకోవాలని అధికారులకు చెప్పారు. ఈ అంశంలో సాగునీటి శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇదివరకు పలు గ్రానైట్ క్వారీలకు అపరాధ రుసుములు విధించి, వాటిని మూసేయించారని, ఆ ఫైన్‌ల సొమ్మును ఎంత వరకు వసూలు చేశారంటూ ఆరా తీశారు. ఇసుక రీచ్‌లను ఆయా ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు కేటాయిస్తే ఆదాయం పెరుగుతుందో లేదో సమగ్ర సర్వే చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు అప్పగించడం వల్ల దళారులకు అడ్డుకట్ట వేసినట్లవుతుందన్నారు. ఇసుక రీచ్‌ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం రావాలని, అదే సందర్భంలో ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాగా పట్టా భూముల పేరిట గోదావరి నదీ తీరం వెంట ఇష్టమొచ్చినట్లు ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, వీటిపై నిఘా పెట్టాలని సమావేశంలో పాల్గొన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

రాహుల్‌పై మహారాష్ట్ర రైతు వీరాభిమానం

మణిపూర్ నుంచి ముంబై వరకు.. రాహుల్‌తో కలిసి చెప్పులు లేకుండా జోడోయాత్ర

- ఏఐసీసీ కార్యాలయంలో జగ్గారెడ్డికి తారసపడిన రైతు
- వివరాలు తెలుసుకున్న జగ్గారెడ్డి
- రాహుల్ ప్రధాని కావాలని రైతు ఆకాంక్ష

హైదరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జెండాలతో కుట్టించుకున్న దుస్తులు.. మెడనిండా కాంగ్రెస్ కండువాలు. నెత్తిన ధరించిన టోపీపై కూడా కాంగ్రెస్ గుర్తే.. కాళ్లకు చూస్తే చెప్పులు లేవు. ఈ రకమైన ఆహార్యంతో మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయ ఆవరణలో కనిపించిన ఓ వ్యక్తిని చూసి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి.. పిలిచి ముచ్చట పెట్టారు. అతని పూర్వాపరాలు తెలుసుకున్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్న ఆకాంక్షతో ఉన్న మహారాష్ట్ర రైతు వీరాభిమానం చూసి ఆశ్చర్యం చెందారు. రాహుల్ ప్రధాని అయితేనే రైతులు బాగుపడతారని బలంగా నమ్మిన షిర్డీ ప్రాంతానికి చెందిన సదాశివ లేఖర్ అనే రైతు.. మణిపూర్ నుంచి ముంబై వరకు రాహుల్‌గాంధీతో కలిసి భారత్ జోడో యాత్రలో పాల్గొన్నారు. అయితే రాహుల్‌పై ఉన్న వీరాభిమానంతో చెప్పులు లేకుండానే నడిచారు. ఈ మేరకు వివరాలను జగ్గారెడ్డికి తెలిపారు. ఇంత శ్రమ ఎందుకు పడుతున్నావంటూ ఆ రైతును జగ్గారెడ్డి అడిగితే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యే వరకు ఇలాగే ఆయన వెంట తిరగాలని నిర్ణయించుకున్నట్టు చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే వ్యవసాయానికి మేలు జరుగుతుందని.. రైతులకు మంచి రోజులు వస్తాయని చెప్పారు. ఇప్పటి దాకా రైతులకు మేలు చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలేనని, రాహుల్‌గాంధీ ప్రధాని అయితే రైతులతో పాటు అన్ని వర్గాలకూ అండగా ఉంటారని ఆ రైతు చెప్పారు. రాహుల్‌కు వీరాభిమాని అయిన ఆ రైతు మాటలు విని జగ్గారెడ్డి ముచ్చటపడిపోయారు.



జగ్గారెడ్డితో మహారాష్ట్ర రైతు

బడికి వేళాయె!



నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు

- ఉచిత పుస్తకాలు, యూనిఫామ్‌లు సిద్ధం
- రూ.600 కోట్లతో స్కూళ్లలో మరమ్మతులు
- అమ్మ ఆదర్శ కమిటీలతో పనులు పూర్తి
- ఇప్పటికే ప్రారంభమైన బడిబాట కార్యక్రమం
- 2024-25 అకడమిక్ క్యాలెండర్ విడుదల
- డీఎస్సీ ద్వారా మూడు నెలల్లో కొత్త టీచర్లు

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల పునఃప్రారంభానికి వేళయింది. బుధవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ వంటి అన్నిరకాల స్కూళ్లు తిరిగి తెరచుకోనున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందించడానికి పుస్తకాలు, యూనిఫామ్‌లను ఇప్పటికే సిద్ధం చేశారు. వీటితోపాటు అమ్మ ఆదర్శ కమిటీల పర్యవేక్షణలో స్కూళ్లలో మరమ్మతు పనులు, ఇతర అవసరాల ఏర్పాట్లను పూర్తి చేశారు. స్కూళ్ల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సభ్యులు, టీచర్లు, ఇతర అధికారులు ఉన్నారు. స్కూల్ పరిధిలో చేపట్టే ప్రతి పనినీ ఈ కమిటీల ద్వారానే నిర్వహిస్తున్నారు. స్కూళ్లలో మరమ్మతు పనులు, మంచినీటి సరఫరా, టాయిలెట్ల ఏర్పాటు వంటి పనులను ఈ కమిటీలే చూసుకుంటున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే సుమారు రూ.600 కోట్లతో మరమ్మతు పనులను పూర్తి చేశారు. ఇక ఈ విద్యా సంవత్సరానికి (2024-25) సంబంధించిన అకాడమిక్ క్యాలెండర్‌ను కూడా విద్యా శాఖ ప్రకటించింది. దీని ప్రకారం.. ఈ ఏడాది మొత్తం 229 పనిదినాలు ఉంటాయి. జూన్ 12 నుంచి 2025 ఏప్రిల్ 24వ తేదీ వరకు పాఠశాలలు కొనసాగుతాయి. అక్టోబరు 13 నుంచి 25 వరకు 13 రోజులపాటు దసరా సెలవులు ఇస్తారు. డిసెంబరు 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు, వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 17 వరకు ఆరు రోజులపాటు సంక్రాంతి సెలవులు ఉంటాయి. ఇక ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి సిలబస్‌ను వచ్చే ఏడాది జనవరి 10వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం రివిజన్ తరగతులు నిర్వహించాలి. 1 నుంచి 9వ తరగతులకు సిలబస్‌ను ఫిబ్రవరి 28వ తేదీలోపు పూర్తి చేయాలి. విద్యార్థులందరికీ రోజూ ఐదు నిమిషాలపాటు యోగా, మెడిటేషన్ తరగతులు నిర్వహిస్తారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు మార్చిలో నిర్వహిస్తారు.

మూడు నెలల్లో కొత్త టీచర్లు..

రాష్ట్రంలో 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. మరో మూడు నెలల్లో ఈ కొత్త టీచర్లను నియమించడానికి వీలుగా ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. వీరికితోడు 2008 డీఎస్సీకి సంబంధించి మరో 3వేల మంది ఉపాధ్యాయులను కూడా తీసుకోవాలని నిర్ణయించారు. ఇక పాఠశాలలో ఒక్క విద్యార్థి ఉన్నా.. దానిని మూసివేయకూడదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా స్కూళ్లను తెరవాలని అధికారులను ఆదేశించారు. జీరో అడ్మిషన్ స్కూళ్లను మాత్రమే మూసివేస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఈసారి ఏకోపాధ్యాయ స్కూళ్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మరోవైపు ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లను పెంచాలని సర్కారు భావిస్తోంది. ఇందుకోసం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్కూళ్లు తెరిచిన తర్వాత దీనిని మరింత విస్తృతంగా నిర్వహించనున్నారు. బడికి దూరంగా ఉండే పిల్లలను గుర్తించి, వారిని ప్రభుత్వ బడుల్లో చేర్పించడానికి వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మరోవైపు టీచర్ల బదిలీల ప్రక్రియ కూడా కొనసాగుతోంది. వారం రోజుల్లో దీనిని పూర్తి చేయనున్నారు. దాంతో బదిలీ అయ్యే ఉపాధ్యాయులు కూడా తమ కొత్త పోస్టింగ్‌లో త్వరగా చేరడానికి అవకాశం ఉంటుంది. తద్వారా విద్యా సంవత్సరంలో విద్యార్థుల చదువు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగే అవకాశం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

మీ ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా?

మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా?

- ఎన్నిరోజులకోసారొస్తాయి.. నీళ్లు సరిపోతున్నాయా?
- తాగునీటిపై గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయిస్తున్న సర్కారు

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మీ కుటుంబంలో ఎంతమంది ఉన్నారు..? మీ ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా..? మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి.. ఎన్ని రోజులకో సారి నీటి సరఫరా జరుగుతోంది. శుద్ధమైన నీరు అందుతుందా..? అంటూ గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు ఇంటింటి సర్వే చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు సరిపడా తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించనుంది. కుటుంబానికి సరిపోయే నీటిని అందించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నం చేసినా.. చాలాచోట్ల నీరు రావడం లేదు. వేల కోట్లు వెచ్చించి మిషన్ భగీరథ పథకం నిర్వహిస్తున్నా.. ప్రజల అవసరాలు తీర్చడం లేదని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల పరిధిలో క్షేత్రస్థాయి సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల సోమవారం ప్రారంభమైన ఈ సర్వే.. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో కొనసాగుతోంది. పది రోజుల్లోపు ఈ సర్వేను పూర్తిచేయాలని సంబంధిత విభాగాలు ప్రణాళికలు రూపొందించుకున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్వే బృందాలు సంబంధిత పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నాయి. ఇందు కోసం ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేసింది. సర్వే పూర్తి వివరాలను అందులో పొందుపరచనున్నారు.

సర్వే సాగుతోందిలా..!

ఇంటి యజమాని పేరు, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా? నీటి సరఫరా సక్రమంగా జరుగుతోందా? కుటుంబం మొత్తానికి నీళ్లు సరిపోతున్నాయా అనే వివరాలు సర్వేలో సేకరిస్తున్నారు. అలాగే ఇంటి ఫొటోతోపాటు, మిషన్ భగీరథ కింద ఏర్పాటు చేసిన నల్లా, సంపును సైతం సర్వే సిబ్బంది ఫొటోలు తీస్తున్నారు. అదేవిధంగా భగీరథ స్కీమ్‌కు సంబంధించిన వివరాలతోపాటు కుటుంబంలో ఎంతమంది ఉన్నారు? మహిళలు, పురుషులు ఎంతమంది? కులం, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ వంటి వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. అనంతరం లబ్ధిదారుడి ఫోన్‌కు వచ్చిన ఓటీపీని యాప్‌లో ఎంటర్ చేసిన తర్వాతనే ఆ వివరాలు అప్‌డేట్ అవుతాయి. కాగా, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం కింద ట్యాంకులు నిర్మించి.. ఇంటింటికీ నల్లా నీళ్లు ఇస్తున్నట్టు ప్రకటించింది. దీంతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన జల్ జీవన్ మిషన్‌ద్వారా రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాలేదన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ పథకం నిర్మాణం, అమలులో లోపాలు, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే చేపట్టింది. మిషన్ భగీరథను కేంద్రం పరిధిలోని జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంతో అనుసంధానించాలని ప్రభుత్వం భావిస్తున్నందున సర్వే అనంతరం రాష్ట్రానికి అవసరమైన రిజర్వాయర్లు, పంపింగ్ స్టేషన్లు, ట్యాంకులు, పైప్ లైన్లు, మోటార్ల ఏర్పాటు ఇతర వనరుల కోసం కేంద్రానికి నివేదిక పంపనుంది.

ఎడ్‌సెట్‌లో నవీన్‌కుమార్ స్టేట్ ఫస్ట్

» ఫలితాలు విడుదల.. 96.90% మందికి అర్హత



హైదరాబాద్/బిజినేపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బీఈడీలో ప్రవేశం కోసం నిర్వహించిన ఎడ్‌సెట్ ఫలితాలను మంగళవారం ప్రకటించారు. ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, మహాత్మగాంధీ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ నవీన్‌మిట్టల్ ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ ప్రవేశపరీక్షలో నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మలిశెట్టి నవీన్ కుమార్ మొదటి ర్యాంక్ సాధించాడు. అతనికి 150 మార్కులకు గాను 118 మార్కులు వచ్చాయి. కాగా, ఎడ్‌సెట్‌లో 96.90% మంది అభ్యర్థులు అర్హత సాధించారు. మే 23వ తేదీన ఎడ్‌సెట్ పరీక్షను నిర్వహించగా.. ఈ పరీక్షకు 29,463 మంది హాజరయ్యారు. వీరిలో 28,549 మంది అభ్యర్థులు బీఈడీ కోర్సులో ప్రవేశానికి అర్హత సాధించారు. ఇదిలా ఉండగా, టెట్ ఫలితాలను బుధవారం విడుదల చేయనున్నారు.

గొర్రెల పంపిణీ స్కామ్.. మౌనమే నిందితుల సమాధానం!

» ఏసీబీ ప్రశ్నలకు నోరు మెదపని రాంచందర్, కల్యాణ్

హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో వెలుగు చూసిన రూ.700 కోట్ల కుంభకోణం కేసులో పోలీసుల కస్టడీలో ఉన్న నిందితులు రాంచందర్, కల్యాణ్‌– దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు మౌనంగా ఉంటున్నట్లు తెలిసింది. ఈ కేసుకు సంబంధించి పలు కోణాల్లో సమాధానాలను రాబట్టుకునేందుకు అధికారులు ప్రశ్నించినా సమాధానాల్లేవని సమాచారం. మంగళవారం ఉదయం నిందితులిద్దరినీ వేర్వేరుగా విచారించారు. విచారణ ప్రక్రియను వీడియో కెమెరా ముందు నిర్వహించారు. ఆటోరిక్షాలు, ద్విచక్ర వాహనాలు, అంబులెన్స్‌ల వాహన రిజిస్ట్రేషన్ నంబర్లు పెట్టి, గొర్రెలను తరలించడంపై ప్రశ్నించినట్లు తెలిసింది. కీలక ప్రశ్నలకు మూగనోము పట్టినట్లు సమాచారం. ఓ దశలో అధికారులు తమ వద్ద ఉన్న ఆధారాలను నిందితుల ముందు పెట్టగా.. వారు చూచాయగా సమాధానాలిచ్చినట్లు తెలుస్తోంది. అయితే.. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడైన మొహియుద్దీన్ గొర్రెల పంపిణీ పథకంలోకి ఎలా ప్రవేశించాడు? ఎలా చక్రం తిప్పాడు? అనే అంశాలపై వారి నుంచి కొంతమేర సమాధానాన్ని రాబట్టినట్లు తెలిసింది. రాంచందర్, కల్యాణ్ బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను దర్యాప్తు సేకరించినట్లు సమాచారం. వీరిద్దరి కస్టడీ బుధవారంతో ముగియనుంది. దీంతో.. బుధవారం వీరిద్దరినీ రాజకీయ నాయకుల ప్రమేయంపై ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది.

టీఎస్ఎల్‌డీఏ సీఈవో రాంచందర్‌పై వేటు

తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ (టీఎస్ఎల్‌డీఏ) సీఈవో డాక్టర్ రాంచందర్ నాయక్‌పై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. రాంచందర్‌ను ఇటీవల ఏసీబీ అధికారులు అరెస్టు చేసి విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాంచందర్‌పై సస్పెన్షన్ వేటువేశారు.

అడుగుకో మందుపాతర!

అడుగడుగునా బూబీ ట్రాప్‌లు.. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల చక్రవ్యూహం

» స్థానికులు, వన్యప్రాణులకు ముప్పు
» భద్రత బలగాలే లక్ష్యంగా స్కెచ్
» కర్రెగుట్టల నుంచి కొంగాల దాకా గుర్తింపు
» వందల సంఖ్యలో బాంబుల నిర్వీర్యం
» 70 బూబీట్రాప్‌ల తొలగింపు
» 'ఆపరేషన్ జలశక్తి'కి పెను సవాల్



బూబీ ట్రాప్‌లు; తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న బాణాలు, ఈటెలు

ములుగు, చర్ల, జూన్ 11: మావోయిస్టుల ఏరివేత పేరుతో అడవుల్లో బలగాల మోహరింపు.. దానికి కౌంటర్‌గా పోలీసులే లక్ష్యంగా బూబీట్రాప్స్, మందుపాతరలతో నక్సల్స్ ప్రతివ్యూహాలతో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు ఏజెన్సీల పౌరులు గజగజ వణికిపోతున్నారు. ఇటీవల వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు ఏసు అనే స్థానికుడు బలవ్వడంతో.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని గిరిజనులు విలవిల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ సంఖ్యలో మందుపాతరలను, బూబీ ట్రాప్‌లను గుర్తించడంతో ఏజెన్సీల్లోని పల్లెల్లో కలకలం చెలరేగుతోంది.

పోలీసులే టార్గెట్‌గా వ్యూహాలు..!

ప్రస్తుతం మావోయిస్టులకు ఛత్తీస్‌గఢ్ కంచుకోటగా ఉన్నా.. గడిచిన ఆర్నెల్లలో జరిగిన 11 ఎన్‌కౌంటర్లలో 119 మంది మావోయిస్టులు దుర్మరణంపాలయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మావోయిస్టులు తెలంగాణలోకి అడుగు పెట్టకూడదనే లక్ష్యంతో గ్రేహౌండ్స్ బలగాలు రేయింబవళ్లు సరిహద్దుల్లో పహారాకాస్తున్నాయి. చర్ల అడవులతోపాటు.. ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాలు-- కర్రెగుట్ట, కొంగాల అభయారణ్యాలు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులుగా ఉన్నాయి. ఇరు రాష్ట్రాల మధ్య రోడ్డు మార్గాన్ని మినహాయిస్తే.. బలగాలు నక్సల్స్ స్థావరాలను చేరాలంటే.. దట్టమైన ఈ అరణ్యాలను దాటి వెళ్లాలి. ఈ మార్గాల్లో వచ్చే పోలీసులను టార్గెట్‌గా చేసుకుంటూ.. మావోయిస్టులు పెద్ద సంఖ్యలో మందుపాతరలను అమర్చారు. గుట్టలను ఎక్కి-దిగే చోట బూబీ ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. కాలి అడుగు పడితే.. కొద్దిపాటి ఒత్తిడికే భారీ విస్ఫోటనం చెందేలా వందలు.. వేల సంఖ్యలో బాంబులను అమర్చినట్లు తెలుస్తోంది. బూబీ ట్రాప్‌లో పడితే.. వారి పరిస్థితి ప్రత్యక్ష నరకమే.! ఒకవేళ ప్రాణాలతో బతికినా.. ఒంట్లోకి గుచ్చుకుపోయిన పదునైన కర్రలు, పదునైన రాడ్లను తొలగించేప్పుడు ఎంతటివారైనా విలవిల్లాడాల్సిందే. బలగాల వెంట బాంబ్ డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్‌లు ఉన్నా.. ఏమాత్రం ఆదమరిచినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టమవుతోంది. డ్రోన్ల సాయంతో మావోయిస్టుల కదలికలను పసిగట్టినా.. వారిని చేరేందుకు మందుపాతరలు, బాంబులు, బూబీట్రాప్స్‌తో కూడిన చక్రవ్యూహాలను దాటుకుని వెళ్లడం కత్తిమీద సాములాంటిదే.! వేసవిలో ఆకురాలే కాలాన్ని అనుకూలంగా మలచుకున్న బలగాలు.. 11 భారీ ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులను కోలుకోలేకుండా దెబ్బతీశాయి. ఇప్పుడు వర్షాలు ప్రారంభం కావడంతో 'ఆపరేషన్ జలశక్తి' పేరిట కూంబింగ్ ప్రారంభించాయి. ఈ క్రమంలో.. తాజాగా ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని బీమారంపాడు అడవుల్లో భద్రతాబలగాలు 70 బూబీట్రాప్‌లను గుర్తించాయి. వాటిలోంచి 4,396 పదునైన కర్రలను వెలికితీశాయి. చర్ల సీఐ రాజువర్మ నేతృత్వంలో బూబీట్రాప్‌ల గుర్తింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇటు తెలంగాణలోనూ 2021, 2022 సంవత్సరాల్లో ములుగు జిల్లా పోలీసులు నాలుగు భారీ మందుపాతరలు, పేలుడు సామగ్రిని సీజ్ చేశారు. ఆ తర్వాత అప్పటి ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్ నేతృత్వంలో జరిపిన తనిఖీల్లో అడవుల్లో పెద్ద ఎత్తున బూబీట్రాప్స్, బాణాలు, ఈటెలు, కార్డెక్స్ వైర్లు, ప్రెషర్‌కుక్కర్లు, బకెట్ బాంబులు, జెలిటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, ఐఈడీలను పేల్చేందుకు ట్రిగ్గర్లుగా వాడుతున్న కారు డిజిటల్ కీచైన్లు, ఎలక్ట్రానిక్ డివైజ్‌లను సీజ్ చేశారు.

బలవుతున్న అమాయకులు..

- 2003లో తొలిసారిగా మావోయిస్టుల చర్యతో సామాన్యులు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. అప్పట్లో వాజేడు మండలం కొప్పునూరు గ్రామ సమీపంలోని గుండ్లవాగు బ్రిడ్జి వద్ద అమర్చిన మందుపాతర కారణంగా చిట్టెం అచ్చాలు అనే వ్యక్తి బలవ్వగా.. మరో ఇద్దరు గాయపడ్డారు.
- 2018లో కొంగాల అటవీప్రాంతంలో మందుపాతరకు ఓ పాడి ఆవు మృతిచెందింది.
- 2019లో వెంకటాపురం మండలం ముకునూరు పాలెం అటవీప్రాంతంలో జరిగిన పేలుడులో దివ్యాంగుడైన సోయం పెంటయ్య చనిపోయారు.
- ఈనెల 3న వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో బాంబుపేలి జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు(55) మరణించాడు.
- నక్సల్స్ మాత్రం మందుపాతరలను పెట్టడం, బూబీట్రాప్స్ వ్యూహాలను సమర్థించుకుంటున్నారు. ఏసు మృతి తర్వాత ఆత్మరక్షణ కోసం ఈ వ్యూహాలు తప్పవంటూ లేఖను విడుదల చేశారు.



చిన్నారి వేదవల్లి

ప్లీజ్.. నా బిడ్డను ఆదుకోండి

» దాతలకు ఓ తండ్రి వేడుకోలు
» బ్లడ్ కేన్సర్ బారిన చిన్నారి
» ఇప్పటికే వైద్యానికి 55 లక్షల ఖర్చు
» ఇక భరించలేని దీనస్థితిలో తల్లిదండ్రులు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా పెంచుకున్న తమ చిన్నారి బ్లడ్ కేన్సర్ బారి నుంచి బయట పడిందన్న సంతోషం ఆ కుటుంబానికి ఎంతో కాలం నిల్వలేదు. రోగం తిరగబెట్టడంతో ఆ చిన్నారిని మళ్లీ ఆస్పత్రి పాలైంది. ఇప్పటికే వైద్యానికి లక్షలు ఖర్చుపెట్టిన ఆ తల్లిదండ్రులు ప్రస్తుతం దీన స్థితిలో ఉన్నారు. ఈ స్థితిలో తన బిడ్డకు మెరుగైన చికిత్స అందించడానికి దాతలు సహకరించాల్సిందిగా వేడుకుంటున్నారు. ఎల్బీనగర్‌లోని రఘు, మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రఘు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. రెండో తరగతి చదువుతున్న పెద్దకుమార్తె వేదవల్లికి 2022 నవంబరులో తీవ్ర జ్వరం వచ్చింది. ముంబైలోని టాటా మెమోరియల్ కేన్సర్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా అక్కడ ఆమెకు బ్లడ్ కేన్సర్ (అనాప్లాస్టిక్ లార్జ్ సెల్ లార్జ్ లింఫోమా) నాల్గో దశలో ఉన్నట్లు తేల్చారు. దీంతో ఆ చిన్నారికి కీమోథెరపీ, రేడియేషన్స్ థెరపీ, బోన్‌మారో మార్పిడి చేసినట్లు తండ్రి రఘు వివరించారు. ఆ తర్వాత ఆమె జబ్బు నుంచి బయట పడిందని సంతోషిస్తున్న సమయంలో రోగం తిరగబెట్టింది. రోజూ విపరీతమైన రక్తస్రావం కావడంతో ప్లేట్ లేట్స్ గణనీయంగా తగ్గిపోయాయి. దీంతో ఆమెను బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి తరలించగా 65 రోజుల నుంచి అక్కడ చికిత్సలు అందిస్తున్నారు. ఇప్పటికే దాదాపు రూ.55 లక్షల వరకు వ్యయం భరించామని, ఇంకా రూ.10-20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని తండ్రి రఘు ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఎనగందుల రఘు, యాక్సిస్ బ్యాంక్, అకౌంట్ నంబర్ - 008010101942448. ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూటీఐబీ 0001134, ఎల్బీనగర్ బ్రాంచ్, హైదరాబాద్‌కు సాయం అందించాలని కోరారు. వివరాలకు 9440611760 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు.


వరదతో రైతుల్లో ఆశ!

కృష్ణా ప్రాజెక్టులకు స్వల్పంగా వరద రాక.. గత ఏడాది వరదలు లేకపోవడంతో ఎండిన పంటలు

మహబూబ్‌నగర్/హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులకు స్వల్పంగా వరద రాక ప్రారంభమైంది. ఈ ఏడాది వర్షపాతం అధికంగా నమోదవుతుందని అంచనాల మేరకు ప్రాజెక్టుల పరిధిలోని రైతులు వరదపై ఆశలు పెట్టుకున్నారు. గత ఏడాది కృష్ణా బేసిన్ పరిధిలో వర్షాలు తక్కువగా కురవడం వల్ల ఆశించిన స్థాయిలో వరదలు రాలేదు. ఈ కారణంగా పలు ఎత్తిపోతల పథకాల కింద వానాకాలం సీజన్‌లోనే వరి పంట ఎండిపోగా ప్రాజెక్టుల కింద యాసంగి సీజన్‌లో క్రాప్ హాలిడే కూడా ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులకు కర్ణాటకలో కురిసే వర్షాలే ప్రధాన ఆదరువుగా ఉంటాయి. ఎగువ నుంచి వరద రాకపోతే ఆయకట్టు పూర్తిస్థాయిలో సాగు కాదు. సాధారణంగా కృష్ణా నదికి 90 రోజుల వరద దినాలు ఉంటాయి. జూన్ మొదటి వారంలో వరద ప్రారంభమై అక్టోబరు వరకు కొనసాగుతుంది. గత ఏడాది మాత్రం 60 రోజుల కంటే తక్కువగా వరద దినాలు నమోదయ్యాయి. ఈ కారణంగా జూరాల నుంచి మొదలుకొని, నాగార్జున సాగర్ వరకు పంటల సాగుకు తీవ్ర గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈసారి వరదల రాక మొదలవడంతో సాగు, తాగునీటికి కొరత ఉండదని భావిస్తున్నారు. సోమవారం (ఈనెల 11) ఉదయం వరకు ఈ సీజన్‌లో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు 14 టీఎంసీల కొత్త నీరు వచ్చి చేరింది. ప్రస్తుత అంచనాల ప్రకారం వర్షాలు ఎక్కువగా కురిస్తే వానాకాలంతో పాటు, యాసంగి పంటల సాగుకు కూడా ఢోకా ఉండదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కనీస నీటి మట్టాలు చేరాకే నిర్ణయం: ఈఎన్‌సీ(జనరల్)

రాష్ట్రవ్యాప్తంగా జలాశయాల్లో కనీస మట్టాలకు నిల్వలు చేరుకున్నాకే నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం 2024-25 వాటర్ ఇయర్‌లో వానాకాలంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నీటి విడుదలపై ఈఎన్‌సీ(జనరల్) అధ్యక్షతన వర్చువల్‌గా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలను పరిశీలించిన యంత్రాంగం.. ఇప్పట్లో నీటివిడుదలపై నిర్ణయాలు వద్దని తీర్మానించింది.



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ

నీటినిల్వ టీఎంసీల్లో- ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో

ప్రాజెక్టు పేరు	నీటినిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో	గత ఏడాది (11/06/2023) (టీఎంసీల్లో నిల్వ)
ఆలమట్టి	129.72	24.07	21251	430	21.22
నారాయణపూర్	37.64	24.13	3652	96	18.82
ఉజ్జయిని	117.24	33.73	8912	151	49.03
జూరాల	9.66	5.54	7211	139	8.15
తుంగభద్ర	105.79	4.92	4024	54	5.01
శ్రీశైలం	215.81	34.15	5051	72	34.00
నాగార్జునసాగర్	312.05	122.85	0000	860	150.01
పులిచింతల	45.77	0.73	255	50	34.24

ప్రతిదానికి ముఖ్యమంత్రిదే బాధ్యతనా?

ప్రభుత్వ శాఖల్లో జరిగే అన్ని చర్యలను సీఎంకు ఆపాదించలేం

ఓయూ హాస్టళ్ల బంద్ నోటీస్‌పై వివాదంలో హైకోర్టు వ్యాఖ్యలు



హైదరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వంలో జరిగే ప్రతి పనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలా? రేపు ఓ బిచ్చగాడు వచ్చి భిక్షాటనే నా ఆదాయం. కానీ, రోడ్డును ఆక్రమించానని ఖాళీ చేయమంటున్నారు. దీనికి ముఖ్యమంత్రే బాధ్యులు అంటే ఏం చేస్తారు?' అని హైకోర్టు ప్రశ్నించింది. వేసవి సెలవుల సందర్భంగా విశ్వవిద్యాలయంలోని వసతిగృహాల మూసివేత నోటీస్‌పై నెలకొన్న వివాదంలో సీఎం రేవంత్‌రెడ్డి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ పలువురు ఓయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. విద్యార్థుల పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. అడ్మిషన్ దశలోనే డిస్మిస్ చేస్తూ ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ శాఖల్లో జరిగే ప్రతి చర్యను ముఖ్యమంత్రికే ఆపాదించలేమని స్పష్టం చేసింది. "ఒకే వ్యవహారానికి సంబంధించి కౌంటర్ కేసులు పెట్టడం కుదరదు. హాస్టళ్ల మూసివేత వ్యవహారంలో ఫేక్ నోటీసుపై ఇప్పటికే కేసు నమోదైంది. అది విచారణలో ఉండగా ఇంకో కేసు అవసరం లేదు" అని పేర్కొంది. ఈ మేరకు రేవంత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న పిటిషన్‌ను కొట్టేసింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో చార్జ్‌షీట్



హైదరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులు మంగళవారం నాంపల్లి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు దర్యాప్తు పురోగతి, నిందితుల వాంగ్మూలాలు, సేకరించిన ఆధారాలను చార్జ్‌షీట్‌లో వివరించారు. మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదవ్వగా.. ఇప్పటి వరకు ఆరుగురు నిందితులను గుర్తించామని, వారిలో నలుగురిని-- టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ప్రైవేటు వ్యక్తి శ్రవణ్‌కుమార్ పేర్లను ప్రస్తావించారు. కుట్రకు బీజం పడిందెక్కడ? ఎలా అమలు చేశారు? అనే వివరాలతోపాటు.. నిందితుల వాంగ్మూలాల మేరకు రాజకీయ నాయకులు, పత్రికా ప్రముఖులు, ఓ న్యాయమూర్తి, ఇతరుల ఫోన్లను ఎలా ట్యాప్ చేశారు? అనే అంశాలను చార్జ్‌షీట్‌లో ప్రస్తావించారు. కాగా.. రిమాండ్‌లో ఉన్న భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం వాదనలు పూర్తయ్యాయి. ఈ వ్యాజ్యంపై బుధవారం తీర్పు వెలువడనుంది. ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, శ్రవణ్‌పై పోలీసులు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 12 జూన్ 2024
diksuchi@andhrajyothy.com



యాంత్రీకరణతో కలిగిన ప్రయోజనాలు ఎన్నో. మానవ నాగరికతలో అది చెప్పుకోదగ్గ మైలురాయి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలియాలంటే మెకానికల్ ఇంజనీరింగ్‌పై అవగాహన ఉండాలి. ఈ డిసిప్లిన్‌పై అవగాహనకు తోడు అధ్యయనంతో వచ్చే ఉద్యోగాలు, కెరీర్ పరంగా ఎదుగుదల ఎలా ఉంటుందో చూద్దాం.

కోర్ బ్రాంచెస్‌లో కీలకం
మెకానికల్ ఇంజనీరింగ్

కౌన్సెలింగ్ గైడెన్స్

కదలిక ఉన్న పరికరాల డిజైన్, అభివృద్ధి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు సహా సమస్తం మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి వస్తాయి. మానవుడి రోజువారి జీవితంతో ఈ సబ్జెక్టుకు విడదీయరాని అనుబంధం ఉంది. నివశిస్తున్న భవనంతో మొదలుకుని డ్రైవ్ చేసే వాహనం వరకు చాలా వాటిని మెకానికల్ ఇంజనీరింగ్ ఉనికికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ప్రాబ్లమ్ సాల్వింగ్ కూడా ఇందులో భాగం. సైన్స్, మేథ్స్ ఉపయోగించి మెకానికల్ ఇంజనీర్లు పలు సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటారు. గతాన్ని ఆధారం చేసుకుని మరింత మెరుగైన యంత్రాలను కూడా సూచిస్తారు. టెక్నాలజీతో వచ్చిన అడ్వాన్స్‌మెంట్ ఫలితంగా వివిధ ప్రక్రియల మెరుగుదలకు తోడు సమస్యలకు మంచి పరిష్కారం చూపగలుగుతారు. అందుకే మెకానికల్ ఇంజనీర్లు బయోమెడికల్, మాన్యుఫాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, ఆటోమేటివ్ రంగాల్లో ఉపాధిని పొందగలుగుతున్నారు. మెడికల్ డివైజ్‌లు, ఎలివేటర్లు, ఇంజన్లు తదితరాలన్నింటిలో మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్ పనులు సక్రమంగా నిర్వహించగలుగుతున్నారు.

వివిధ బ్రాంచ్‌లు

మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి పలు బ్రాంచీలు వస్తాయి. ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమేషన్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఆటోమొబైల్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఆటోమేటివ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్(ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్), మెకానికల్ అండ్ రైల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(ఆటోమొబైల్), మెకానికల్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ ఇంజనీరింగ్(మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్), మెకానికల్ ఇంజనీరింగ్(ప్రొడక్షన్), మెకానికల్ ఇంజనీరింగ్(వెల్డింగ్ టెక్నాలజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమొబైల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిజైన్, మెకట్రానిక్స్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆటోమేటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమొబైల్ సర్వీసింగ్ వంటివన్నీ మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకే వస్తాయి.

కెరీర్ అవకాశాలు

పలు కంపెనీలు వీరికి జాబ్స్ ఇస్తున్నాయి. గోద్రేజ్, మహీంద్రా అండ్ మహీంద్రా, లారెన్స్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి), కిర్లోస్కర్, థెర్మాక్స్, అశోక్ లేలాండ్, బీహెచ్ఈఎల్, ఇస్రో, కోల్ వంటి టాప్ పర్ఫార్మింగ్ కంపెనీలు వీరికి ఇచ్చే జాబ్స్ చాలా ఉపయోగకరంగా, వృత్తిలో ఎదిగేందుకు వీలు కల్పించే విధంగా ఉంటాయి. నిజానికి అకడమిక్ గ్యాప్‌ని పూరించేందుకు బీటెక్ కోర్సు తోడ్పడుతుంది. నైపుణ్యం, జాబ్‌లో ఇంప్రూవ్‌మెంట్‌కు అవసరపడుతుంది. అందుకే చదువుతున్నప్పుడే ఇండస్ట్రియల్ ఎక్స్‌పోజర్ చాలా అవసరం. లోతైన అవగాహన కోసం పీజీ చేస్తే ఇంకా మంచిది. మెకానికల్ ఇంజనీరింగ్‌లో లెక్కలేనన్ని అవకాశాలు ఎదురుచూస్తూ ఉంటాయి. సంబంధిత అవగాహన, నైపుణ్యాలను అనుసరించి విలక్షణమైన జాబ్స్‌ను పొందవచ్చు.

కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్: పెద్ద పెద్ద నిర్మాణాల్లో మరొక భవన నిర్మాణంలోనూ మెకానికల్ ఇంజనీర్ అవసరం ఉంటుంది. వెంటిలేషన్, కూలింగ్, హీటింగ్ వంటి పనులు అక్కడ ఉండేవారికి ఎలాంటి అపాయం కలుగని రీతిలో ఉండేందుకు మెకానికల్ ఇంజనీర్ల సూచనలు, సలహాలు అవసరమవుతాయి.

ఆటోమేటివ్ ఇంజనీర్: ఆటోమోటివ్ ఇండస్ట్రీలో వివిధ వాహనాల ఉత్పత్తి, డిజైనింగ్‌లో వీరి సేవలు అవసరమవుతాయి. ఇందులో మళ్ళీ కస్టమర్, మిలిటరీ వాహనాలంటూ ప్రత్యేకంగానూ ఉంటాయి. సురక్షితంగా కొత్త ఫీచర్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఏరోడైనమిక్స్ తదితరాల్లో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర ఉంటుంది.



రోబోటిక్ ఇంజనీర్: రోబోటిక్స్ నిర్మాణం, ప్లాన్, నిర్వహణలో పాలుపంచుకోవాలి. డిజైన్, టెక్నాలజీకి తోడు హెల్త్‌కేర్, మెడికల్ డివైజ్‌ల కోసం రోబోట్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ప్రాసెస్ ఇంజనీర్: తార్కికంగా ఆలోచించడం, సరికొత్తగా చేయాలన్న ఆలోచన - అమలుపై ఆసక్తి ఉన్న మెకానికల్ ఇంజనీర్లు బీటెక్ తరవాత ప్రాసెస్ ఇంజనీరింగ్‌ను ఎంచుకోవాలి. సంబంధిత విధానాల మెరుగుదలలో ప్రాసెస్ ఇంజనీర్ల పాత్ర ఇతోధికంగా ఉంటుంది. వాటర్ అండ్ పవర్ సప్లయ్, ఫార్మాస్యూటికల్స్, డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో వీరి అవసరం చాలా ఉంటుంది.

మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్: వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మెషీన్ల డిజైనింగ్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్ పరిధిలోకి వస్తుంది. మెషీన్ విభాగాలు వేటినైనా వీరే రూపొందిస్తారు. అప్లయిన్సెస్ నుంచి ఫుడ్ వరకు వాటికి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్ట్ మేనేజర్: వివిధ పనులను ప్రాజెక్టులుగా మలిచి టీమ్‌లను సదరు సంస్థలు నియమిస్తాయి. వారందరితో సక్రమంగా పనిచేయిస్తేనే సదరు ప్రాజెక్ట్ పని పూర్తవుతుంది. ప్రాజెక్టుకు మేనేజర్‌గా అనుభవం బాగా ఉన్న వ్యక్తులను నియమిస్తారు. తమ టీమ్‌లోని సభ్యులతో సమర్థంగా పనిచేయించడమే కాదు, ఫలితాలను రాబట్టే పనిని వీరు చేయాల్సి ఉంటుంది. ఇందులోనూ ఎక్స్‌పీరియెన్స్‌డ్ మెకానికల్ ఇంజనీర్లు నేతృత్వం వహిస్తారు.

సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: కస్టమర్ బిల్డింగ్‌లో వీరుంటారు. యంత్రాలు సమర్థంగా, నిరంతరాయంగా పనిచేసే విషయంలో నిమగ్నమై ఉంటారు. క్లయింట్ విజిట్స్, మెషీన్ల చెకింగ్, పనికిరాని వాటిని తొలగించి కొత్తవాటిని ఉంచడం వంటి పనులు ఉంటాయి.

మెటీరియల్స్ ఇంజనీర్: వివిధ యంత్రాల ఉత్పత్తిలో మెటీరియల్ సేకరణ, పరీక్షించడం, మోడిఫై, ఎవాల్యుయేషన్ పనులు ఉంటాయి.

కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: ఫ్యాక్టరీ లేదంటే పనిచేసే చోట పరిశోధన, డిజైన్, డెవలప్‌మెంట్, సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్ పనులు ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే.

ప్రొఫెసర్స్, లెక్చరర్స్: మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ లేదంటే యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయితే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బోధకులుగా రాణించవచ్చు. అంటే అకడమిక్ వాతావరణంలో ఉండొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు: యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి ఎంపికైతే ఆరంభంలోనే మంచి జీతం, అధికారిక హోదా తద్వారా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థలు మొదలుకుని పలు ఇతర విభాగాల్లో మెకానికల్ ఇంజనీర్లు అవసరమవుతారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్: బాస్‌గా మారడం అన్నమాట. సొంతంగా పైకి ఎదగాలన్న ఆకాంక్ష ఉంటే అందుకు సొంత ఆలోచనలు తోడైతే ఇండిపెండెంట్‌గా యూనిట్ పెట్టుకోవచ్చు. ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. తానే మరికొందరికి ఉపాధి కల్పించవచ్చు.

ప్రయోజనాలు

మనిషి దైనందిన జీవితంతో ముడిపడినది మెకానికల్ ఇంజనీరింగ్. అందులో భాగంగా వివిధ పరిశ్రమల్లో తలెత్తే సమస్యల పరిష్కారంలో మెకానికల్ ఇంజనీర్లు విశిష్ట పాత్రను పోషిస్తారు. మెషీన్స్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్, మెయింటెనెన్స్ అనాల్సిస్ కాన్సెప్టులు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో భాగం. ఈ నాలుగేళ్ళ కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉజ్వల కెరీర్‌కు రహదారిని నిర్మిస్తుంది. మేథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, థియరీ ఆఫ్ మెకానిక్స్, మెషీన్ డ్రాయింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తదితరాలు కోర్సులో ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్, రీసెర్చ్, డిజైన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించి నైపుణ్యాల పెంపునకు పై అంశాల అధ్యయనం ఉపయోగపడుతుంది. సంబంధిత నైపుణ్యాలకు పదునుపెట్టుకోవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది. వివిధ ఉత్పత్తులకు అవసరమైన యంత్రాల నిర్మాణం, మెరుగుదలలోనూ పాత్ర ఉంటుంది. మొత్తమ్మీద యంత్ర పురోగతితో మానవాభివృద్ధి ముడిపడి ఉందన్న అవగాహన ఉంటే సమాజంలో మెకానికల్ ఇంజనీర్ల అవసరం ఎంత అన్నది అర్థమవుతుంది. అవకాశాలకు ఆకాశమే హద్దు అన్న విషయమూ అవగతమవుతుంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

GS Mock Questions

నిన్నటి తరువాయి

40. Consider the following statements:

Statement I: Supreme court of India sometimes exercises executive and legislative functions in specific scenarios ,including issuing guidances and directives to governmental bodies.

Statement II: Article 142 empowers the supreme court in the exercise of its jurisdiction may pass such decree or make such order as is necessary for doing completely justice in any cause or matter pending before it.

Which one of the following is correct in respect of the above statements?

a. Both Statement-I and Statement-II are correct and statement-II is the correct explanation for statement-I

b. Both Statement-I and Statement-II are correct and Statement-II is not the correct explanation for Statement-I statement _I is correct but Statement-II is incorrect.

statement-I is incorrect but Statement-II is correct.

41. Consider the following:

1. Service voters 2. Absentee voters
3. Electors on election duty

How many of the above are eligible for voting through postal ballots?

a. Only one b. Only two
c. All three d. None

42. Consider the following statements regarding the Electoral bonds scheme which was recently struck down by the supreme court:

1. They are interest-free bonds issued like promissory notes.
2. All registered parties were eligible to get donations through electoral bonds.
3. A non-citizen also could purchase the bond.

How many of the statements given above are correct?

a. Only one b. Only two
c. All three d. None

43. Consider the following:

1. Indra Sawhney & others Vs. Union of India
2. M. Nagaraj Vs. Union of India
3. Janhit Abhiyan Vs. Union of India

How many of the above have bearing on the reservation policy?

a. Only one b. Only two
c. All three d. None

సివిల్స్ ప్రిలిమ్స్

44. Consider the following statements regarding finances of Panchayat Raj institutions (PRIs):

1. Property tax on lands is a source of own tax revenue for PRIs.
2. More than 60 percent of their revenues come from internal sources.

Which of the statements given above is/are correct?

a. only 1 b. only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

45. Consider the following statements regarding the street vendors Act, 2014:

1. As per the act, every street vendor shall have the right to carry on the business of street vending activities.
2. It provides for the establishment of Town vending Committees in each local authority.
3. It also provides for the survey of street vendors once every four years.

How many of the above statements are correct?

a. Only one b. Only two
c. All three d. None

46. Consider the following statements regarding Surrogacy (Regulation) Amendment Rules, 2024:

1. The recent amendment prohibited the use of donor gametes by intending couple for surrogacy.
2. Single woman (widow or divorcee) undergoing surrogacy must use self-eggs and donor sperms to avail surrogacy procedure.

Which of the statements given above is/are correct?

a. Only 1 b. Only 2
c. Both 1 & 2 d. Neither 1 nor 2

47. Consider the following:

1. Not less than 10% reservations in Government or Government aided higher educational institutions for PwDs.
2. Not less than 5% reservation in Government jobs for PwDs.
3. Reservation for PwDs is not applicable to police forces.

How many of the above are provided under the Rights of Persons with Disabilities Act,2016?

a. Only one b. Only two
c. All three d. None

48. Consider the following statements regarding 106th Constitutional Amendment:

1. It provides reservation of 1/3rd seats for women in the parliament.
2. The act applicable to all states and union territories.

Which of the statements given above is/are correct?

a. only 1 b. only 2
c. Both 1 and 2 d. Neither 1 nor 2

49. With reference to the simultaneous elections, seen in news, which of the statements given below is correct?

a. Simultaneous elections not implemented in India till now.
b. Simultaneous elections have to happen in a single day.
c. Simultaneous elections is an idea which aims synchronize all elections from panchayats to parliament.
d. Rammath Kovind Committee has been set up to make recommendations regarding simultaneous elections.

50. Consider the following statements regarding disqualification of lawmakers in India:

1. High courts can declare an election to a member of parliament void.
2. The aggrieved person can appeal to the Supreme court against the order of the High Court.
3. A member does not have to vacate the office immediately if the appeal is pending in the Supreme Court.

How many of the statements given above are correct?

a. Only one b. Only two
c. All three d. None

ANSWERS

40. a	43. a	46. b	49. d
41. c	44. a	47. b	50. c
42. a	45. b	48. d	

Prepared by : CSB Academy, Hyderabad

లిటిల్స్




అడగకూడని వరాలు

ఒక ఊరిలో ఒక జంట నివసిస్తూ ఉండేవారు. వారిద్దరికీ అమితమైన కోరికలు, ఆశలు ఉండేవి. "దేవుడు ప్రత్యక్షమై వరాలు ఇస్తే బావుండును" అనుకొనేవారు. వారికి ఒకే సంతానం. భర్త అప్పుడప్పుడు సరదాగా- "మన పిల్లవాడికి మీసాలు వచ్చిన తర్వాత విశ్రాంతి దొరుకుతుంది" అనేవాడు. ఒక రోజు వారింటికి ఒక బాటసారి వచ్చి ఆశ్రయం కోరాడు. అతనికి దంపతులు అతిథ్యమిచ్చారు. మాటల్లో తమ కోరికల గురించి చెప్పారు. అప్పుడు ఆ బాటసారి- "నేను మీకు మూడు వరాలు ఇస్తాను.. కోరుకోండి" అన్నాడు. అప్పుడు భర్త - "మా పిల్లవాడికి మీసాలు వస్తే నేను విశ్రాంతి తీసుకుందామనుకుంటున్నా" అన్నాడు. భార్య - "నేను ఏ వస్తువు తాకినా అది బారెడు బంగారం కడ్డీలా మారిపోవాలి" అని కోరుకుంది. బాటసారి 'తథాస్తు' అన్నాడు. వెంటనే ఉయ్యాలలో ఉన్న పిల్లవాడికి మీసాలు మొలిచాయి. భార్య పొరపాటున ముక్కును తుడుచుకోవటంతో- ముక్కు మూరెడు బంగారంగా మారిపోయింది. ఆ భార్యభర్తలిద్దరికీ ఏం చేయాలో తెలియలేదు. అప్పుడు ఆ బాటసారి- "మీకు ఇంకో వరం ఉంది.. కోరుకోండి" అన్నాడు. అప్పుడు వారిద్దరు - "మాకు ముందు ఇచ్చిన వరాలు వద్దు.. మామూలుగా మార్చండి" అని కోరుకున్నారు. ఆ తర్వాతి కాలంలో ఎప్పుడూ వారు అత్యాశకు పోలేదు.


నీతి: అత్యాశ లేనిపోని అనర్థాలు తెచ్చిపెడుతుంది.

సరైన నీడ ఏది?






7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 330

6		3		2				
				8	9	6	3	7
							1	
8		9	1		4			2
1		6	3		8	7		5
3			2		7	9		1
	8							
9	3	2	8	4				
				1		8		3

సుడోకు - 329 సమాధానం

6	8	7	5	2	9	4	3	1
1	9	3	4	8	7	2	6	5
4	5	2	6	1	3	7	8	9
5	1	9	2	7	8	3	4	6
7	6	8	3	4	1	9	5	2
3	2	4	9	5	6	1	7	8
2	7	5	1	6	4	8	9	3
8	3	6	7	9	2	5	1	4
9	4	1	8	3	5	6	2	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.